ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం 09.01.2025 | సంపుటి : 11 సంచిక : 182 | పేజీలు : 12 వెల: రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
JANAMSAKSHI TV
జనంసాక్షి tv

తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



## సరిహద్దులో బంగ్లా ఆక్రమణలు అవాస్తవం

**అవన్నీ ఆధారంలేని కథనాలే కొట్టిపారేసిన బీఎస్ఎఫ్**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**భారత్‌లో 5 కిలోమీటర్ల మేరకు భూభాగాన్ని బంగ్లాదేశ్ సైన్యం ఆక్రమించుకొందన్న మీడియా కథనాలను సరిహద్దు భద్రతా దళం బీఎస్ఎఫ్ ఖండించింది. అవి పూర్తిగా బాధ్యతారాహిత్యమైన, ఆధార రహిత కథనాలని పేర్కొంది. 'నార్త్ 24 పరగణాస్ జిల్లాలో రాంఘాట్

మిగతా 2లో..



### నేనొచ్చేలోగా బందీలందరూ
## విడుదలకావాలి

**లేకుంటే ఆకస్మికదాడులు తప్పవు**

**హమాస్ మిలిటెంట్లకు ట్రంప్ హెచ్చరిక**


**న్యూయార్క్(జనంసాక్షి):**ఇజ్రాయెల్ – హమాస్‌లల మధ్య పోరు కొనసాగుతోంది. ఈక్రమంలోనే అమెరికాకు కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మిలిటెంట్ సంస్థపై విరుచుకుపడ్డారు.తాను అధికార బాధ్యతలు చేపట్టేలోపు బందీలను

మిగతా 2లో..

# నేడు ఏసీబీ విచారణకు కేటీఆర్



**న్యాయవాదికి అనుమతి.. కనిపించేంత దూరంలో ఉండాలి**



- **ఆడియో,వీడియో రికార్డులకు హైకోర్టు నో**
- **ఎసిబి విచారణకు సహకరించాలని సూచన**

**హైదరాబాద్,(జనంసాక్షి):** హైదరాబాద్: ఏసీబీ విచారణకు మాజీ మంత్రి కేటీఆర్ వెంట న్యాయవాదిని తీసుకెళ్లేందుకు తెలంగాణ హైకోర్టు అనుమతించింది. విచారణ ఆడియో, వీడియో రికార్డు చేసేందుకు ఉన్నత న్యాయస్థానం నిరాకరించింది. ఏసీబీ విచారణకు వెళ్లే సమయంలో తన వెంట న్యాయవాదిని అనుమతించేలా ఆదేశాలు ఇవ్వాలంటూ కేటీఆర్ దాఖలు చేసిన లంచ్ మోషన్ పిటిషన్‌పై మంగళవారం హైకోర్టు విచారణ చేపట్టింది. విచారణకు వెళ్లే సమయంలో న్యాయవాదిని అనుమతిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను కేటీఆర్ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. న్యాయవాది రామచంద్రరావు కేటీఆర్ వెంట విచారణకు హాజరవుతారని ఆయన తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. కేటీఆర్ విచారణను ఆడియో, వీడియో రికార్డు చేయాలని న్యాయవాది కోరగా.. అందుకు ఉన్నత న్యాయస్థానం నిరాకరించింది. న్యాయవాది లైబ్రరీలో కూర్చుంటే కేటీఆర్ విచారణ కనిపిస్తుందని ఈ సందర్భంగా ఏఏజీ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. న్యాయవాదితో కలిసి గురువారం ఏసీబీ విచారణకు మిగతా 2లో..

## నేనేతప్పూ చేయలేదు

**ఫార్ములా-ఈ వ్యవహారంలో అవినీతే లేదు • న్యాయం కోసం సుప్రీంలో కొట్లాడుతా**

**హైదరాబాద్(జనంసాక్షి):**కేసులు అసలు సమస్యే కాదు. రైతు భరోసా విషయంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని ప్రజలకు వివరంగా చెప్పాలి. ఈ కేసుపై నేను పోరాడతాను. భారాస నేతలు కేసు గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. నేను తప్పు చేయలేదు.. ఎవరికీ భయపడను' అని పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మిగతా 2లో..

## కేటీఆర్‌పై ఏసీబీకి మరో ఫిర్యాదు

**ఓఆర్ఆర్ టెండర్లలో అవకతవకలు జరిగాయంటూ ఆరోపణ**

**హైదరాబాద్(జనంసాక్షి):**భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ పై ఏసీబీకి మరో ఫిర్యాదు అందింది. మిగతా 2లో..

**తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు**

## ఫాతిమా షేక్ జయంతిని అధికారికంగా జరపండి



**మైనార్టీ రెసిడెన్షియల్స్ స్కూల్స్, జూనియర్ కాలేజీల్లో ఏటా జనవరి 9న నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర సర్కారు ఉత్తర్వులు**

**హైదరాబాద్(జనంసాక్షి) :** ఇటీవల సావిత్రి బాయి పూలే జయంతిని మహిళా ఉపాధ్యాయుల దినోత్సవంగా జరిపేందుకు నిర్ణయించిన తెలంగాణ సర్కారు మరో కీలక ఆదేశాలు జారీచేసింది. భారతదేశ మొదటి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు, విద్యావేత్త, సంఘ సంస్కర్త ఫాతిమా షేక్ జయంతిని అధికారికంగా నిర్వహించాలని ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్స్ స్కూల్స్, జూనియర్ కాలేజీల్లో జనవరి 9 (నేడు) పురస్కరించుకుని ఫాతీమా జయంతిని నిర్వహించాలని సూచించింది. సావిత్రి బాయి, జ్యోతిరావు బాపూలేలతో కలిసి పనిచేసిన ఆమె దేశ తొలి ముస్లిం

మిగతా 2లో..

# తిరుపతిలో తొక్కిసలాట

**ఆరుగురు భక్తుల మృతి.. టోకెన్ల కోసం పోటెత్తడంతో ఘటన**




**తిరుపతి(జనంసాక్షి):**వైకుంఠ ద్వార సర్వదర్శనం టోకెన్ల జారీ నేపథ్యంలో తిరుపతిలో అపశ్రుతి చోటు చేసుకుంది. టోకెన్ల కోసం ఊహించని రీతిలో భక్తులు రావడంతో తీవ్ర తోపులాట జరిగింది. ఈ ఘటనలో ఆరుగురు భక్తులు మృతి చెందారు. వీరిలో ముగ్గురు మహిళలు ఉన్నట్లు గుర్తించారు. ఈ ఘటనలో మరి కొంతమంది అస్వస్థతకు గురికావడంతో రుయా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. రుయా ఆస్పత్రికి కలెక్టర్ వెంకటేశ్వర్, తితిదే ఈవో శ్యామలరావు చేరుకొని వైద్య సేవలను పర్యవేక్షిస్తున్నారు.తిరుపతిలోని శ్రీనివాసం, సత్యనారాయణపురం బైరాగిపట్టెడ రామానాయుడు స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన కేంద్రాల్లో భక్తుల మధ్య తోపులాట జరిగింది. గురువారం ఉదయం 5 గంటల నుంచి తిరుపతిలోని తొమ్మిది కేంద్రాల్లో ఏర్పాటు చేసిన 94 కౌంటర్ల ద్వారా వైకుంఠ ద్వార దర్శనం టోకెన్లు జారీ చేయాలని తితిదే నిర్ణయించింది. అయితే, టోకెన్ల కోసం ఇవాళ సాయంత్రమే భక్తులు భారీగా తరలివచ్చారు. ఒకరు అస్వస్థతకు గురికావడంతో వారిని బయటకు తరలించేందుకు గేట్ ఓపెన్ చేయడంతో ఒక్కసారిగా అంతా దూసుకురావడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకున్నట్లు సమాచారం. తొక్కిసలాటలో గాయపడిన బాధితుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని భావిస్తున్నారు. తోపులాట మిగతా 2లో..

### గౌతం అదానీపై అమెరికాలో
## విచారణ షురూ..

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**బిలియనీర్ గౌతం అదానీ, ఆయన కంపెనీలపై విచారణ చేపట్టేందుకు ఇటీవల అమెరికా సర్కారు నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ముడుపులు చెల్లించిన కేసులో అమెరికా కోర్టు అదానీని నిలదీసింది. అయితే భారతీయ వ్యాపారిపై అమెరికా న్యాయశాఖ తీసుకున్న నిర్ణయాన్ని రిపబ్లికన్ నేత తప్పుపట్టారు. ఎంపిక చేసుకుని ఓ వ్యక్తిని టార్గెట్ చేయడం వల్ల.. భాగస్వామ్య దేశాలతో బంధాలు దెబ్బతింటాయని ఆ

మిగతా 2లో..



# అర్వింద్‌పై ఏసీబీ ప్రశ్నల వర్షం



- **ఫార్ములా ఈ కార్ రేసు కేసులో విచారణ**
- **నిధుల విడుదలపై వివరాల సేకరణ**
- **ఈడీ విచారణకు హాజరైన బీఎన్ఎల్ రెడ్డి**

**హైదరాబాద్(జనంసాక్షి):** ఫార్ములా ఈ కార్ రేసు కేసు దర్యాప్తులో ఏసీబీ దూకుడు పెంచింది. ఈ కేసులో నోటీసులు అందుకున్న అప్పటి పురపాలకశాఖ ప్రత్యేక కార్యదర్శి అరవింద్ కుమార్ బుధవాం ఉదయం ఏసీబీ విచారణకు వచ్చారు. దాదాపు మూడు గంటలుగా అరవింద్ కుమార్‌ను ఏసీబీ ప్రశ్నించింది. ముగ్గురు ఏసీబీ అధికారుల బృందం.. ఫార్ములా ఈ కార్ రేసులో నిధుల మళ్లింపుకు సంబంధించే ఏసీబీ ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. రూ.55 కోట్ల నిధులను విదేశీ కంపెనీకి హెచ్‌ఎండీఏ చెల్లించిన నేపథ్యంలో ఇదే విషయంపై ఏసీబీ అధికారులు ప్రశ్నించారని సమాచారం. రూ.55 కోట్లు ఎఫ్‌ఈవో సంస్థకు చెల్లించిన నేపథ్యంలో విదేశీ కంపెనీకి నగదు బదిలీ వెనుక ఉన్న అసలు కోణం ఏంటి.. ఇది ఎవరి నిర్ణయం... నగదు బదిలీకి ఆర్బీఐ అనుమతి ఉందా అంటూ అరవింద్ కుమార్‌కు ఏసీబీ వరుస ప్రశ్నలు సంధించినట్లు తెలుస్తోంది. అలాగే ఈ ప్రశ్నలకు అరవింద్ కుమార్ కూడా కీలక సమాచారం చెప్పినట్లు సమాచారం. కేటీఆర్ ఆదేశాలు ఇవ్వడంతోనే నగదు రిలీజ్ చేశామని అరవింద్ కుమార్ స్టేట్‌మెంట్ ఇచ్చినట్లు తెలుస్తోంది. అరవింద్ కుమార్ చెబుతున్న స్టేట్‌మెంట్‌ను ఏసీబీ రికార్డు చేస్తోంది.55కోట్లు నిధుల విదేశీ అకౌంట్లు కు జమ చేయడం ఎవరి నిర్ణయం..ఆర్థిక శాఖ అనుమతులు లేకుండా ఎందుకు నిధులు రిలీజ్ చేశారు..కేబినెట్ అప్రూవల్ లేకుండా నిధులు రిలీజ్ చేయవద్దని మీకు తెలియదా అంటూ ప్రశ్నల వర్షం కురిపించినట్లు తెలుస్తోంది. కేటీఆర్ ఆదేశాలు ఇవ్వడంతోనే నగదు రిలీజ్ చేశామని అరవింద్ కుమార్ స్టేట్‌మెంట్ ఇచ్చారు. మంత్రిగా కేటీఆర్ ఆదేశాలు ఇచ్చినా .. ఆ రూల్స్‌ను ప్రజాప్రతినిధులకు చెప్పాల్సిన బాధ్యత ఉంది కదా ?రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా అనుమతి లేకుండా .. బ్యాంక్ ఎలా నగదు బదిలీ చేసింది ?హెచ్‌ఎండీఏ పరిధిని మించి నగదు బదిలీ చేసింది.. మౌఖిక ఆదేశాలు కేవలం కేటీఆర్ మాత్రమే ఇచ్చారా లేక ఇంకా

మిగతా 2లో..

### మేలో కొత్త ఉద్యోగాలకు
## నోటిఫికేషన్లు

**టీజీపీఎస్సీచైర్మన్ బుర్రా వెంకటేశం**
**గ్రూప్-3 ప్రిలిమనరీ కీ విడుదల**



**హైదరాబాద్(జనంసాక్షి):**
మే 1 నుంచి కొత్త ఉద్యో గాలకు నోటిఫికేషన్లు విడుదల చేస్తామని టీజీపీఎస్సీ వెల్లడించింది. మార్చి 31లోగా ఉద్యోగ ఖాళీల వివరాలను ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరినట్లు పేర్కొంది. ఖాళీల ప్రకారం నోటిఫికేషన్ల జారీపై ఏప్రిల్‌లో కసరత్తు చేస్తామని తెలిపింది. కొత్త నోటిఫికేషన్లు ఇచ్చి 6–8 నెలల్లో భర్తీ ప్రక్రియను పూర్తి చేస్తామని కమిషన్ ప్రకటించింది. ఇవాళ గ్రూప్–3 'కీ'

మిగతా 2లో..

### బీర్ల ధరలు పెంచలేదు..
## సరఫరా ఆపేస్తున్నాం

**తెలంగాణకు బీర్ల సరఫరా నిలిపివేసిన యునైటెడ్ బ్రూవరీస్**

**హైదరాబాద్(జనంసాక్షి):**
తెలంగాణకు ఏడు రకాల బీర్ల సరఫరా నిలిచిపోనుంది. ఐదేళ్లుగా ధరలు పెంచకపో వడంతో భారీగా నష్టాలు వస్తున్నాయని పేర్కొంటూ యునైటెడ్ బ్రూవరీస్ లిమిటెడ్ (యూబీఎల్) ఈమేరకు నిర్ణయం తీసుకుంది. యూబీఎల్ ప్రతినిధు లు బుధవారం ఎక్సైజ్‌శాఖ కమిషనర్‌ను కలిసి.. తెలంగాణకు పూర్తిగా బీర్ల సరఫరా నిలిపివేస్తున్నట్టు లేఖ అందజేశారు. ధరలు పెంచాలని పలు మార్లు కోరినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదని, దీంతో తమకు భారీగా నష్టాలు వస్తున్నాయని లేఖలో పేర్కొన్నారు. ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని స్పష్టం చేశారు



## కమిటీ నివేదిక వచ్చాకే మద్యం ధరలపై నిర్ణయం

**మంత్రి జూపల్లి కృష్ణారావు**

**హైదరాబాద్(జనంసాక్షి):** మద్యం ధరల పెంపుపై విశ్రాంత హైకోర్టు జడ్జితో కమిటీ ఏర్పాటు చేసి నివేదిక కోరామని, నివేదిక వచ్చిన తర్వాతే ధరల పెంపుపై నిర్ణయం తీసుకుంటామని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. తెలంగాణలో బీర్ల విక్రయాలు మిగతా 2లో..

# మనకూ స్పేస్‌స్టేషన్

**త్వరలో సాకారం కాబోతున్న కల • ప్రాజెక్టుకు ప్రధాని ఆమోదం తెలిపారు**
**గొప్ప లక్ష్యాలు మనముందున్నాయి • ఇస్రో కొత్త చీఫ్ వీ నారాయణన్**

**తిరువనంతపురం(జనంసాక్షి):**
ప్రముఖ రాకెట్ శాస్త్రవేత్త వీ నారాయణన్‌ను ఇస్రో చీఫ్‌గా నియమించిన విషయం తెలిసిందే. ఇస్రో చాలా విజయవంతమైన దశలో ఉన్నదని, చంద్రయాన్–4తో పాటు గగన్‌యాన్ మిషన్లు తమ ముందు ఉన్నట్లు ఆయన తెలిపారు. ఇస్రో చైర్మెన్‌తో పాటు అంతరిక్ష శాఖ కార్యదర్శిగా నియమితుడైన సందర్భంగా వీ నారాయణన్ సంతోషం వ్యక్తం చేశారు. ఎంతో మంది గొప్ప శాస్త్రవేత్తల నాయకత్వంలో సంస్థ కీర్తిగాంచిందని, అలాంటి సంస్థలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఇస్రో చాలా గొప్ప సంస్థ అని, గతంలో అనేక మంది గొప్ప నేతలు దీన్ని నడిపించారని, ఈ సంస్థలో భాగస్వామ్యం కావడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఓ ప్రశ్నకు బదులిస్తూ.. తన నియామకం గురించి తొలుత ప్రధాన మంత్రి కార్యాలయం నుంచి ఫోన్ వచ్చినట్లు వీ నారాయణన్ చెప్పారు. ప్రధానియే అన్నీ డిసైడ్ చేస్తున్నారని, పీఎంవో తనను కాంటాక్ట్ అయ్యిందని, ప్రస్తుతం ఇస్రో చైర్మెన్ ఎస్ సోమనాథ్ కూడా తనకు ఫోన్ కాల్ చేశారని, కొత్త అపాయింట్మెంట్ గురించి చెప్పినట్లు ఆయన వెల్లడించారు. త్వరలో చేపట్టబోయే ఇస్రో



ప్రాజెక్టుల గురించి మాట్లాడుతూ.. ఇస్రో చాలా కీలకమైన మిషన్లను చేపడుతున్నదని, ప్రస్తుతం ఇస్రో విజయవంతమైన దశలో వెళ్తోందన్నారు. చేపట్టబోయే ప్రాజెక్టుల గురించి వివరిస్తూ.. స్పేడెక్స్ మిషన్‌ను డిసెంబర్ 30వ తేదీన చేపట్టామని, జనవరి 9వ తేదీన స్పేడెక్స్ శాటిలైట్ల డాకింగ్ జరగనున్నట్లు ఆయన తెలిపారు. గగన్‌యాన్ కూడా ఇస్రో ముందున్న అతిపెద్ద ప్రోగ్రామ్ అని పేర్కొన్నారు. క్రూ లేకుండా మాడ్యూల్‌ను ప్రయోగించే దాని కోసం ఇస్రోలో పనులు జరుగుతున్నాయన్నారు. జీఎస్ఎల్వీ ద్వారా ఎన్వీఎస్ 02 నావిగేషన్ శాటిలైట్ను పంపేందుకు శ్రీహరికోటలో వర్క్ జరుగుతోందన్నారు. ఇస్రో మార్క్ 3 వెహికిల్ మిగతా 2లో..

### రోడ్డు ప్రమాద బాధితులకు
## నగదు రహిత చికిత్సలు

**గరిష్టంగా రూ.1.50 లక్షలు అందజేత**

**కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కీలక ప్రకటన**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**కేంద్ర రోడ్డు రవాణ శాఖ మంత్రి నితిన్ గడ్కరీ కీలక పథకాన్ని ప్రకటించారు. రోడ్డు ప్రమాదానికి గురైన బాధితులకు నగదు రహిత చికిత్సను అందించేందుకు ప్రత్యేక పథకాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ఎవరైనా రోడ్డు ప్రమాదంలో గాయపడితే చికిత్సకు అయ్యే ఖర్చులో గరిష్ఠంగా రూ.1.50 లక్షలు ఈ పథకం ద్వారా ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. అయితే ఇది మొదటి ఏడు రోజుల చికిత్సకు అయ్యే బిల్లుకు మాత్రమే వర్తిస్తుందని పేర్కొన్నారు. ప్రమాద ఘటన జరిగిన 24 గంటల్లోగా పోలీసులకు సమాచారాన్ని అందిస్తేనే ఈ స్కీం ద్వారా నగదు రహిత చికిత్సను పొందొచ్చని గడ్కరీ స్పష్టం చేశారు. ఇప్పటికే ఈ పథకాన్ని పైలట్ ప్రాజెక్ట్ కింద పలు రాష్ట్రాల్లో అమలు చేస్తున్నట్లు చెప్పారు.

మిగతా 2లో..

## పోటాపోటీ నిరసనలు

**పీఎం నివాసం వద్ద ఆప్, సీఎం నివాసం వద్ద భాజపా ఆందోళనలు**

2లో

### ప్రజల ఆశలు,ఆశయాల
# సాధనకు మద్దతిస్తా

**2047 నాటికి 2.5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం**

**డబుల్ ఇంజన్ సర్కార్‌తో ఇక పరుగులు:ప్రధాని మోడీ**



**విశాఖపట్నం(జనంసాక్షి):**
ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి పెద్ద అడుగు పడిందని, డబుల్ ఇంజన్ సర్కార్‌తో అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎపి సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పడ్డ తరవాత ఎపిలో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. అయి తే గత ఐదేళ్ల విధ్వంస పాలనతో ఎపి ఎం తగానో నష్టపోయిందన్నారు. ప్రజలు ఆశీ ర్వదిస్తేనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. విశాఖలో ప్రధాని సమక్షంలో అనేక కార్యక్రమాలకు శంకుస్థాపన జరిగిన సందర్భంగా జరిగిన సభలో సిఎంచంద్రబాబు మాట్లాడారు. ప్రపంచం మెచ్చే ఏకైక నాయకుడు ప్రధాని మోదీ అని సీఎం చంద్రబాబు అన్నారు. ఏపీలో రూ.2.08 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారం భోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో చంద్రబాబు ప్రసంగించారు. 'ఏపీలో ఎన్డీఏ కూటమి 93 శాతం స్ట్రైక్ రేట్‌తో ఘన విజయం సాధించింది. భవిష్యత్తులోనూ ఈ కాంబినేషన్ కొనసాగుతుంది,

మిగతా 2లో..

## మహిళల శరీరంపై వ్యాఖ్యలు లైంగిక వేధింపే..

**కేరళ హైకోర్టు తీర్పు**

**కొచ్చి(జనంసాక్షి):**మహిళల శరీరం నిర్మాణంపై ఎటువంటి వ్యాఖ్యలు చేసినా.. అది లైంగిక వేధింపు అవుతుందని కేరళ హైకోర్టు పేర్కొన్నది. జస్టిస్ ఏ బదరుద్దీన్ ఈ తీర్పును ఇచ్చారు. కేరళ

మిగతా 2లో..

### చుట్టుముట్టిన
## కార్చిచ్చు

**లాస్‌ఏంజిల్స్‌లో దావానలంలా వ్యాపించిన మంటలు.. వేల ఎకరాలు దగ్ధం**

**సురక్షిత ప్రాంతాలకు 30వేలమంది తరలింపు**

**న్యూయార్క్(జనంసాక్షి):**అమెరికాలో కుబేరులకు ఆవాసాలైన మూడు నగరాల్లో లాస్ ఏంజెలెస్ ఒకటి. ఇప్పుడు ఆ సిటీలోని అత్యంత ఖరీదైన ప్రదేశాన్ని కార్చిచ్చు చుట్టుముట్టింది. దీంతో వేలాది ఎకరాల్లోని విలాసవంతమైన ఇళ్లు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. ఇక్కడ సంపన్నవర్గాలు నివసించే దిపాలిసాడ్స్ ప్రాంతంలో కార్చిచ్చు చెలరేగింది. దాదాపు 3000 ఎకరాలు దగ్ధమయ్యాయి. దీంతో 30,000 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. చాలామంది తమ సామగ్రి, వాహనాలను అక్కడే వదిలేసి ప్రాణాలు కాపాడుకోవడానికి తరలివెళ్లారు. వీధుల్లో పొగ మిగతా 2లో..






## పరిహారం ఇచ్చాకే పనులు చేపట్టండి

**చిన్న కాళేశ్వరం కాలువ పనులను అడ్డుకున్న రైతులు**

**ఎల్కేశ్వరంలో ఉద్రిక్తత.. రైతులను ఈడ్చుకెళ్లిన పోలీసులు**

**మనస్థాపంతో మహిళ ఆత్మహత్యాయత్నం**

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో/ మహాదేవపూర్(జనంసాక్షి):**జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం ఎల్కేశ్వరంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.. చిన్న కాళేశ్వరం కాల్వ పనులను రైతులు అడ్డుకోవడంతో ఈ పరిస్థితి నెలకొంది.. తమకు పరిహారం అందించాకే పనులు చేయాలని బాధిత రైతులు ఆందోళనకు దిగి పనులు చేయనివ్వలేదు.. దీంతో పోలీసులు జోక్యం చేసుకొని వారిని బలవంతంగా ఈడ్చుకెల్లారు.. ఈ సంఘటనలతో మనస్థాపానికి గురై ఓ మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది.. వివరాల్లోకి వెళితే.. మహాదేవపూర్ మండలంలో చిన్న కాళేశ్వరం కాల్వ పనులు చేపట్టేందుకుగాను గత మూడు రోజులుగా అధికారులు సర్వే నిర్వహించారు. సర్వే పూర్తి కావడంతో గ్రావిటి కెనాల్ కోసం బుధవారం రోజున పోలీసుల పహారాలో రెవెన్యూ అధికారుల సమక్షంలో మెగా కంపెనీకి చెందిన కాంట్రాక్టర్ పనులను చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న ఎల్కేశ్వరం కు చెందిన బాధిత రైతులు కాల్వపనులను అడ్డుకున్నారు. పనులు ఎందుకు చేస్తున్నారని నిలదీశారు. పరిహాఫం ఇచ్చాకే పనులు చేపట్టాలని జెసిబి తో జరుగుతున్న పనుల వద్ద ఆందోళన చేపట్టారు. పనులు జరగకుండా అడ్డుకోవడంతో పోలీసులు రంగంలోకి దిగారు. తమకు పరిహారం చెల్లించాలని రైతులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఈ చిన్న కాళేశ్వరం పనుల్లో భాగంగా గతంలో కొంతమంది రైతులకు పరిహారం అందించగా, మరికొంతమందికి పరిహారం అందలేదు. అందులో కొంతమంది రైతులవి లావాని పట్ట కావడంతో అధికారులు కూడా పరిహారం చెల్లింపులు వెనుకంజ వేశారు. అయితే ఈ పనులు కొనసాగితే తమకు పరిహారం ఇక అందదు అనే ఉద్దేశంతో బాధిత రైతులు పనులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ లోగా పోలీసులు వారికి ఎంత నచ్చజెప్పినా వినకపోవడంతో రైతులను ఈడ్చుకెళ్లారు. అక్కడ ఎవరు ఉండకూడదని ఒక్కొక్కరిని అక్కడి నుండి ఎత్తుకెళ్లారు. దీంతో రైతులు లబోదిబోమంటూ మొత్తుకున్నారు. దీంతో స్థానికంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు బలవంతంగా ఈడ్చుకెల్లడం, వద్దని చెప్పినా పనులు చేపట్టడం చూసి మనస్థాపానికి గురైన ఎల్కేశ్వరం గ్రామానికి చెందిన రాళ్ల బండి కమల(55) అనే మహిళా రైతు పురుగులమందు తాగి ఆత్మ హత్యాయత్నానికి పాల్పడింది. బంధువులు వెంటనే 108 కి సమాచారం ఇచ్చి మహదేవపూర్ ఆస్పత్రికి తరలించారు. పరిహారం ఇవ్వకుండానే పనులు చేపడుతున్నారని మాకు పరిహారం చెల్లించి పనులు చేపట్టాలని అడ్డుకుంటే తమను పట్టించుకునేవారు లేరని మనస్థాపం చెంది రాళ్లబండి కమల పురుగుల మందు తాగిందని కుటుంబ సభ్యులు వివరించారు. ప్రస్తుతం కమల ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు స్థానికులు చెప్పారు. ఏది ఏమైనా కాంట్రాక్టర్ చిన్న కాళేశ్వరం పనులు చేపట్టడం, పరిహారం ఇవ్వలేదని రైతులు అడ్డుకోవడం లాంటి చర్యలతో ఎప్పుడు ఏం జరుగుతుందోననే ఉత్కంఠ స్థానికంగా నెలకొంది.

## పోటాపోటీ నిరసనలు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తోన్న తరుణంలో దిల్లీ రాజకీయాలు వేడెక్కాయి. ఆప్, భాజపా ఏ వేదికా వదలకుండా విమర్శలు చేసుకుంటున్నాయి. ఈ సమయంలో 'సీఎం బంగ్లా' వివాదం రాజకీయ దుమారం రేపుతోంది. ఈ బంగ్లాను 'శీష్ మహల్ (అద్దాల మేడ) అంటూ భాజపా చేస్తోన్న విమర్శలను ఆప్ తిప్పికొడుతోంది. తాజాగా 'నిజాన్ని చూపిస్తాం' అంటూ ఆ పార్టీ సంజయ్ సింగ్, సౌరభ్ భరద్వాజ్ మీడియాను తీసుకొని ఆ అధికారిక నివాసం వద్దకు వెళ్లారు. అయితే వారి ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకున్నారు. మంత్రి, ఎంపీ అధికారాలను పోలీసులు అడ్డుకుంటున్నారని ఆప్ నేతలు మండిపడ్డారు. దాంతో సీఎం నివాసం ముందు గందరగోళ వాతావరణం నెలకొంది ఆ అధికారిక నివాసంలోకి వెళ్లేందుకు ఆప్ నేతలకు అనుమతి లేదని పోలీసులు తేల్చిచెప్పారు. దానిలోభాగంగా బారికేడ్లు ఏర్పాటుచేశారు. భారీగా పోలీసులను మోహరించారు. "ఎవరినీ లోపలికి అనుమతించొద్దంటూ పైనుంచి ఆదేశాలు వచ్చాయని పోలీసులు చెప్పారు. ఈ పోలీసు చర్య భాజపాకు సంతోషాన్ని కలిగిస్తుంది" అని సౌరభ్ విమర్శించారు. తర్వాత సింగ్‌తో పాటు కొద్దిసేపు ధర్నాకు కూర్చొని.. ప్రధాని అధికారిక నివాసం ఉన్న లోక్‌కల్యాణ్ మార్గ్ వైపు వెళ్లారు. పీఎం నివాసం సమీపంలోనే పోలీసులు వారిని అడ్డుకున్నారు. మరోవైపు ఆప్‌నకు కౌంటర్‌గా భాజపా దిల్లీ సీఎం అధికారిక నివాసం వద్దకు వెళ్లినట్లు తెలుస్తోంది..

## రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత చికిత్సలు

2025 మార్చి నాటికి దేశవ్యాప్తంగా ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా హిట్ అండ్ రన్ కేసుల్లో చనిపోయిన వారి కుటుంబాలకు రూ.2 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియాను అందిస్తామని గడ్కరీ తెలిపారు. పలు రాష్ట్రాల రవాణా శాఖ మంత్రులతో కేంద్ర మంత్రి గడ్కరీ మంగళవారం సమావేశమయ్యారు. సమావేశం అనంతరం ఢిల్లీలోని భారత్ మండపంలో మీడియాతో మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలకే తమ మొదటి ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. 2024లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 1.8 లక్షల మంది చనిపోయారని.. అందులో 30 వేల మంది హెల్మెట్ పెట్టుకోకపోవడం వల్లే మరణించినట్లు తెలిపారు. మృతుల్లో 66 శాతం మంది 18 నుంచి 34 ఏండ్ల మధ్య వయస్సుగల వారే ఉండటం బాధాకర విషయమన్నారు. ఇక స్కూళ్లు, కాలేజీల్లో ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ల తప్పుల వల్ల 10,000 మంది పిల్లలు చనిపోయారని గడ్కరీ వివరించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని వ్యక్తులు వాహనాలు నడపడం వల్ల మూడు వేల మంది మరణించినట్లు తెలిపారు.

## గౌతం అదానీపై అమెరికాలో విచారణ షురూ..

నేత పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అమెరికా అటార్నీ జనరల్ మెర్రిక్ బీ గార్లాండ్‌కు లేఖ రాశారు లాన్స్ గూడెన్. విదేశీ వ్యక్తులను ఎంచుకుని ఎందుకు టార్గెట్ చేస్తున్నారని న్యాయశాఖను డిమాండ్ చేశారాయన. అదానీ విచారణ వెనుక ఏదైనా లోగుట్టు ఉన్నాదా అని, దీని వెనుక జార్జ్ సోరస్ లాంటి వ్యక్తి ఉన్నారా అని రిపబ్లికన్ నేత ప్రశ్నించారు. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో అమెరికాకు బలమైన భాగస్వామిగా ఇండియా ఉన్నదని, టార్గెట్ చేసి చర్యలు తీసుకోవడం వల్ల భాగస్వామ్య కూటమి దెబ్బతినే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. దేశంలోని చెడు వ్యక్తులను ముందుగా అమెరికా న్యాయశాఖ శిక్షించాలని, విదేశీ వ్యక్తులను కాదు అని గూడెన్ పేర్కొన్నారు. వందల కోట్ల డాలర్లు పెట్టుబడి పెటి, అమెరికన్ల కోసం లక్షలాది ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నవారిని టార్గెట్ చేయడం వల్ల దీర్ఘకాలంలో అమెరికాకే నష్టం జరుగుతుందని గూడెన్ తన లేఖలో తెలిపారు. ఒకవేళ అదానీపై ఆరోపణలు నిజమైనా, వాటిని నిరూపించినా, ఆ అంశంలో అమెరికా పాత్ర ఏముంటుందని గూడెన్ ప్రశ్నించారు.

# నేడు ఏసీబీ విచారణకు కేటీఆర్

వెళ్లాలని న్యాయస్థానం కేటీఆర్‌కు సూచించింది. గురువారం విచారణ తర్వాత ఏవైనా అనుమానాలుంటే మళ్లీ న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చని హైకోర్టు తెలిపింది.ఏసీబీ విచారణకు కేటీఆర్‌తో పాటు వెళ్లేందుకు ముగ్గురు న్యాయవాదుల పేర్లను సూచించాలని.. అందులో ఒకరికి అనుమతిస్తామని హైకోర్టు పేర్కొంది. దర్యాప్తు అధికారి, కేటీఆర్ ఓ గదిలో ఉంటే.. వాళ్లిద్దరూ కనిపించేంత దూరంలో న్యాయవాది ఉండేలా అనుమతి ఇస్తామని హైకోర్టు తెలిపింది. ఈ మేరకు ఏసీబీ కార్యాలయంలో ఏర్పాట్లు ఉన్నాయో లేవో తెలుసుకొని చెప్పాలని అదనపు అడ్వొకేట్ జనరల్‌ను అదేశించింది. ఎంపీ అవినాష్ రెడ్డి సీబీఐ విచారణను ఎదుర్కొనే సమయంలో న్యాయవాదిని అనుమతిస్తూ ఇదే హైకోర్టు సైతం తీర్పు ఇచ్చిందని జస్టిస్ కె.లక్ష్మణ్ అన్నారు. న్యాయవాదిని అనుమతించొద్దని ఏసీబీ తరఫున వాదించిన అదనపు అడ్వకేట్ జనరల్ తేరా రజినీకాంత్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. న్యాయవాదిని అనుమతిస్తే అభ్యంతరమెందుకని.. విచారణ గదిలోకి న్యాయవాది వెళ్లడం లేదు కదా అని హైకోర్టు వ్యాఖ్యానించింది.కేటీఆర్, దర్యాప్తు అధికారి ఓ గదిలో ఉంటే... వాళ్లిద్దరూ కనిపించేలా మరో గదిలో న్యాయవాది కూర్చుంటారని హైకోర్టు తెలిపింది. ఏసీబీ కార్యాలయంలో తగిన ఏర్పాట్లు ఉన్నాయా లేవా అని ఏఏజీని ప్రశ్నించగా.. వివరాలు సేకరించి చెబుతానని ఏఏజీ సమాధానమిచ్చారు. విచారణకు సంబంధించి ఏసీబీ కార్యాలయంలో ఏర్పాట్లపై సమాచారం తెలుసుకున్న తర్వాత జస్టిస్ కె.లక్ష్మణ్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

# నేనేతప్పూ చేయలేదు



కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో భారాస డైరీని ఆ కేటీఆర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు, నేతలు హాజరయ్యారు. అనంతరం పార్టీ నేతలను ఉద్దేశించి కేటీఆర్ మాట్లాడారు. ఫార్ములా ఈరేసు కేసు గురించి నేను చూసుకుంటాను. ఏసీబీ కేసు పెద్ద విషయం కాదు. నా కేసుల గురించి ఆందోళన, ఇబ్బంది లేదు' అని అన్నారు. సుప్రీంకోర్టులో న్యాయపోరాటం చేస్తానని తెలిపారు. ఈ రేసులో ఒక్క పైసా కూడా అవినీతి జరగలేదని వెల్లడించారు. బీఆర్ఎస్ కార్యకర్తలు రైతు, ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని పిలుపు నిచ్చారు. 2025లో బీఆర్ఎస్‌కు కొత్త కమిటీలు పూర్తి చేస్తామన్నారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి కమిటీలు నియమిస్తామన్నారు. ఈఏడాది పార్టీ అధ్యక్షుడిని ఎన్నుకుంటామని తెలిపారు. జిల్లాల్లోనే పార్టీ క్యాడర్‌కు శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. తెలంగాణ ప్రయోజనాల కోసం బీఆర్ఎస్‌ను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రైతన్నకు జరుగుతోన్న మోసాన్ని ప్రజలకు వివరించాలని.. మొత్తంగా 30 శాతం రుణమాఫీ మాత్రమే జరిగిందని కేటీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ'2001లో కేసీఆర్ పార్టీ పెట్టిన నాడు ఉన్న ఇబ్బందులతో పోల్చితే ఇప్పుడు ఉన్నవి పెద్దవి కాదు. ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ బిడ్డగా, ఆయన తయారు చేసిన సైనికుడిగా నేను ఎంతో ధైర్యంగా ఉంటా. తెలంగాణలో 90 లక్షల మంది మహిళలకు నెలకు రూ. 2,500 ఇస్తున్నట్లు దిల్లీ కాంగ్రెస్ నేతలు అబద్దాలు చెబుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఆనాడు డైరీ ఆవిష్కరణలు ఉద్యమ కేంద్రాలుగా ఉండేవని... నేటి డైరీ ఆవిష్కరణ తిరిగి బీఆర్ఎస్‌ను అధికారంలోకి వచ్చేందుకు ఉపయోగపడుతుందని అన్నారు. రేవంత్ రెడ్డి సంవత్సర కాలంగా చేసింది ఎగవేతలు, కేసులే అని వ్యాఖ్యలు చేశారు. ఎనుముల రేవంత్ రెడ్డి కాదు.. ఎగవేతల రేవంత్ రెడ్డి అంటూ ఎద్దేవా చేశారు. డైవర్షన్‌లు తప్ప రేవంత్ రెడ్డి చేసింది ఏమిలేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసమే రైతు భరోసా వేస్తారని ఆరోపించారు. అధికారంలోకి రాగానే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెన్షన్‌లు పెంచిందన్నారు.ఎవరు ప్రశ్నిస్తే వాళ్ల మీద కేసులు పెట్టి అణిచివేసే ప్రయత్నం చేస్తున్నారు అంటూ ముఖ్యమంత్రిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి భూములకు ఆరులైన్ల రోడ్లు వేసుకుంటున్నారని.. అప్పులపై అసెంబ్లీలోనే ప్రభుత్వం నోరు మూయించామన్నారు. లగచర్ల రైతులకు అండగా కేటీఆర్ నిలబడ్డారని.. కేటీఆర్ ఉద్యమకారుడు, కార్యకర్తే అని తెలిపారు. ఆయనకు ఆపద వస్తే పార్టీ అంతా అండగా ఉండాలని కోరారు. కేటీఆర్‌పై అక్రమ కేసు పెట్టి అన్యాయంగా ఇరికించే ప్రయత్నం చేస్తున్నారు. దృష్టి మళ్లింపు తప్ప ప్రజలకు రేవంత్ రెడ్డి చేసిందేమీ లేదు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఒక్కసారి రైతు భరోసా ఇచ్చి మళ్లీ ఎగ్గొడతారు. దిల్లీకి కమీషన్లు పంపేందుకు డబ్బులు ఉన్నాయి కానీ... పేదలకు ఇవ్వడానికి డబ్బులు లేవంటున్నారు. ప్రశ్నించినందుకే కేటీఆర్‌పై అక్రమ కేసులు పెడుతున్నారని హరీశ్‌రావు అన్నారు.

## తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ జయంతిని అధికారికంగా జరపండి

ఉపాధ్యాయురాలు. ఎన్నో అవమానాలు, నిర్బంధాలు ఎదుర్కొన్నప్పటికీ బాలికల విద్య కోసం పాటుపడ్డారు. సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు సొంతంగా పాఠశాలలు నిర్వహించి అమ్మాయిలకు చదువును దగ్గర చేయడంలో కీలక భూమిక పోషించారు. ఆమె సేవలను కొనియాడుతూ నేడు అన్ని పాఠశాలల్లో ఆమె జయంతి నిర్వహించి ఘన నివాళు లర్పించాలని అధికారులు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## మేలో కొత్త ఉద్యోగాలకు నోటిఫికేషన్లు

విడుదల చేయనుంది. రెండ్రోజుల్లో గ్రూప్-2 'కీ' విడు దల చేయనున్నట్టు టీజీపీఎస్సీ తెలిపింది. షెడ్యూల్ ప్రకారం ఫలితాలు వచ్చేలా పనిచేస్తున్నామని టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం తెలిపారు. ఈనెల 11, 12 తేదీల్లో బెంగళూరులో పబ్లిక్ సర్వీస్ కమిషన్ల సదస్సు ఉంటుందని, ఉద్యోగ పరీక్షల విధానాలపై సదస్సులో చర్చించనున్నట్టు చెప్పారు.

## కమిటీ నివేదిక వచ్చాకే మద్యం ధరలపై నిర్ణయం

నిలిపివేస్తామని యూబీఎల్ ప్రకటించిన నేపథ్యంలో ఆయన మీడియాతో మాట్లాడారు."వివిధ బ్రాండ్ల బీర్ల ధరలు పెంచాలని కోరుతున్నారు. బీర్ల ధరలు 33.1 శాతం పెంచాలని యునైటెడ్ బ్రూవరీస్ (యూబీ) కంపెనీ కోరుతోంది. ధరలు పెంచితే మద్యం ప్రియులపై భారం పడుతుంది. ముడి సరకుల ధరలు పెరిగితే మద్యం ధరలు పెరుగుతాయి. యూబీఎల్ కంపెనీ మార్కెట్ షేరు 69 శాతంగా ఉంది. గత ప్రభుత్వం మొత్తంగా దాదాపు రూ.8 లక్షల కోట్ల వరకు అప్పులు,గత ప్రభుత్వం మొత్తంగా దాదాపు రూ.8 లక్షల కోట్ల వరకు అప్పులు, బకాయిలు పెట్టింది. వాటికి నెలకు రూ.6వేల కోట్ల వరకు వడ్డీ చెల్లిస్తున్నాం. మరో రూ.40వేల కోట్ల వరకు బిల్లులు పెండింగ్ పెట్టారు. ఇందులో ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించి రూ.2,500 కోట్ల వరకు ఉన్నాయి. ఇందులో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రూ.1,139 కోట్ల బకాయిలు చెల్లించాం. ఇవాళ్టి వరకు మొత్తం రూ.658 కోట్లు పెండింగ్ ఉంది.యూబీ బీర్లకు సంబంధించి ఇంకా 14లక్షల కేసుల స్టాక్ ఉంది. ఇతర రాష్ట్రాలతో పోల్చినప్పుడు మన రాష్ట్రంలోనే మద్యం ధరలు తక్కువగా ఉన్నాయి. కర్ణాటకలో బీరు 190, ఏపీలో 180, తెలంగాణలో 150, తమిళనాడులో 150గా ఉంది. యూబీ కంపెనీ ఒత్తిడికి లొంగం. భవిష్యత్తులోనూ మిగతా రాష్ట్రాలకన్నా తెలంగాణలోనే తక్కువ ధరలు ఉండేలా చూస్తాం" అని జూపల్లి తెలిపారు.

## కేటీఆర్‌పై ఏసీబీకి మరో ఫిర్యాదు

ఓఆర్ఆర్ టెండర్లలో అవకతవకలు జరిగాయంటూ బీసీ రాజకీయ ఐకాస అధ్యక్షుడు యుగంధర్ గౌడ్ ఫిర్యాదు చేశారు.ఈ వ్యవహారంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.ఇప్పటికే ఫార్ములా ఈ-రేసు వ్యవహారంలో కేటీఆర్ నిందితుడిగా ఉన్నారు. ఆయన్ను ఏసీబీ గురువారం విచారించనున్న విషయం తెలిసిందే.

## అర్వింద్‌పై ఏసీబీ ప్రశ్నల వర్షం

ఎవరైనా ఉన్నారా ?ఎఫ్ఈవోతో చేసుకున్న అగ్రిమెంట్ ఏంటి? అగ్రిమెంట్‌లోరాసుకున్న నిబంధనలు ఏంటి? గ్రీన్ కో స్పాన్సర్ షిప్ నుంచి వైదొలగడానికి కారణం ఏంటి ?ఒప్పందం ప్రకారం 2024 లో నిర్వహించాల్సిన రేస్ ఎందుకు నిర్వహించలేక పోయారు...?హెచ్ఎండీఏ కార్ రేసింగ్ కోసం కాకుండా .. ఇంకా వేటికైనా నిధులు రిలీజ్ చేశారా ?హెచ్ఎండీఏ నిర్ణయాల్లో చైర్మన్ పాత్ర ఏమైనా ఉంటుందా అంటూ ఇలా వరుసగా ఏసీబీ ప్రశ్నలు సంధించింది .ఓవైపు ఏసీబీ కార్యాలయంలో ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్‌ను ఏసీబీ ప్రశ్నిస్తుండగా.. మరోవైపు ఈడీ కార్యాలయంలో హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎన్ఎల్ రెడ్డిని ఈడీ అధికారులు విచారించారు. ప్రధానంగా ఈ కార్ రేసులో హెచ్ఎమ్‌డీఏ పాత్ర స్వల్పంగా ఉన్నప్పటికీ స్పాన్సర్స్ చెల్లించాల్సిన డబ్బును హెచ్ఎండీఏ ఎందుకు చెల్లించాల్సి వచ్చిందని బీఎన్ఎల్ రెడ్డిని ఈడీ అధికారులు ప్రశ్నించారు.

## తిరుపతిలో తొక్కిసలాట

జరిగిన ప్రాంతాలకు విజిలెన్స్, పోలీసు బలగాలు భారీగా చేరుకున్నాయి. మరోవైపు, ఘటనా స్థలం వద్ద పరిస్థితి అదుపులోకి వచ్చినట్లు నగర పాలక కమిషనర్ తెలిపారు. ఈ నెల 10, 11, 12 తేదీల్లో వైకుంఠ ద్వార దర్శనాలకు సంబంధించి మొదటి మూడు రోజులకు 1.20 లక్షల టోకెన్లను గురువారం ఉదయం జారీ చేయనున్నారు. మిగిలిన రోజులకు సంబంధించి ఆయా తేదీల్లో తిరుపతిలోని విష్ణునివాసం, శ్రీనివాసం, భూదేవి కాంప్లెక్స్‌లలో ఇవ్వనున్నట్టు తితిదే తెలిపింది.

## మనకూ స్పేస్‌స్టేషన్

ద్వారా అమెరికాకు చెందిన కమర్షియల్ శాటిలైట్‌ను కూడా ప్రయోగించనున్నారు. గగన్‌యాన్ రాకెట్ అసెంబ్లింగ్‌కు చెందిన పనులు కూడా శ్రీహరికోట్లో ప్రోగ్రెస్ అవుతున్నాయి. చంద్రయాన్3 ద్వారా చంద్రుడి దక్షిణ ధ్రువంపై ల్యాండ్ అయిన విషయం అందరికీ తెలిసిందే అన్నారు. చంద్రయాన్ 4 ద్వారా ఆ ప్రదేశంలో చంద్రుడిపై ల్యాండ్ అయి, శ్యాంపిళ్లు సేకరించిన తర్వాత మళ్లీ తిరిగి వచ్చే రీతిలో పనులు జరుగుతున్నాయన్నారు. భారత స్పేస్ స్టేషన్‌ని సెటప్ చేసేందుకు ప్లాన్ జరుగుతోందన్నారు. స్పేస్ స్టేషన్ నిర్మాణం కోసం ప్రధాని మోదీ అనుమతి కూడా తమకు దక్కిందన్నారు. స్పేస్ స్టేషన్‌కు అయిదు మాడ్యూళ్లు ఉంటాయని, 2028లో స్పేస్ స్టేషన్‌కు తొలి మాడ్యూల్‌ను లాంచ్ చేసే రీతిలో అనుమతి దక్కిందన్నారు.

## ప్రజల ఆశలు,ఆశయాల సాధనకు మద్దతిస్తా

దేశ రాజకీయాల్లో మోదీ ప్రధానిగా ఉంటారు. దిల్లీ ఎన్నికల్లోనూ ఎన్డీఏ గెలుస్తుంది.. రాసి పెట్టుకోండి. పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు మోదీ కృషి చేస్తున్నారు. సంక్షేమం, అభివృద్ధి, సంస్కరణలు, సుపరిపాలన.. మోదీ నినాదాలు. దేశాన్ని బలమైన ఆర్థిక శక్తిగా మార్చేందుకు మేకిన్ ఇండియా తెచ్చారు. స్టార్టప్ ఇండియా, స్కిల్ ఇండియా, గతిశక్తి తెచ్చారు. దేశానికి ఆర్థిక రాజధానిగా ముంబయి ఎలా ఉందో.. ఏపీకి విశాఖ అలాంటి ఆర్థిక నగరం' అని చంద్రబాబు వివరించారు. 'మోదీని స్ఫూర్తిగా తీసుకొని నిత్యం ముందుకెళ్తాం. త్వరలో అమరావతికి రావాలని ప్రధానిని కోరుతున్నా. నదుల అనుసంధానం మా లక్ష్యం.. అందుకు కేంద్రం సాయం కావాలి. మోదీ కార్యక్రమాల వల్ల దేశం అభివృద్ధిలో దూసుకుపోతోంది. 2047 నాటికి ప్రపంచంలోనే మొదటి లేదా రెండో స్థానంలో ఉంటాం. రాష్ట్ర విభజన తర్వాత అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నాం. కేంద్రం సాయంతో నిలదొక్కుకున్నాం.. ముందుకెళ్తున్నాం. సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేసే బాధ్యత మాది. కేంద్రం అండతో రాష్ట్రంలో పెట్టుబడులు ఊపందుకున్నాయి. అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధి.. కూటమి ప్రభుత్వ లక్ష్యం అని చంద్రబాబు వివరించారు. రాష్ట్రంలో 20లక్షల ఉద్యోగాలు ఇచ్చే బాధ్యత మాది. కొప్పర్తి, ఓర్వకల్లు.. పారిశ్రామిక ప్రాంతాలుగా మారుతున్నాయి. అరకు కాఫీని మోదీ బాగా ప్రచారం చేస్తున్నారు. ఏ సమస్య చెప్పినా ఆయన వెంటనే అర్థం చేసుకుంటారు. వెంటనే పనులు జరిగేలా చొరవ చూపిస్తారు. గతంలో ఏ ప్రధాని కూడా ఇంతలా చొరవ చూపలేదు. మన దేశానికి సరైన సమయంలో సరైన ప్రధాని ఉన్నారు' అని చంద్రబాబు కొనియాడారు. అంతకుముందు ప్రధాని మోదీకి సిఎం చంద్రబాబు, డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విశాఖ నగరంలో ఏర్పాటు చేసిన రోడ్ షో అదిరిపోయిందని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు చెప్పారు. నగరంలో ఏర్పాటు చేసిన సభకు వచ్చిన ప్రజలను చూస్తుంటే ఎక్కడ లేని ఉత్సాహం వస్తోందని చంద్రబాబు తెలిపారు. విశాఖ సభకు హాజరైన ప్రతి ఒక్కరికీ పేరుపేరున నమస్కారాలు తెలియజేస్తున్నట్లు ఆయన చెప్పారు. సభకు విచ్చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, గవర్నర్ అబ్దుల్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. ఎక్కడికెళ్లినా ప్రధాన మంత్రిపై ప్రజలు నమ్మకం చూపిస్తున్నారని ముఖ్యమంత్రి చెప్పారు. దేశ ప్రజలకు మోదీపై నమ్మకం, విశ్వాసం ఉందని ఆయన తెలిపారు.

## చుట్టుముట్టిన కార్చిచ్చు

కమ్మేసింది. మరోవైపు ఒక్కసారిగా ప్రజలు రోడ్ల పైకి రావడంతో చాలాచోట్ల ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఇక్కడ కొండలపై ఉన్న రహదారులు ఇరుగ్గా ఉంటాయి. దీనికితోడు గాలులు ఎక్కువగా వీయడంతో మంటలు తొందరగా వ్యాపిస్తున్నాయి. రాత్రి వేళల్లో ఇక్కడ గంటకు 100 మైళ్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. కాలిఫోర్నియా గవర్నర్ గవిన్ న్యూసమ్ స్పందిస్తూ.. 'చాలా నిర్మాణాలు కాలిపోయాయి. మరికొన్నిచోట్ల కూడా కార్చిచ్చులు పుట్టొచ్చని అగ్నిమాపక శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు' అని తెలిపారు. ఇప్పటివరకు మొత్తం 13,000 నిర్మాణాలకు కార్చిచ్చు ముప్పున్నట్లు లాస్ ఏంజెలెస్ అగ్నిమాక అధికారి క్రిస్టిన్ క్రాప్లీ చెప్పారు. బెవర్లీ హిల్స్, హాలీవుడ్ హిల్స్, మలిబు, శాన్‌ఫెర్నాండో ప్రాంతాలకు కార్చిచ్చు వ్యాపించే ప్రమాదం ఉన్నట్లు అనుమానిస్తున్నారు. ఇప్పటికే ఇక్కడ్గి ÷ర్ అలర్ట్ లెవల్స్‌ను పెంచారు. దాదాపు 62,000 మంది ప్రజలు కొన్ని గంటలుగా విద్యుత్తు లేక ఇబ్బందిపడుతున్నారు. ఇక్కడ మంటలను ఆర్పడానికి విమానాలు, హెలికాప్టర్లు, బుల్డోజర్లను అధికారులు రప్పించారు. హాలీవుడ్ స్టార్లు టామ్ హాంక్స్, రీస్ విథర్స్పూన్, స్పెన్సర్ ప్రాట్, హెడీ మోంటాగ్ వంటి నటుల ఇళ్లు అగ్నికి ఆహుతైనట్లు తెలుస్తోంది. మరికొందరి ఇళ్లు కూడా అగ్నికీలలకు సమీపంలో ఉన్నట్లు తెలుస్తోంది. అధ్యక్షుడు జోబైడెన్ ఇక్కడి కార్చిచ్చుపై స్పందించారు. తరచూ అప్‌డేట్లు తెలుసుకొంటున్నట్లు వెల్లడించారు. అక్కడి ప్రజలకు అవసరమైన అన్నిరకాల సాయాలను శ్వేతసౌధం చేస్తుందన్నారు. స్థానిక అధికారులతో తన బృందం టచ్‌లో ఉన్నట్లు వెల్లడించారు. ఇప్పటికే్గ ÷ర్ మేనేజ్‌మెంట్ అసిస్టెంట్ గ్రాంట్‌ను విడుదల చేసినట్లు పేర్కొన్నారు. అక్కడి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. స్థానిక అధికారుల సూచనలు పాటించాలని కోరారు.

## మహిళల శరీరంపై వ్యాఖ్యలు లైంగిక వేధింపే..

విద్యుత్తు శాఖకు చెందిన ఓ మహిళా ఉద్యోగినిపై మరో ఉద్యోగి కామెంట్ చేశారు. దీంతో ఆమె లైంగిక వేధింపుల కేసు నమోదు చేసింది. ఆ కేసును కొట్టివేయాలని కోరుతూ ఆ ఉద్యోగి కోర్టును ఆశ్రయించాడు. 2013 నుంచి ఆ ఉద్యోగి చాలా అసభ్యకరమైన భాషను వాడారని, 2017లో అభ్యంతరకరమైన మెసేజ్‌లు, వాయిస్ కాల్స్ చేసేవాడని ఆమె ఆరోపించింది. విద్యుత్తు శాఖకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండాపోయిందన్నారు. మహిళా ఉద్యోగి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఐపీసీలోని సెక్షన్ 354ఏ(లైంగిక వేధింపులు), 509(మహిళను కించపరచడం), సెక్షన్120(ఓ) కింద కేసు బుక్ చేశారు. కేరళ పోలీసు చట్టంలోని సెక్షన్ 120(ఓ) కింద కూడా ఆ ఉద్యోగి లైంగిక వేధింపులకు పాల్పడినట్లు కోర్టు పేర్కొన్నది. అయితే కేవలం శరీర శౌష్టవం బాగుందని కామెంట్ చేసినంత మాత్రానా.. తనపై లైంగిక వేధింపుల కేసు నమోదు చేశారని, ఆకేసును కొట్టివేయాలని విద్యుత్తు శాఖ ఉద్యోగి కోర్టును ఆశ్రయించారు. కాల్స్, మెసేజ్‌లతో నిందిత వ్యక్తి లైంగిక వేధింపుల కామెంట్స్ చేసినట్లు మహిళా ఉద్యోగి ఆరోపించింది. అయితే ఐపీసీలోని సెక్షన్ 354ఏ, 509తో పాటు సెక్షన్ 120 కేరళ పోలీసు చట్టం ప్రకారం నిందితుడిపై తగిన ఆధారాలు ఉన్నట్లు హైకోర్టు తెలిపింది.

## నేనొచ్చేలోగా బందీలందరూ విడుదల కావాలి

విడుదల చేయాలని పునరుద్ఘాటించారు.'మీ చర్చలను నేను దెబ్బతీయాలనుకోవడం లేదు. కానీ, నేను బాధ్యతలు స్వీకరించేసరికి వారు తిరిగి రాకపోతే పశ్చిమాసియాలో ఆకస్మిక దాడులు జరుగుతాయి' అని ట్రంప్ పేర్కొన్నారు. ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు ఆయన ఈమేరకు సమాధానమిచ్చారు.బందీల విడుదలపై చర్చలు చివరిదశకు చేరుకున్నాయని మధ్యప్రాచ్యంలోని అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవెన్ చార్లెస్ విట్కాఫ్ విలేకరులకు తెలిపారు. 'బందీల విడుదల చర్చలు చివరిదశకు చేరుకున్నాయి. మేము ఇందులో గొప్ప పురోగతి సాధించాం. డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు స్వీకరించే నాటికి మేము కొన్ని మంచి అంశాలను ప్రకటించాలని ఆశిస్తున్నాం.హమాస్ ఇప్పటికే బందీలను విడుదల చేయాల్సిఉంది. కానీ, చేయలేదు. ఇది ఆ సంస్థకు అంత మంచిది కాదు. అక్టోబరు 7నాటి దాడులు మళ్లీ జరగకూడదు. ఆ దాడుల్లో అనేకమంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. నాకు ఇజ్రాయెల్ నుంచి చాలామంది ఫోన్ చేశారు. బందీలను త్వరగా విడిపించాలని వేడుకున్నారు. అమెరికాకు చెందిన కొందరు పౌరులు సైతం అక్కడ బందీలుగా ఉన్నారు. బందీల తల్లిదండ్రులు నా దగ్గరకు వచ్చి వారి బాధను పంచుకున్నారు' అని విట్కాఫ్ పేర్కొన్నారు.ఇదిలాఉండగా.. ట్రంప్ గతంలోనూ హమాస్‌ను హెచ్చరించారు. జనవరి 20న తాను అధికార బాధ్యతలు చేపట్టేలోపు బందీలను విడుదల చేయాలని పేర్కొన్నారు. లేకపోతే ఈ దురాగతాలకు పాల్పడేవారికి నరకం చూపిస్తానని, చరిత్రలో ఎన్నడూ చూడని పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. అమెరికా- ఇజ్రాయెల్ జాతీయుడైన 20ఏళ్ల ఎడాన్ అలెగ్జాండర్ వీడియోను ఆ సంస్థ విడుదల చేసిన వేళ.. ఆయన ఈ హెచ్చరికలు చేశారు. 2023లో ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి చేయడంతో సుమారు 1,200 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. 251 మందిని ఆ సంస్థ బంధించి గాజాలోకి తీసుకెళ్లింది. మధ్యలో తాత్కాలికంగా జరిగిన కాల్పుల విరమణ ఒప్పందం వేళ కొందరు బందీలు విడుదల కాగా.. ఇంకా 97 మంది హమాస్ చెరలోనే ఉన్నారు. అయితే పలు ఘటనల్లో మరికొందరు మృతి చెందారు. ప్రస్తుతం 51 మంది మాత్రమే సజీవంగా ఉండి ఉంటారని ఇజ్రాయెల్ మీడియా చెబుతోంది.

## సరిహద్దులో బంగ్లా ఆక్రమణలు అవాస్తవం

గ్రామంలోని బగ్డా బ్లాక్‌లోని భూభాగంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇక్కడ అంతర్జాతీయ సరిహద్దు కొడల్యా నదీ తీరం నుంచి వెళుతుంది. ఇరువైపులా కచ్చితమైన హద్దులను గుర్తించి స్తంభాలు పాతి వేసిన కంచె ఉంది. ఇక ఈ సరిహద్దు వెంట బీఎస్ఎఫ్ గస్తీలో ఎటువంటి మార్పు జరగలేదు. ఒక్క అంగుళం భారత భూభాగాన్ని తీసుకోలేదు, తీసుకోలేరు కూడా. 1975 భారత్ బంగ్లా బోర్డర్ గైడ్‌లైన్స్ ఆధారంగా బీఎస్ఎఫ్, బీజీబీ వాటి విధులను ప్రశాంతంగా నిర్వహిస్తున్నాయి' అని బీఎస్ఎఫ్ దక్షిణ బెంగాల్ ఫ్రంటియర్ పేర్కొంది. అంతేకాదు.. కంచె లేని చోట్ల కూడా బంగ్లాదేశీల చొరబాట్లు, స్మగ్లింగ్ వంటివి జరగకుండా కఠినచర్యలు తీసుకొన్నట్లు బీఎస్ఎఫ్ వివరించింది. బంగ్లాదేశ్‌కు చెందిన మీడియాలోని కొన్ని వర్గాలు నిరాధారంగా వీటిని ప్రచారం చేస్తున్నాయని బీఎస్ఎఫ్ అభిప్రాయపడింది.

# సన్నబియ్యం ధరలు పైపైకి..

- ఉత్పత్తి పెరిగినా తగ్గని రేట్లు
- సామాన్యుడికి అందుబాటులో లేకుండా ధరలు



వనపర్తి,జనవరి08 (జనంసాక్షి): వస్తువు ఉత్పత్తి పెరిగితే ధరలు తగ్గుతాయని వినియోగదారులు ఆశించడం పరిపాటి.కాని వరి ధాన్యానికి ఈ విషయం వర్తించడం లేదు. ఈ ఏడాది వానాకాలంలో వరిధాన్యం రికార్డు స్థాయిలో పండినప్పటికీ సన్న బియ్యం ధరలు సామాన్య ప్రజలకు అందుబాటులో లేవు. నూర్పిళ్ళు జరుగుతున్న సమయంలో బియ్యం ధరలు తక్కువగా ఉండేవి. అందుకే గతంలో తక్కువ రేట్లకు లభ్యం అవుతున్నందున అప్పులు చేసైనా సరే వాడకం దారులు తమకు ఏడాదికి సరిపోయే మొత్తంలో బియ్యాన్ని కొని స్టాక్ చేసుకునే వారు.అయితే ఈ వర్షా కాలం సీజన్‌లో వివిధ కారణాలతో గతంలో కంటే సన్న రకం ఎక్కువగానే సాగైంది.మంచి దిగుబడులు సైతం వచ్చాయి. ఈ లెక్కన ధర తగ్గాల్సింది పోయి గత యే డాది కన్నా పెరగడం వినియోగదారుల్ని ఆందోళనకు గురి చేస్తోంది. వీటికి తోడు నిత్యావసర సరకుల ధరలు పెరగడంతో సామాన్య మధ్య తరగతి కుటుంబాలపై ఆర్థిక భారం పడుతోంది.

### అంచనాకు మించి వరి సాగు

వనపర్తి అతి తక్కువ భూకమతాలు కలిగిన జిల్లా అయినప్పటికీ 1.90 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. సాధారణం కన్నా అధికంగా నే వరి ధాన్యం దిగుబడులు వచ్చాయి. 33 రకాల సన్నధాన్యం పండించిన రైతులకు క్వింటాలుకు రూ. 500 అదనంగా ప్రభుత్వం బోనస్ ప్ర కటించడంతో మునుపెన్నడూ లేని రీతిలో సన్నరకం ధాన్యం సాగైంది. వీటన్నింటి నేపథ్యంలో ధర తగ్గాల్సి ఉండగా. ఆ పరిస్థితు లు ఎక్కడా కనిపంచడం లేదు. ప్రతి ఏటా ధరలు పెరు గుతాయన్న కారణంతో చాలా మంది ఏడాదికి సరిపోయే స్థాయిలో కొనుగోలు చేసి నిల్వ ఉంచుకుంటారు. పెరిగిన ధరలతో ఈ సారి కొనుగోలు చేసేందుకు తర్జన భర్జన పడుతున్నారు.

### ప్రైవేటు ప్రభావంతోనే..

ఈ సారి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆలస్యంగా ప్రారంభించడంతో పాటు నిబంధనల్ని కఠినతరం చేశారు. ప్రభుత్వం ఇస్తున్న ధరకు మించిన స్థాయిలో ప్రైవేటులో ధర పలకడంతో అత్యధికులు ప్రైవేటు వ్యాపారులు, మిల్లర్లకే విక్రయించారు. ఇప్పుడు ప్రైవేటు వ్యాపారులు సన్న వడ్లనే మిల్లింగ్ చేసి గ్రామాలు పట్టణాల్లో అధిక ధరలకు విక్రయిస్తున్నారు. మిల్లింగ్ చేస్తే 60 నుంచి 65 కిలోల లోపే బియ్యం వస్తుండటంతో ధర పెంచక తప్ప డంలేదని వ్యాపారులు అంటున్నారు. అధికారుల నియంత్రణ లేకపోవడంతోనే ఉత్పత్తి పెరిగినా అమ్మకం దారులు ఇష్టానుసారంగా ధరలు పెంచుతున్నారని వినియోగ దారులు అంటున్నారు. అక్రమంగా బియ్యాన్ని బయట ప్రాంతాలకు తరలించడం కూడా ధరలు అదుపులో లేక పోడానికి కారణమని అంటున్నారు. రేషన్ కార్డులు లేని కుటుంబాలు ఇంకా సుమారు 40 వేల వరకు ఉన్నాయన్న అంచనా ఉంది. గ్రామీణ ప్రాం తాల్లో అన్నమే ఎక్కువ తింటుంటారు.. ఈ లెక్కన పెరిగి న ధరలతో సామాన్య, మధ్య తరగతి కుటుంబీకులపై భారం ఏ మేరకు పడుతుంతో అర్థమవుతోంది.

### మిల్లర్లు, రిటైల్ వ్యాపారుల దగా..

కొత్త బియ్యం ధరలు పెరగడానికి కారణం కావడమేనని వినియోగదారులు ఆరోపిస్తున్నారు.వరి ధాన్యం కొనుగోళ్ళు బియ్యం అమ్మకాలపై ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణ లేనందుకే విచ్చల విడిగా ధరలను పెంచుతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.జీఎస్టీ రాకముందు మిల్లర్లు, వ్యాపారులు ప్రతి క్విం టాల్‌పై నాలుగు శాతం పన్నులు చెల్లించే వారు. కానీ జీఎస్టీ అమలులోకి వచ్చాక వ్యవసాయ ఆధారిత ఉత్ప త్తులపై పన్నులను పూర్తిగా తొలగించారు. అందులో భా గంగానే బియ్యంపై వ్యాట్‌ను పూర్తి ఎత్తివేశారు. దీంతో పాటు రైస్ మిల్లులు వరి ధాన్యం రూపంలో వ్యాపారులకు అమ్మితే గతంలో ఉన్న ఒక్క శాతం పన్నును 2019లో ప్రభు త్వం ఎత్తివేసింది. రైస్‌మిల్లర్లు ఒక్క శాతం ప్యాడీపై మా త్రమే మార్కెట్ ఫీజును చెల్లించాల్సి ఉంటుంది. జీఎస్టీ వచ్చాక నాలుగు శాతం వ్యాట్‌ను ఎత్తివేశారు. ఒక్కశాతం పన్నును కూడా ఎత్తివేశారు. అయినప్పటికీ ధరలు మాత్రం పెరుగుతూనే ఉన్నాయి కానీ తగ్గడం లేదు. వ్య వసాయాధారిత ఉత్పత్తులు వినియోగదారులకు తక్కువ ధరలకే అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పన్నులను ఎత్తివేసింది. కానీ క్షేత్ర స్థాయిలో పరిస్థితి ఇందుకు బిన్నంగా ఉంది. వ్యాపారులు పన్నులు చెల్లించినప్పుడు బియ్యం ధరలు తక్కువగానే ఉన్నాయి. ప్రస్తుతం పన్నుల రద్దు అయిన తదుపరి బియ్యం ధరలు విపరీతంగా పెరిగాయి. ప్రభుత్వం సరియ్నైన రీతిలో పర్యవేక్షణ చేయని కారణంగానే వ్యాపారులు ఇష్టారాజ్యంగా ధరలు పెంచుస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి ధరలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

## ప్రభుత్వానికి ప్రజలకు మధ్య
# వారధి పత్రికలు



- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి
- జనంసాక్షి రంగారెడ్డి జిల్లా క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మంత్రి కోమటిరెడ్డి, విప్ పట్నం, స్పీకర్ గడ్డం

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, జనవరి 8 (జనంసాక్షి):** ప్రభుత్వం ప్రజలకు మధ్య వారధి పత్రికలని, ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ అభివృద్ధి పథకాలు ప్రజలకు చేరువేయడంలో వాటి పాత్ర కీలకమని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.బుదవారం రంగారెడ్డి జిల్లా చేవెళ్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన భవనంలో రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్,ప్రభుత్వ విప్ పట్నం మహేందర్ రెడ్డి,జిల్లా గ్రంధాలయ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి, చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య,మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి రంగారెడ్డి జిల్లా జనంసాక్షి క్యాలెండర్ ను ఆవిష్కరించారు.జనం సాక్షి దినపత్రిక రంగారెడ్డి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ కోట భారత్,చేవెళ్ల ఇన్చార్జి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో 2025 వ సంవత్సరం నూతన సంవత్సర క్యాలెండర్ ను స్థానిక జర్నలిస్టులు కాంగ్రెస్ శ్రేణులు తదితరులు కలిసి ఆవిష్కరించారుఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ..జనం సాక్షి పత్రిక అన్ని రంగాల్లో ముందుండి ప్రజల సమస్యలను వెలికి తీయడంతో పాటు రాజకీయ పార్టీల సర్వేలలో నిజానిజాలు బయట పెట్టేది జనం సాక్షి పత్రికనే అన్నారు 2023 జరిగిన అసెంబ్లీ ఎన్నికల సర్వేలో జనం సాక్షి చేసిన సర్వే ఆదారంగానే ఫలితాలు వచ్చాయని అన్నారు రాబోయే రోజుల్లో జనం సాక్షి మరింత పేరు ప్రఖ్యాతలు దక్కుతాయని అన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలోని ఆర్థిక, రాజకీయ, సామాజిక తదితర అన్ని వర్గాలను నిష్పక్షపాతంగా సమన్వయం చేస్తూ మంచి చెడులను ఎత్తిచూపి ఏ స్వార్థం లేకుండా సమాజ శ్రేయస్సు కొరకు నిరంతరం పాటుపడతూ, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు జర్నలిస్టులు ముందు ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పామేనా భీమ్ భరత్, చేవెళ్ల సొసైటీ చైర్మన్ దేవర సమతా వెంకటరెడ్డి, చేవెళ్ల మాజీ సర్పంచ్ బండారి శైలజా ఆగి రెడ్డి, డిసిసి ఉపాధ్యక్షుడు బండారి ఆగి రెడ్డి మాజీ సర్పంచ్ మధుసూదన్ గుప్తా, సాయి సచిన్,మాజీ ఎంపిటిసి గుండాల రాములు, డాక్టర్ వైభవ్ రెడ్డి, మొయినాబాద్ మాజీ జెడ్పిటిసి కాలే శ్రీకాంత్, షాబాద్ దర్శన్ తదితరులు ఉన్నారు.

## కింగ్‌ఫిషర్ బీర్ సరఫరా నిలిపివేత



**హైదరాబాద్, జనవరి 8 (జనంసాక్షి) :** ఇది బీర్ ప్రియులకు పెద్ద షాక్.. ముఖ్యంగా కింగ్ ఫిసర్ బీర్‌ప్రేమికులకు మింగుడు పడదు. తెలంగాణకు కింగ్ ఫిషర్ల బీర్ల సరఫరా నిలిపివేస్తున్నట్లు యునైటెడ్ బ్రూవరీస్ కంపెనీ స్పష్టం చేసింది. తెలంగాణ స్టేట్ బేవరేజ్ కార్పొరేషన్ లిమిటెడ్ బకాయిలు చెల్లించకపోవడంతో.. ఈ నిర్ణయం తీసుకున్నట్లు యూబీఎల్ ప్రకటించింది. తెలంగాణ ప్రభుత్వం బీర్ల ధరలను పెంచింది కానీ.. తయారీదారులకు చెల్లించే బేస్ ధరను పెంచకపోవడంతో భారీ నష్టాలు వస్తున్నాయని యూబీఎల్ తెలిపింది. బీర్ల సరఫరా నిలిపివేతకు ఇది కూడా ఒక కారణమని కంపెనీ పేర్కొంది. తెలంగాణ నుంచి రూ. 900 కోట్లు రావాల్సి ఉందని పేర్కొంది. ఈ జాప్యం కూడా కంపెనీ నష్టాలకు కారణమైందని తెలిపింది. ఈ విషయాన్ని సెబీకి లేఖ ద్వారా తెలిపింది. కింగ్ ఫిషర్, కింగ్ ఫిషర్ స్ట్రాంగ్, కింగ్ ఫిషర్ అల్ట్రా, కింగ్ ఫిషర్ అల్ట్రా మ్యాక్స్‌తో పాటు ఇతర బ్రాండ్లను నిలిపివేస్తున్నట్లు యూబీఎల్ స్పష్టం చేసింది. నిజానికి తెలంగాణ రాష్ట్రంలో బీర్ల అమ్మకాలను పరిశీలిస్తే కింగ్ ఫిషర్ బ్రాండ్స్ 60 నుంచి 70 శాతం అధికంగా విక్రయం అవుతున్నట్లు తెలిపింది.

## బ్యాంకు సిబ్బంది వేధింపులు తాళలేక వ్యక్తి ఆత్మహత్య

**కుమ్రంభీం ఆసిఫాబాద్, జనవరి 8 (జనంసాక్షి) :** తీసుకున్న రుణం చెల్లించలేదని బ్యాంకు సిబ్బంది బెదరింరించడంతో ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ విషాదకర సంఘటన కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) మండలం శివపూర్ గ్రామంలో చోటు చేసకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన కారం సంతోష్(35) అనే వ్యక్తి జిల్లా కొ-ఆపరేటిట్ సొసైటీ బ్యాంకులో లోన్ తీసుకున్నాడు. అయితే డబ్బుల కట్టలేదని బ్యాంకు సిబ్బంది డబ్బులు కట్టాలని బెదిరింపులకు గురిచేశారు. దీంతో మనస్తాపం చెందిన సంతోష్ పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. బాధితుడి కుటుంబ సబ్యులు బ్యాంకు సిబ్బంది పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. సంతోష్ మృతితో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

## నీళ్లకోసం తండ్లాట

- ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించిన మహిళలు

**నాగర్‌కర్నూల్, జనవరి 8 (జనంసాక్షి) :** కాంగ్రెస్ పాలనలో తాగునీటి కోసం ప్రజలు తంట్లాడుతున్నారు. ప్రజా సంక్షేమాన్ని మరిచి పార్టీ ఫిరాయింపులు, ప్రతిపక్ష నేతలపై తప్పుడు కేసులు పెట్టడంలో ప్రభుత్వం బిజీగా దీంతో పాలనా పడకేయడంతో జనం ఇబ్బంది పడుతున్నారు. గుక్కెడు నీళ్ల కోసం మైళ్ల దూరం ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. తాజాగా మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం రామాపురం గ్రామంలోని ఏడో వార్డులో ప్రజలు అవస్థలు పడుతున్నారు. నెల రోజులుగా మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడంతో చాలా దూరం నుంచి నీళ్లు తెచ్చుకుంటున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీళ్ల సమస్య తీర్చాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు. లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

## కరీంనగర్ జిల్లాలో రోడ్డు ప్రమాదం... క్లీనర్ మృతి

**కరీంనగర్, జనవరి 8 (జనంసాక్షి) :** కరీంనగర్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. హుజురాబాద్ మండలం మాందాడిపల్లిలో వరంగల్ కరీంనగర్ జాతీయ రహదారిపై అదుపుతప్పి లారీ చెట్టును ఢీ కొట్టింది. ప్రమాంలో లారీ క్యాబిన్‌లో ఇరుక్కుని క్లీనర్ అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చి డ్రైవర్‌ను స్థానికులు, ఫైర్ సిబ్బంది బయటకు తీశారు. తీవ్రంగా గాయపడిన డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం హాస్పిటల్‌కు తరలించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# తెలంగాణ ప్రభుత్వానికి అభినందనలు

- ప్రముఖ చరిత్రకారులు సయ్యద్ నశీర్ అహమ్మద్

**హైదరాబాద్, జనవరి 8 (జనంసాక్షి) :** ఆధునిక భారత తొలి ముస్లిం ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ జన్మదినం అయినటువంటి జనవరి 9న తెలంగాణ రాష్ట్రం లోని పాఠశాలలు, కళాశాలలో ఆ చదువులతల్లిని స్మరణలో ఆమె జన్మదినోత్సవం జరుపుకోవాల్సిందిగా తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయటం పట్ల ప్రముఖ చరిత్రకారులు సయ్యద్ నశీర్ అహమ్మద్ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం సాయంత్రం తనను కలసిన విలేకరులతో ఆయన మాట్లాడుతూ సుమారు 150 ఏండ్ల క్రితం మహాత్మా జ్యోతి రావు పూలే, ఆయన సతీమణి సావిత్రి బాయి పూలే లతో కలసి విద్యకు దూరంగా ఉంచబడిన బడుగు, బలహీన వర్గాలలో, ప్రధానంగా బాలికల చదువు కోసం ఆమె అవిశ్రాంతంగా కృషి చేశారని ఆయన అన్నారు. ఆ క్రమంలో ఎదురైనా అన్ని కష్టనష్టాలను ఎదుర్కొంటూ ఇల్లు ఇల్లు తిరిగి బాలికలను పాఠశాలలకు రప్పించడానికి శ్రమించారని. ఫాతిమా షేక్ ఆయన సోదరులు ఉస్మాన్ కలసి మహాత్మా పూలే దంపతులకు ఆశ్రయం కల్పించారని, తమ ఇంటిని పాఠశాలగా మార్చి శ్రీ పూలే దంపతుల ప్రాథమిక ప్రయత్నాలకు అందండలు ఇచ్చారని నశీర్ అహమ్మద్ వివరించారు. ఆమె జీవితం గురించి భారతదేశం మొత్తం మీద తాను తొలి పుస్తకం రాశానని ఆయన చెప్పారు. ఈ పుస్తకాన్ని తెలుగు, ఆంగ్లం, ఉర్దూ, కన్నడ భాషల్లో ప్రచురించి ఎంపిక చేసిన గ్రంథాలయాలను, వ్యక్తులకు కానుకగా అందించామని ఆయన అన్నారు. ఈ గ్రంథం విడుదల అయ్యాక గత సంవత్సరం గూగుల్ కూడా " గూగుల్ డ్యూడుల్" విడుదల చేసిందాని నశీర్ అహమ్మద్ తెలిపారు. గత సంవత్సరం ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఫాతిమా షేక్ జీవిత చరిత్రను పాఠశాలల విద్యార్థులకు పాఠ్యాంశం చేసిందని ఆయన వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం కూడా ఆ చదువుల తల్లి స్మరణలో తగిన చర్యలు చేసినట్లయితే బాగుంటుందని అన్నారు.



# కొత్తకొండ వీరన్న జాతరకు రండి

- ప్రముఖులకు ఆహ్వానం అందించిన ఆలయ ఈఓ..

**భీమదేవరపల్లి, జనవరి 8 (జనం సాక్షి) :** ఉత్తర తెలంగాణలో ప్రసిద్ధి చెందిన కొత్తకొండ శ్రీ వీరభద్రస్వామి అలయ జాతర బ్రహ్మోత్సవాలకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు.ఈ నెల 10న భద్రకాళీ సమేతా వీరభద్రస్వామి కళ్యాణోత్సవంతో మ్నొదలయ్యే జాతర బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి.కాగా బుధవారం కళ్యాణ మహొత్సవానికి వరంగల్ పోలీస్ కమిషనర్ హెడ్ క్వార్టర్ లో డాక్టర్ సీపీ,అంబర్ కిషోర్ ఝ,కు అలయ ఇఓ కిషన్ రావు,ఆహ్వానపత్రిక అందించారు.వారితో పాటు వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, స్టేషన్ ఘన్పూర్ పార్లమెంట్ సభ్యులు కడియం శ్రీహరి, వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి,నీకలిసి కళ్యాణోత్సవానికి ఆహ్వానించారు. అలయ ఇఓతో పాటు ముఖ్య అర్చకులు మొగిలిపాలెం రాంబాబు, అర్చకులు తాటికొండ వినయ్ చర్మ,తాటికొండ పరమేష్,ఉన్నారు.

# ఓసి త్రీ లారీ ప్రమాదంలో గాయపడ్డ డ్రైవర్ మృతి

- అన్వర్ మృతితో రోడ్డున పడ్డ కుటుంబం
- ప్రభుత్వం ఆదుకోవాలని సహచర డ్రైవర్ల విజ్ఞప్తి






**గణపురం, జనవరి 8 (జనంసాక్షి) :** మండలంలోని కేటీకే ఓసీ త్రీ గనిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ లారీ డ్రైవర్ ఎండి అన్వర్ (42) హైద్రాబాద్‌లో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారు జామున 2 గంటలకు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ నెల 2 రాత్రి 10 అనంతరం ఓసి -త్రీ ప్రాజెక్టులో మట్టిలోడు అన్ లోడ్ చేసి క్వారీలోకి వెళుతున్న లారీ టిప్పర్ పొగమంచు కారణంగా ముందు వెళ్తున్న వోల్వో టిప్పర్ ను వెనుక నుంచి బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో గణపురం మండల కేంద్రానికి చెందిన వోల్వో డ్రైవర్ ఎండి అన్వర్ పాషాకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ అతన్ని చికిత్స నిమిత్తం మొదట స్థానిక సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్ కు తరలించారు. గత వారం రోజులుగా అన్వర్ చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారు జామున మృతి చెందాడు. మృతునికి భార్య, యాకూబి, కుమారులు ఆసిఫ్, రియాన్ లు ఉన్నారు. అన్వర్ మృతితో ఆ పేద కుటుంబం రోడ్డున పడింది. సింగరేణి సంస్థ తగిన ఆర్థిక సహాయం చేసి బాధిత కుటుంబానికి అదుకోవాలని గ్రామస్థులు, సహచర డ్రైవర్లు కోరుతున్నారు.

### అన్వర్ కుటుంబానికి అండగా ఉంటాం : మాజీ ఎంపీటీసీ షమా పాషా

ఓసి త్రీలో లారీ ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ హైదరాబాదులో మృతి చెందిన అన్వర్ కుటుంబానికి అండగా ఉంటామని మాజీ ఎంపీటీసీ షమా పాషా అన్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన అన్వర్ ప్రమాదంలో అకాల మృతి చెందడం పట్ల సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబానికి అండగా ఉండి తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామని హామీ ఇచ్చారు.

# మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

- స్వయం సహాయక సంఘాల ద్వారా 1000 మెగావాట్ల ఉత్పత్తి త్వరలో టెండర్లు ఖరారు చేస్తాం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- స్వయం సహాయక సంఘాల ద్వారా సోలార్ పవర్ ప్లాంట్ ల ఏర్పాటు ప్రగతిపై జిల్లా కలెక్టర్లతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వీడియో కాన్ఫరెన్స్.




**ములుగు ప్రతినిధి, జనవరి 08(జనంసాక్షి) :** రాష్ట్రంలో మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజా ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా సోలార్ పవర్ ప్లాంట్ ల ఏర్పాటు ప్రగతిపై బుధవారం ప్రజాభవన్ నుండి రాష్ట్ర పంచాయతిరాజ్, గ్రామీనాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ, ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి, పంచాయతి రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల కార్యదర్శి లోకేష్ కుమార్, సెర్ఫ్ సీఈవో దివ్య దేవరాజన్, ట్రాన్స్కో సీఎండి కృష్ణ భాస్కర్, విద్యుత్ శాఖల సిఎండిలతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థిక సాధికారత సాధిస్తేనే వారి ఎదుగుదలకు అవకాశాలు ఏర్పడతాయని డిప్యూటీ సీఎం తెలిపారు. అందుకుగాను అంది వస్తున్న కొత్త విద్యుత్ పాలసీ, ఇంధన, గ్రామీణ అభివృద్ధి శాఖల మధ్య గత సంవత్సరం నవంబర్ 19న కుదిరిన ఒప్పందాన్ని జిల్లా కలెక్టర్లు ఉపయోగించుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. ఐదు సంవత్సరాల కాలంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలని ఇందిరమ్మ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో మహిళలకు పెద్ద ఎత్తున వడ్డీ లేని రుణాలు అందుబాటులోకి తెస్తున్నాం. పెద్ద మొత్తంలో డబ్బు మహిళా సంఘాల చేతులకి వస్తున్న క్రమంలో వారు వివిధ వ్యాపారాలు చేసుకునేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసి వసతులు కల్పించాలని ఆదేశించారు. మహిళా సంఘాలు సోలార్ పవర్ ప్లాంట్ ల ఏర్పాటుకు వారికి అందుబాటులో ఉన్న భూమిని గుర్తించండి, అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమిని గుర్తించాలని కలెక్టర్లను ఆదేశించారు. మహిళా సంఘాలు ప్లాంట్ల ఏర్పాట్లులో ఆర్థిక సహాయం కోసం బ్యాంకు అధికారులతో సమన్వయం చేయాలని సూచించారు. మహిళా సంఘాల భూముల్లో ప్లాంట్ లో ఏర్పాటుకు విద్యుత్ శాఖ రేడ్కో ద్వారా టెండర్లు ఆహ్వానించిందని, త్వరలో టెండర్లు ఓపెన్ చేసి వాటిని ఖరారు చేస్తారని డిప్యూటీ సీఎం తెలిపారు. ఈ నేపథ్యంలో సంఘాలను గుర్తించి నిర్ధారించడం, భూ సేకరణ, బ్యాంకుల నుంచి ఆర్థిక సాయం వంటి పనులను గ్రామీణ అభివృద్ధి శాఖ, జిల్లా కలెక్టర్లు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి జిల్లాలో 150 ఎకరాలకు తగ్గకుండా రాష్ట్రవ్యాప్తంగా సుమారు నాలుగువేల ఎకరాలు సేకరించాల్సి ఉంటుందని కలెక్టర్లకు తెలిపారు. దేవాదాయ, ఇరిగేషన్ శాఖల పరిధిలోని భూములను గుర్తించాలని, కేంద్ర అటవీ హక్కుల చట్టం ప్రకారం గిరిజనులు భూమి అభివృద్ధి చేసుకునే అవకాశం ఏర్పడిందని తెలిపారు. అటవీ ప్రాంతాల్లో భూములపై హక్కులు ఏర్పడినప్పటికీ స్తంభాలు వేసి విద్యుత్ లైన్ ల ద్వారా విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసే క్రమంలో అటవీ శాఖ అధికారులతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా భూముల్లో సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తే ఎవరికి ఇబ్బంది ఉండదని డిప్యూటీ సీఎం సూచించారు. సోలార్ విద్యుత్తు అందుబాటులోకి వస్తే అటవీ ప్రాంతాల్లోని రైతులు డ్రిప్ ఇరిగేషన్ ద్వారా పెద్ద ఎత్తున పంటలు సాగు చేసుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు. ఈ దిశగా కలెక్టర్లు పనిచేస్తే గిరిజనులు ఆత్మగౌరవంతో బతికే అవకాశం స్పష్టంగా ఉందని తెలిపారు. చిన్నపాటి ఇండస్ట్రియల్ ఏరియాల ఏర్పాటుకు అధికారులు భూములు సేకరించాలని ఆదేశించారు. దీని ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలు వ్యాపారం చేసుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు. అటవీ హక్కుల ద్వారా లభించిన భూముల్లో అవకాడో వంటి పంటలు సాగు చేస్తే అటవీ సంపద పెరగడంతో పాటు గిరిజనులు ఆర్థికంగా బలోపేతం అవుతారని తెలిపారు. రాష్ట్రంలో 6.67 లక్షల ఎకరాలను ఇప్పటివరకు ప్రభుత్వం గిరిజనులకు పంపిణీ చేయగా ఆ భూముల్లో లాభసాటి పంటల సాగు జరగడంలేదని డిప్యూటీ సీఎం తెలిపారు. ఇకనుంచి ఆ భూముల్లో ఉపాధి హామీ, గిరిజన శాఖ, స్వయం సహాయక సంఘాల ద్వారా వచ్చే పథకాలు అన్నిటిని సమన్వయం చేసుకొని ఆర్థికంగా ప్రయోజనం కలిగించే పంటల సాగును ప్రోత్సహించడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని గిరిజన శాఖ అధికారులను డిప్యూటీ సీఎం ఆదేశించారు.

# ప్రజలకు ప్రమాదకరంగా వాయు కాలుష్యం

**మానవ జీవ ప్రమాణాలను జీవ వైవిధ్యాన్ని కాలుష్యం తీవ్రంగా దెబ్బతిస్తుంది.పలు రకాల కాలుష్య కారకాల వల్ల రోజు రోజుకు దేశంలో వాయు కాలుష్యం యొక్క తీవ్రత అందర్నీ ఆందోళనకు గురిచేస్తుంది.జనాభా ఎక్కువగా ఉన్నటువంటి నగరాల్లో రోజు రోజు ఈ వాయు కాలుష్యం ద్వారా మరణాలు కూడా ఎక్కువగా సంభవిస్తున్నాయి.హైదరాబాద్ సహా 10 నగరాల్లో రోజువారి మరణాల్లో సగటున ఏడు శాతానికి పైగా వాయు కాలుష్యం వల్లనే సంభవిస్తుందని చెప్పవచ్చు.**

లాన్ సెట్ నివేదిక ప్రకారం 2008 నుంచి 2019 మధ్య 11 నెలలలో సంభవించిన టువంటి దాదాపు 36 లక్షల మరణాలను అధ్యయనం చేసింది.రోజువారి మరణాలు వాయు కాలుష్యం మధ్య ఉన్నటువంటి సంబంధాలపైన హైదరాబాద్, అహ్మదాబాద్, బెంగళూరు, చెన్నై, ఢిల్లీ, కోల్ కత్తా, ముంబై, పూణే, సిమ్లా, వారణాసిలో అధ్యయనం చేసినట్టుగా లాన్స్ ట్ తెలిపింది.దేశంలోని 10 నగరాల్లో గాల్లో కాలుష్య రేణువుల స్థాయి ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రామాణిక పరిమితులను మించిందని నివేదిక వెల్లడించింది.దేశ రాజధానిలో ఎక్కువగా వాయు కాలుష్యము వుంది.దీనికి కారణము పొరుగు రాష్ట్రాల టువంటి పంజాబ్,హర్యానా, ఉత్తరప్రదేశ్ లో కూడా అంత వ్యర్థాలను కాల్చడం ద్వారా కూడా పెరగడానికి కొంత కారణంగా చెప్పవచ్చు.ఢిల్లీలోనే కాకుండా మన తెలంగాణ రాష్ట్రంలో రాష్ట్ర రాజధాని హైదరాబాదులో కూడా కాలుష్యం పంజా అనేటువంటిది విసురుతుంది.హైదరాబాద్, వరంగల్ సహా 10 జిల్లాల్లో ఏ క్వాలిటీ ఇండెక్స్ డేంజర్ బెల్స్ కనిపిస్తున్నాయి. హైదరాబాద్ చుట్టుపక్కల జిల్లాల సహా వరంగల్, నిజాంబాద్ లో ఏ క్వాలిటీ ప్రమాదకరస్థాయిలో తగ్గుతుంది. హైదరాబాదులో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ ( ఏ క్యూ ఐ) 128 ఉండగా, పార్టీక్యూలేటర్ స్థాయి 2.5 గ్రాములు ఉంది.వరంగల్ లో అత్యధికంగా 148 ఉండగా, పిఎం 2.5 స్థాయిలో క్యూబిక్ మీటర్,గాలిలో 59 మైక్రో గ్రాముల మేర నమోదయింది. తెలంగాణలో ఇప్పుడు చాలా చోట్ల 100 నుంచి 150 మార్కును టచ్ చేసింది. ఏ క్యూ ఐ స్థాయి 50 నుంచి 100 మధ్య ఉంటే గాలి నాణ్యత ఆరోగ్యకరం.100 నుంచి 150 వరకు ఉంటే అనారోగ్యం.150 నుంచి 200 రికార్డు అయితే ప్రమాదకరం. ఇంకా ఏ క్యూ ఐ 300 దాటిందంటే ప్రాణాలకు అత్యంత ప్రమాదకరం. ఇప్పటికే పరిశ్రమలు పొగ పెడుతుంటే, ఈ మధ్యలో జరిగిపోయిన దీపావళి పండుగతో బాణాసంచా కాల్పులతో అత్యంత వాయు కాలుష్యం ఏర్పడింది.పట్టణాల పరిసర ప్రాంతాల్లోని పారిశ్రామిక ప్రాంతాలు,మైనింగ్లు ఎక్కువగా జరుగుతున్నటువంటి ప్రాంతాల్లోనే వాయు కాలుష్యము ఎక్కువగా ఉంటుంది. తద్వారా వాయు కాలుష్యంతో అనేక మరణాలు పెరగడం జరుగుతుంది. వాయు కాలుష్యం తగ్గడానికి అనేక నివారణ చర్యలు చేపట్టాలి. అంతేకాక కొత్త వాహనాల కంటే పాత వాహనాలు ఎక్కువ వాయు కాలుష్యాన్ని విడుదల చేస్తాయని, పాత ట్రక్కుల నుంచి వెలువడేటువంటి వ్యర్థాలు కొత్త ట్రక్కుల కంటే 6 రేట్లు ఎక్కువ.పాతకాలం నుంచి వచ్చేటువంటి ఉద్గారాలు కొత్త కార్ల కంటే 2.6 రేట్లు ఎక్కువగా విడుదలవుతాయి.మోటార్ వాహనాలు చట్టం 1988 లోని సెక్షన్ 56 ప్రకారం నిర్ణిత అథారిటీ లేదా ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ ద్వారా జారీ అయిన ఫిట్నెస్ సర్టిఫికెట్లు కలిగి ఉంటే తప్ప రవాణా వాహనము చెల్లుబాటు కాదు.రిజిస్ట్రేషన్





చేయకపోతే నడపడానికి కూడా అనుమతి లేదు. ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ లో మానవుల జోక్యం లేకుండా వాహనాల ఫిట్ నెస్ పరీక్షించేటువంటి సదుపాయం ఉంటుంది. పౌరులు తమ వాహనాలను దేశవ్యాప్తంగా ఉన్నటువంటి ఏదైనా ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ లో పరీక్షించి, సంబంధిత అధికారుల నుంచి ఫిట్ నెస్ సర్టిఫికెట్ పొందవచ్చు.ఈ సర్టిఫికెట్ దేశమంతా కూడా చెల్లుబాటు అవుతుంది.సరియైన నిర్వహణ లేని వాహనాలు సమాజానికి పర్యావరణ భద్రతకు హాని కరం. అందుకే రైతులు కానీ,ఇతరులు కానీ అధికంగా చెత్త, చెదారం, చెట్లను కాల్చివేయడం చేయకూడదు. పరిశ్రమల నుండి గాలి కాలుష్యం పొగను ఫిల్టర్ చేసేటువంటి పరికరాలను అమర్చుకోవాలి.తద్వారా కొంత వాయి కాలుష్యాన్ని తగ్గించవచ్చు.పరిశ్రమలు ఉన్న ప్రదేశాల్లో అధికంగా చెట్లను నాటాలి.ఈ వాయు కాలుష్యం ద్వారా ముఖ్యంగా శ్వాసకోశకు సంబంధించినటువంటి వ్యాధులు ఎక్కువగా సంభవిస్తాయి.గుండె జబ్బులు, శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు, సి ఓ పి డి (క్రానిక్ అబ్స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్),ఊపిరితిత్తుల క్యాన్సర్ మరియు స్ట్రోక్‌తో సహా, వివిధ రకాల కాలుష్య సంబంధిత వ్యాధులకు, వాయు కాలుష్యం ప్రధాన ప్రమాద కారకంగా పరిగణించబడు తుంది.వీలైనప్పుడల్ల ప్రజా రవాణాను వినియో గించుకోవాలి. దగ్గర ప్రదేశాల్లో తిరిగేటప్పుడు సైకిల్ ను ఉపయోగించాలి.కాలుష్యకారకులను నియాంత్రించాలి.రానున్న ఐదేళ్లలో వాయు కాలుష్యాన్ని 20 శాతం నుంచి 30 శాతం వరకూ తగ్గించాలన్నదే ముఖ్య లక్ష్యము గా పెట్టు కొవాలి.దీనిలో భాగంగా కాలుష్య నివారణ చర్యలు చేపట్టాలని ప్రతి ఒక్కరికి సూచించాలి.కాలం చెల్లిన వాహనాలపై దృష్టి పెట్టి,కాలుష్య పరీక్షలు నిర్వహించాలి.ఈ-బైక్‌లు, సీఎన్‌జీ ఆటోలు, సోలార్ వాహనాలును ఇతర పరికరాల వినియోగాన్ని ప్రోత్సహించాలి.రోడ్లపై దుమ్ము రేగకుండా నీరు చిలకరించే యంత్రాలు,చెత్త ఊడ్చే మిషన్లను కొనుగోలు చేయాలి.మొక్కలు ఎక్కువగా నాటాలి.ఇలా ప్రజలంతా ఐక్యతతో చేసినప్పుడే వాయు కాలుష్యం తగ్గించవచ్చు.



డాక్టర్ మోటె చిరంజీవి
సామజిక వేత్త, విశ్లేషకులు
9949194327

# ఢిల్లీ కా 'కుర్సీ' కిస్కా హెూగా?



ఎండి.మునీర్
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు
9951865223



ఢిల్లీకా కుర్సీ కిస్కా హెూగా? ఇప్పుడు ఇక్కడ బీజేపీ, కాంగ్రెస్ పార్టీ లతో పాటు, అధికారం లో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ అధికారం కోసం పోటీ పడుతున్నాయి. అందరు కూడ ఆచి తూచి అభ్యర్థుల ఎంపిక మీద శ్రద్ధ తీసుకుని, జాబితాలను ప్రకటిస్తున్నారు. మాజీ ఉప ముఖ్యమంత్రి సిసోడియా ఈ సారి ఎందుకో గాని, తన నియోజకవర్గం వదిలి మరో నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు.ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు ఫిబ్రవరీ నెల 5 న జరుగనున్నాయి. ఫలితాలు 8 న వస్తాయి. 70 స్థానాలు, కోటి 55 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. దేశంలోనే ఇప్పుడు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు ప్రధాన్యతను సంతరించుకున్నాయి.గత పది ఏండ్లుగా మాజీ సీఎం అర్వింద్ కేజీరివాల్ నేతృత్వం లోని ఆమ్ ఆద్మీ పార్టీ ఢిల్లీలో అధికారం లో ఉన్నది. మాజీ సీఎం కేజీరీ వాల్, మాజీ డిప్యూటీ సీఎం సిసోడియా, మరో మంత్రి, ఒక రాజ్య సభ సభ్యుడు ఢిల్లీ మద్యం స్కాం లో జైలుకు వెళ్లి వచ్చారు. ప్రస్తుతం ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి ఆతిషి సీఎం గా ఢిల్లీ లో ఉన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ, ఆమ్ ఆద్మీ పార్టీ విడి విడి గా పోటీ లో ఉన్నాయి. బీజేపీ ఈ సారి ఢిల్లీ లో ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయం గా ముందుకు, దూకుడుగా వెళుతున్నది. కాంగ్రెస్ పార్టీ కూడ అదే నమ్మకం తో ఉన్నది.

**రాహుల్ మీద అపార నమ్మకం**

పార్లమెంట్ లో విపక్ష నేత రాహుల్ గాంధీ, ఎంపీ ప్రియాంక గాంధీ ఈ సారి ఎన్నికల క్యాంపైన్ మీద ప్రత్యేక దృష్టి పెట్టారు. వారి మీద కాంగ్రెస్ కు అపారమైన నమ్మకం ఉన్నది. యువత, శ్రామికులు,ఎక్కువగా ఢిల్లీలో కాంగ్రెస్ వైపు మొగ్గు చూపే పరిస్థితి ఉందని అంటున్నారు.ప్రధాని నరేంద్ర మోడీ, హెూమ్ మంత్రి అమిత్ షా లతో పాటు ఢిల్లీ ఎంపీలు అందరూ ఈ ఎన్నికల మీద కేంద్రికరించారు. మాజీ సీఎం కేజీరి వాల్ ను, ఆమ్ ఆద్మీ పార్టీ ని ఎలాగైనా దెబ్బ కొట్టాలని, బీజేపీ భావిస్తున్నది. ఢిల్లీ ఎల్జి సహకారం, ఆయన చేతిలో ఉన్న అధికారం బీజేపీ కి అన్ని స్థాయిల్లో ఉపయోగకరంగా చెబుతున్నారు.

**మాటల దాడి షురూ**

ఇప్పటికే బీజేపీ నేతల మాటల దాడి ఆమ్ ఆద్మీ పార్టీ, ఆ పార్టీ నేత కేజీరీ వాల్ పై, కాంగ్రెస్ మీద మొదలు అయిపోయింది.అటు బీజేపీ మీద వీరి మాటల దాడి కొనసాగుతున్నది.కేజీరీ వాల్ ను అనవసరంగా జైలు లో పెట్టారనే సానుభూతి ని పొందే పరిస్థితి కనిపించడం లేదు. ఇక ఆమ్ ఆద్మీ పార్టీ అమలు చేసిన, అమలు చేయడానికి చెబుతున్న ఉచిత పథకాల ప్రభావం ఎంత ఉంటుందో, చూడాలి! అందుకు, ఆమ్ ఆద్మీ పార్టీ అడ్డగోలు ఉచితాల హామీలకు నిధులు ఎక్కడివి?అని బీజేపీ ప్రశ్నిస్తున్నది.ఢిల్లీ లో కాలుష్యం లాంటి సమస్య కూడ ఎన్నికల్లో ప్రధాన అంశంగా మారింది. మరో వైపు లా అండ్ ఆర్డర్ సమస్యలు ఉన్నాయి. మద్యం స్కాం ఒక వైపు ఉన్నది. మరో వైపు ఇండియా కూటమి లో ఉండి కూడా హర్యాణ లో కాంగ్రెస్ పార్టీ విడిగా పోటీ చేసి ఓటమి పాలు అయిన విషయం ను మరిచి, ఢిల్లీ లో ఆమ్ ఆద్మీ పార్టీ హర్యాణ లో కాంగ్రెస్ చేసిన తప్పునే చేస్తున్నది. ఈ రెండు పార్టీ లు విడి విడి గా పోటీ చేస్తున్నాయి. హర్యాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ చేసిన తప్పును ఢిల్లీ లో ఆమ్ ఆద్మీ పార్టీ చేస్తున్నది. బీజేపీ ఏమి కోరుకుంటున్నదో, ఢిల్లీలో అదే జరుగుతుంది. ఢిల్లీ లో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రభావం ఉంటుందని కాంగ్రెస్ భావిస్తున్నది.

**ప్రతి ష్టాత్మకంగా తీసుకున్న బీజేపీ**

మొత్తానికి బీజేపీ ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నది. ఎన్ని దండోపాయలు చేసి అయినా ఢిల్లీ అసెంబ్లీ కైవసం చేసుకోవాలని భావిస్తున్నది. అదే లైన్ లో ముందుకు పోతున్నది. అయితే ఇక్కడ గత వైభవం కేజీరీ వాల్ కు లేదనే విషయం ను ఆయన అంగీకరించే పరిస్థితి లో కనిపించడం లేదు. ఢిల్లీ ఎన్నికలు ఇప్పుడు టాక్ అఫ్ ది కంట్రీ అయిపోయాయి!బీజేపీ కి ఢిల్లీ గెలుపు ఖాయం అనే నమ్మకం మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ కి, కాంగ్రెస్ కు ఒక్క సీటు కూడ ఢిల్లీ లో రాకపోవడం వల్ల పెరిగింది! అయితే అది పార్లమెంట్ సంగతి, ఇది అసెంబ్లీ సంగతి కదా! చూద్దాం! ఏం జరుగుతుందో! ఓటర్లు ఏమి ఆలోచిస్తున్నారో? వెయిట్ అండ్ సీ.







# మత సంస్కరణవాద సంప్రదాయాన్ని కాపాడేందుకు పోరాటం

**శివగిరి మఠం అన్ని పార్టీలతో సత్సంబంధాలు కొనసాగిస్తోంది. వార్షిక శివగిరి యాత్ర రాజకీయ పార్టీల నాయకులకు యాత్రికులను ఉద్దేశించి ప్రసంగించే అవకాశాన్ని కల్పిస్తుంది. గత కొన్నేళ్లుగా ప్రధాని నరేంద్ర మోదీ, హెూంమంత్రి అమిత్ షా, కాంగ్రెస్ నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ యాత్రికులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ ఏడాది శివగిరి మఠం కార్యక్రమానికి విజయన్‌ను ఆహ్వానించారు.**

దీని ప్రకారం, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ 31 డిసెంబర్ 2024న వర్కాలలోని శ్రీ నారాయణగురు సమాధి స్థలంలో 92వ శివగిరి తీర్థయాత్ర ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు. విర్కాలలోని నారాయణగురు సమాధి వద్ద శివగిరి యాత్రకు సంబంధించి నిర్వహించిన సమావేశంలో విజయన్ మాట్లాడుతూ.. గురువును సనాతన ధర్మానికి ప్రతీకగా చిత్రీకరించేందుకు విశ్వప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. "గురువు ఎప్పుడూ సనాతన ధర్మాన్ని బోధించేవాడు కాదు. బదులుగా, అతను సనాతన ధర్మాన్ని కొత్త యుగానికి పునర్నిర్మించడానికి ప్రయత్నిస్తున్నాడు" అని విజయన్ కొనసాగించాడు, "సనాతన ధర్మం యొక్క సారాంశం దాని వర్ణాశ్రమ వ్యవస్థలో ఉంది, ఇది గురువులు. కులతత్వానికి వ్యతిరేకంగా నిలబడిన వ్యక్తి గురువు. అతని కొత్త యుగం మతం మతం ద్వారా నిర్వచించబడలేదు కానీ అది ప్రజల మేలు కోసం పద్ధతిపై ఆధారపడింది. మతం యొక్క చట్రంలో నిర్మించడం గురువుకు వ్యతిరేకంగా చేసిన పాపం. సంఘ సంస్కర్త శ్రీ నారాయణగురువును సనాతన ధర్మంలోకి తీసుకురావడానికి జరుగుతున్న ప్రయత్నాన్ని విజయన్ తన ప్రసంగంలో ఖండించారు. సమాజంలో కుల విభజనకు మూలాధారమైన వర్ణాశ్రమ ధర్మానికి సనాతన ధర్మం సమానమని ఆయన అభిప్రాయపడ్డారు. శ్రీ నారాయణ గురుని సనాతన ధర్మ విజేతగా ప్రచారం చేయడం కుల వ్యవస్థపై ఆధారపడిన అణచివేతను నిర్మూలించే శ్రీ నారాయణ గురు పనికి మరియు ఆయన మానవతా సందేశానికి విరుద్ధమని విజయన్ వాదించారు.

విజయన్ మాట్లాడుతూ, "శ్రీ నారాయణ గురుని సనాతన ధర్మ వాదిగా చూడలేము. 'ఒకే కులం, ఒకే మతం, మరియు ప్రజల కోసం ఒక దేవుడు' అని వాదించిన గురువు సనాతన ధర్మానికి ప్రతినిధి లేదా వాది కాదు. గురువు ప్రధాన పాత్ర పోషించాడు. సంస్కరణలో పాత్రను మీరు పరిశీలిస్తే, సనాతన ధర్మం వర్ణాశ్రమ ధర్మానికి పర్యాయపదంగా లేదా విడదీయరానిదని మీరు కనుగొంటారు, ఇది వంశపారంపర్య వృత్తుల వైభవం. అయితే శ్రీ నారాయణ్ గురు వంశపారంపర్య వృత్తులను ఏమి చేసారు? నేడు, మత హింస ఆధారంగా ప్రపంచానికి భాష్యం చెబుతున్నా, శ్రీ నారాయణగురు ఆలోచనలు నేటికీ ఔచిత్యంగా ఉన్నాయని అన్నారు. గురు జై వ్యతిరేకంగా పోరాడిన వాటికి మద్దతుదారుగా గురు జైని చిత్రీకరించే ప్రయత్నాన్ని ప్రజలు ప్రతిఘటించాలి, గురువును కేవలం మత నాయకుడిగా లేదా సాధువుగా ప్రచారం చేయడాన్ని నిరోధించాలి. గురువుకు మతం లేదా కులం లేదు.

ఈ గౌరవనీయులైన సంఘ సంస్కర్తలు సనాతన ధర్మంతో ముడిపడి ఉండరాదని విజయన్ అన్నారు. సనాతన ధర్మ సూత్రాలకు విరుద్ధమైన కుల వివక్షను వ్యతిరేకిస్తూ సమాజంలో సమానత్వాన్ని నెలకొల్పేందుకు గురు బోధనలు, చర్యలు ఉన్నాయని విజయన్ అన్నారు. ఆయన మాట్లాడుతూ.. అధికారంలో ఉన్న సనాతన ధర్మం ఉత్తర భారతదేశంలోని దళితులు, వెనుకబడిన తరగతులు, మైనార్టీలను నిరంతరం అణిచివేస్తోంది. ఆయన ప్రకటన పట్ల హర్షం వ్యక్తం చేసిన భారతీయ జనతా పార్టీ మాజీ కేంద్ర మంత్రి వి. తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ మాదిరిగానే మురళీధరన్ కూడా కేరళ ముఖ్యమంత్రి సనాతన ధర్మాన్ని అవమానించారని ఆరోపించారు.

19వ శతాబ్దపు కేరళలో కుల వ్యవస్థ చాలా కఠినంగా మరియు దోపిడీగా ఉండేది. హిందూ సమాజం వివిధ కుల సమూహాలుగా విభజించబడింది, బ్రాహ్మణ సమాజం అగ్రస్థానంలో ఉంది, అట్టడుగు కులాలు తీవ్ర వివక్షను ఎదుర్కొన్నారు. ఇజావా కమ్యూనిటీ వంటి జాతి సమూహాలకు విద్య, దేవాలయాలలో ప్రవేశం మరియు బహిరంగ ప్రదేశాలకు వెళ్ళే హక్కు నిరాకరించబడింది. ఈ ప్రజలు అత్యంత పేదరికంలో మరియు అవమానకరమైన పరిస్థితులలో జీవించారు. అటువంటి అణచివేత వాతావరణంలో శ్రీ నారాయణ్ గురు 1855లో కేరళలోని చెంపజంతి అనే చిన్న గ్రామంలో ఈఝువ కుటుంబంలో జన్మించారు. అతని తెలివితేటలు మరియు ఆధ్యాత్మిక అభిరుచులు బాల్యం నుండి అసాధారణమైనవి. అతను తన కమ్యూనిటీ ప్రజలకు నిషిద్ధమైన సంస్కృత మరియు హిందూ గ్రంధాలను అధ్యయనం చేశాడు. కుల, మతాలకు అతీతంగా మానవులందరిలో దైవత్వం సమానమని ఆయన విశ్వసించారు. కుల వివక్షను సవాల్ చేశారు.

శ్రీ నారాయణ గురు 1888లో అరువిప్పురం నది ఒడ్డున శివలింగాన్ని స్థాపించడం ద్వారా బ్రాహ్మణుల ఆధిపత్యాన్ని బహిరంగంగా సవాలు చేశారు, ఎందుకంటే ఆలయాన్ని స్థాపించే హక్కు బ్రాహ్మణులకు మాత్రమే ఉంది. ఈ క్రతువును స్వయంగా నిర్వహించడం ద్వారా ఆధ్యాత్మికత ఏ కులానికో పరిమితం కాదన్నారు. బ్రాహ్మణేతరుల ప్రతిష్ఠాపనకు వివిధ వర్గాల నుండి వ్యతిరేకత ఎదురైనప్పుడు, ఆ విగ్రహం "బ్రాహ్మణ శివుడిది కాదు, ఇజ్వా శివుడిది" అని స్పష్టం చేశాడు మరియు ఇజ్వా సమాజాన్ని అణగారిన కులంగా పేర్కొన్నాడు. దీని తరువాత అతను కేరళ అంతటా







అనేక దేవాలయాలను స్థాపించాడు, అవి ప్రార్థనా కేంద్రాలు మాత్రమే కాకుండా విద్య మరియు సామాజిక సంస్కరణల కేంద్రాలుగా మారాయి. "ఒకే కులం, ఒకే మతం, ఒకే దేవుడు" అనేది కుల విభజనలను స్పష్టంగా తిరస్కరించి, అతని ప్రసిద్ధ నినాదంగా మారింది. కుల, మతాలకు అతీతంగా మానవులందరిలో దైవత్వం సమానమని ఆయన విశ్వసించారు. కులతత్వం మరియు అంటరానితనంతో పీడిస్తున్న సమాజాన్ని కనీసం కొన్ని వర్గాలతో కూడిన ప్రగతిశీల సమాజంగా మార్చడంలో ఆయన ముఖ్యమైన పాత్ర పోషించారు. 1888లో, దేవాలయ ప్రవేశ ఉద్యమం మరియు సమానత్వ ప్రకటనకు దశాబ్దాల ముందు, అతను అణగారిన కులాల కోసం ఆలయ ప్రవేశం పొందాడు.

శ్రీ నారాయణ్ గురు విద్యను విముక్తికి సమర్ధవంతమైన సాధనంగా భావించారు. పాఠశాలలను స్థాపించి కుల వివక్షను ధిక్కరించి విద్యను అభ్యసించాలని ప్రజలను కోరారు. తద్వారా బడుగు బలహీన వర్గాలకు ఆర్థికంగా, సామాజికంగా పురోగమించే అవకాశాలను కల్పించారు. దేవాలయాల ద్వారా గ్రంథాలయాలను, గ్రంథాలయాలను స్థాపించి అందరికీ విజ్ఞానాన్ని అందించాడు. ఈ చొరవ విద్యను ప్రజాస్వామ్యీకరించింది మరియు సమాజంలో ఐక్యత మరియు సంఘం యొక్క భావాన్ని సృష్టించింది. శ్రీ నారాయణ్ గురు అంటరానితనం మరియు కుల ఆధారిత ఆంక్షలకు వ్యతిరేకంగా చురుకుగా ప్రచారం చేశారు. అణగారిన వారిలో ఆత్మగౌరవాన్ని, గౌరవాన్ని నింపాడు. ఆత్మన్యూనతా భావాన్ని పోగొట్టి, సంఘటితమై హక్కుల కోసం పోరాడేలా ప్రజలను ప్రేరేపించారు. ఆ రోజుల్లో నిషిద్ధమైన కుల వివక్షను విచ్ఛిన్నం చేయడానికి అతను కులాంతర ఆహారాన్ని సమర్థించాడు. సమాజంలో మతోన్మాద గోడలను బద్దలు కొట్టేందుకు ప్రయత్నించాడు.

శ్రీ నారాయణ్ గురు సంఘ సంస్కర్త మాత్రమే కాదు, గొప్ప తత్వవేత్త మరియు కవి కూడా. అతని రచనలు కరుణ, సమానత్వం మరియు న్యాయం వంటి సార్వత్రిక విలువలను ప్రోత్సహించాయి. "ఆత్మోపదేశ్ సతక్" (స్వీయ విద్య కోసం శంభర్ ఓవ) మరియు "దైవ దశకం" (దేవునికి పది శ్లోకాలు) వంటి అతని స్వరకల్పనలు కుల వివక్షకు వ్యతిరేకంగా అతని సందేశాన్ని వివరించాయి. అతని తత్వశాస్త్రం సమగ్రమైనది. అద్వైత వేదాంతాన్ని ఆధారం చేసుకుని అప్పటి సామాజిక, రాజకీయ పరిస్థితులకు తగిన రీతిలో అందించాడు. మానవులందరూ ఒకే సూత్రంపై ఆధారపడి ఉన్నారని, సామాజిక సంస్కరణలకు ఆధ్యాత్మిక పునాదిని సృష్టించారని ఆయన నొక్కి చెప్పారు.

శ్రీ నారాయణ్ గురు ప్రయత్నాలు కేరళ సమాజంలో మరియు వెలుపల మార్పు యొక్క విలువలను పెంపొందించాయి మరియు మత-ఆధ్యాత్మిక రూపంలో కూడా మద్దతు పొందాయి. అతని ఉద్యమం ఇజావా మరియు ఇతర బలహీన వర్గాలకు ప్రధాన స్రవంతిలో చేరడానికి విశ్వాసాన్ని ఇచ్చింది. కాలక్రమేణా, అతని ఆలోచనలు సామాజిక న్యాయం మరియు సమానత్వం కోసం ఉద్యమాలను ప్రేరేపించాయి. నారాయణ్ గురు పెరియార్ లాంటి నాస్తికుడు కాదు. ఆయన సనాతన ధర్మాన్ని పూర్తిగా తిరస్కరించలేదు, కానీ పూజలు కొందరి చేతుల్లో గుత్తాధిపత్యం కాకూడదని, అణగారిన వర్గాలకు కూడా అందుబాటులో ఉండాలనే పట్టుదలతో ఉన్నాడు. ఆధ్యాత్మికత యొక్క మార్గం మరియు అధికారం అన్ని కులాలకు ఒకేలా ఉండాలని మరియు బ్రాహ్మణ గుత్తాధిపత్యాన్ని విచ్ఛిన్నం చేయడానికి అతను ఖచ్చితంగా ప్రయత్నించాడు. వామపక్షాలు ఆయనను సంఘ సంస్కర్తగా చూస్తున్నాయి. ఈ మత సంస్కరణవాద ఉద్యమం వామపక్ష ఉద్యమాన్ని పోషించే ప్రగతిశీల నేపథ్యాన్ని అందించింది.

అణగారిన కులాల విద్య మరియు సామాజిక అభ్యున్నతి కోసం 1903లో శ్రీ నారాయణ్ ధర్మ పరిపాలన్ యోగం (ఎస్ఎన్డిపి యోగం)ని స్థాపించాడు. శతాబ్ది క్రితం శివగిరి ఆశ్రమాన్ని స్థాపించిన శ్రీ నారాయణగురు కేరళలోని అగ్రగామి సంఘ సంస్కర్తలలో ఒకరిగా పరిగణించబడతారు. కానీ శ్రీ నారాయణ్ ధర్మ పరిపాలన్ యోగం విశాల దృక్పథంతో పనిచేయకుండా కేవలం ఇజావా కుల-వర్గాల ప్రజలే ఆధిపత్యం వహించే సంస్థగా మారడం చూసి ఆయన భ్రమపడి దశాబ్దం తర్వాత ఎస్ఎన్డిపి యోగానికి దూరమయ్యారు. . గురువుచే స్థాపించబడిన మరియు అతని సమాధిని కలిగి ఉన్న శివగిరి ఇప్పుడు ఈజ్వాలకు ప్రధాన యాత్రా స్థలం. కేరళ జనాభాలో 23% ఉన్న ఈజావ సంఘం ఇతర వెనుకబడిన కులంగా వర్గీకరించబడింది. వారు కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్) నేతృత్వంలోని ఎల్‌డిఎఫ్ యొక్క సాంప్రదాయ ఓటర్లుగా పరిగణించబడ్డారు, కొన్ని ఓట్లు యు.డి.ఎఫ్కి వచ్చాయి. సమాజంలో మతపరమైన విషయాలను విశ్వసించే వారు చాలా మంది ఉన్నారు, అయితే ఆచారాలను, కులతత్వాన్ని మరియు బ్రాహ్మణ ఆధిపత్యాన్ని వ్యతిరేకిస్తారు. శ్రీ నారాయణ ధర్మ పరిపాలన్ యోగం రామ మందిర ప్రతిష్టను స్వాగతించగా, శివగిరి మఠం అధ్యక్షుడు స్వామి సచ్చితానంద అయోధ్య ప్రతిష్ఠాపన కార్యక్రమానికి దూరంగా ఉండాలని నిర్ణయించుకోవడం దీనికి ఉదాహరణ.

వివిధ సమయాల్లో, భక్తి వర్గాలు, మత సంఘ సంస్కర్తలు హిందూ ఆచారాలు, మూఢనమ్మకాలు, బ్రాహ్మణ ఆచారాలు, కులతత్వాన్ని తమదైన రీతిలో విమర్శించారు మరియు వారి స్వంత మద్దతుదారులను, భక్తులను మరియు ఆరాధనలను సృష్టించుకున్నారు. ఈ మత సంస్కర్తలందరూ సమాజాన్ని బాగుచేయడానికి వ్రాసిన మరియు చెప్పినందుకు వ్యతిరేకతను భరించవలసి వచ్చింది, ఎందుకంటే తక్షణ మత నాయకుడి కుర్చీకి షాక్ తగిలింది. అయితే మతం గురించి ఏదైనా మాట్లాడినప్పుడు వాదనలు సృష్టించి ఓట్లతో లబ్ధి పొందడమే నేడు ఆర్ఎస్ఎస్ విజయవంతమైన ఫార్ములా. ఈ పద్ధతిలో, బిజెపి మినహా మిగిలిన అన్ని పార్టీలు సనాతన్-హిందూ మరియు ముస్లిం మతం వ్యతిరేకులుగా విశ్వవ్యాప్తంగా అపఖ్యాతి పాలయ్యాయి. ఆ సమాజంలో ఆక్రమిత సంస్థలు, జయంతులు, దేవాలయాలు, పీఠాల ద్వారా మతపరమైన అభిప్రాయాలు ధ్రువీకరించబడతాయి. బ్రాహ్మణవాదం, కులతత్వం మొదలైనవాటికి వ్యతిరేకంగా గళం విప్పే కమ్యూనిస్టులను మత వ్యతిరేకులుగా, ప్రభుత్వ వ్యతిరేకులుగా, హిందూ వ్యతిరేకులుగా ప్రకటించాలని ప్రచారం జరుగుతోంది. కేరళలో మతపరమైన సంస్థలు, సంస్థలు, పూజారులను తమ వలలోకి లాగేందుకు బీజేపీ చేస్తున్న పని జోరుగా సాగుతోంది. మతాన్ని గౌరవించే సమాజంలోని ఒక వర్గం హిందూ మతం వైపు మళ్లుతోంది. చాలా మంది సంఘ సంస్కర్తలను సంఘ్ మరియు బిజెపిలు ఇలాగే హైజాక్ చేశాయి.

ఇళవ సామాజికవర్గంలో తన పునాదిని పెంచుకునేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది. బీజేపీకి ఇప్పటికే పెద్ద అగ్రవర్ణ హిందూ ఓట్లు ఉన్నాయి. ఎజావా కమ్యూనిటీ యొక్క ప్రధాన సంస్థ, శ్రీ నారాయణ ధర్మ పరిపాలన్ యోగం రాజకీయ ప్రభావాన్ని కలిగి ఉంది. పినరయి విజయన్ శ్రీ గురుని ప్రస్తావిస్తూ మత ధ్రువీకరణ కోసం సీపీఐ(ఎం)ని టార్గెట్ చేసేందుకు బీజేపీ ఉపయోగించుకుంటోంది. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో చాలా చోట్ల ఎల్‌డీఎఫ్ ఓటమి పాలవగా, వామపక్షాల కంచుకోటల్లో బీజేపీ విజయం సాధించింది. శ్రీ నారాయణ ధర్మ పరిపాలన్ యోగం అధ్యక్షుడు వెల్లపల్లి నటేశన్ కేరళలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలకు మద్దతు ఇస్తున్నారు. అయితే, ఎస్ఎన్‌డిపి రాజకీయ విభాగం జాతీయ అధ్యక్షుడిగా ఉన్న ఆయన కుమారుడు తుషార్ వేలపల్లి బిజెపికి మద్దతు ఇస్తున్నారు. ఇప్పుడు ఎస్ఎన్డిపి యోగంలో బహిరంగ బిజెపి మద్దతుదారులు రావడం సీపీఐ(ఎం)కి నష్టదాయకం.

ప్రస్తుతం బీజేపీ ఈ దీర్ఘచతురస్ర సమస్యను కనుగొంది. అగ్రవర్ణ సంస్థ నాయర్ సేవా సొసైటీతో పాటు, విజయన్ అతనిపై విమర్శలు చేయడం ప్రారంభించాడు. వాస్తవానికి, విమర్శ యొక్క పాయింట్లు ఒకే విధంగా ఉంటాయి 'సాంప్రదాయ సంప్రదాయాలను మార్చాలనే పట్టుదల ఎందుకు ఉంది? ఇతర మతాల ఆచార సంప్రదాయాన్ని ఎందుకు విమర్శించరు? ఆచారాలు మరియు సంప్రదాయాలను 'చెడు' అని పిలవడానికి వారికి ఏమి హక్కు ఉంది. అయితే ఇప్పుడు కేరళలో ఆర్ఎస్ఎస్ ప్రవేశం, ఎన్నికల వ్యూహంలో భాగంగా ఇజ్జవ వర్గాన్ని కార్నర్ చేయడంతోపాటు ఈ ప్రగతిశీల సంఘ సంస్కర్తలను నమ్ముకున్న వారిని చిన్నచూపు చూస్తున్నారు. సమాజం యొక్క రాజకీయ బరువు గురించి తెలుసుకున్న మతం ఇంకా దాని తలుపులు తెరవలేదు. వీరిలో చాలా వరకు రాజకీయ-మత వైరుధ్యం ఆర్థిక సహాయం, సౌకర్యాల ఆవశ్యకత ప్రధాన కారణం మరియు ఇది ఆందోళనకరం.



ఎడ్. సంజయ్ పాండే
9221633267
adv.sanjaypande@gmail.com

# పాఠశాలల్లో రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలి

- నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



**నారాయణపేటజిల్లా బ్యూరో, జనవరి 8 (జనంసాక్షి) :** ప్రభుత్వ పాఠశాలలో రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. బుధవారం కలెక్టర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గ్రౌండ్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు వండిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాలను చివరగా ఏ అధికారి విజిట్ చేశారని హెచ్ఎంను అడిగి తెలుసుకున్నారు. చివరగా ఎంపీడీఓ పాఠశాలను విజిట్ చేసినట్లు తెలుసుకున్న కలెక్టర్ విజిటర్ రిజిస్టర్ ను చూశారు. కానీ అందులో ఎంపీడీఓ విజిట్ చేసినట్లు సంతకం లేకపోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎవరైనా జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు పాఠశాల విజిట్ కు వస్తే వారితో రిజిస్టర్ లో సంతకాలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఫుడ్ టేస్ట్ రిజిస్టర్, అకాడమిక్ గైడెన్స్ రిజిస్టర్, స్టూడెంట్ ఫుడ్ కమిటీ రిజిస్టర్, స్టాక్ రిజిష్టర్లను సక్రమంగా నిర్వహించాలన్నారు. పాఠశాలలో మధ్యాహ్నం భోజనం టేస్ట్ చేసిన తర్వాత భోజనం ఎలా ఉందో రిమార్క్ ను రిజిస్టర్ లో రాయాలన్నారు. గుడ్, యావరేజ్, నార్మల్ ఇలా మూడు రకాల అభిప్రాయా లను తప్పనిసరిగా రాస్తేనే మరుసటి రోజు ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్త చర్యలు తీసుకుంటా రని చెప్పారు. మెనూ పట్టికను చూశారు. 6వ తరగతి గదిలోకి వెళ్ళిన కలెక్టర్ విద్యార్థులు కిందకూర్చోవడం చూసి విద్యార్థులకు సరిపడా బెంచీలు లేవా అని ప్రశ్నించా రు. ఒక్కో తరగతిలో ఎక్కువ సంఖ్యలో ఉన్నారని, తెలుగు, ఇంగ్లీష్ తరగతులను కంబైడ్‌గా నిర్వహించడం వల్ల బెంచీలు సరిపోవడం లేదని హెచ్ఎం తెలిపారు. అయితే ఎంతమంది విద్యార్థులు హాజరయ్యారు. ఎంత మంది గైర్హాజరు అయ్యారో బోర్డు మీద రాయాలని ఉపాధ్యాయులకు సూచించా రు. పాఠశాలపై అంతస్తు లో గల ఓపెన్ హాల్‌కు ఎందుకు తాళం వేశారని అడిగారు. ఓపెన్ హాల్ నిర్మా ణం చేపట్టిన కాంట్రాక్టర్ తనకు బిల్లు చెల్లించలేదని హాల్ కు తాళం వేసుకుని వెళ్లారని డీఈఓ గోవిందరా జులు కలెక్టర్ కు తెలిపారు. నిర్మాణం పూర్తయిన తర్వాత బిల్లు ఇచ్చినా ఇవ్వక పోయినా తాళం వేసుకుని వెళ్లరాదని, వెంటనే హాల్‌ను తెరిపించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకు రావాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం పాఠశాలలో బియ్యం బస్తాలను కలెక్టర్ పరిశీలించారు. బియ్యం, వంటకు వినియోగించే సరకులను నిల్వ ఉంచే గది ఎల్లప్పుడూ శుభ్రంగా ఉండేటట్లు చూడాలన్నారు. అలాగే రాగి జావ సామాగ్రిని కూడా ఆమె చూశారు. స్టాక్ నిల్వ ఉంచే గదిలో సెల్ఫ్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గత నెల బియ్యం స్టాక్ ఎప్పుడూ వచ్చిందని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంటగది లోకి వెళ్ళిన కలెక్టర్ అక్కడ విద్యార్థులకు వండు తున్న అన్నం, పప్పు ను చూసి మెనూ ప్రకారం పప్పుతో పాటు కర్రీ కూడా వండాలని ఎందుకు వండలేదని ఏజెన్సీ యువకులను నిలదీశారు. మెనూ ప్రకారమే బిల్లులు తీసుకుంటున్నారని అలాంటప్పుడు మెనూ ప్రకారమే పెట్టాలని తేల్చి చెప్పారు. తమకు గత ఆరు నెలలుగా బిల్లులు రాలేదని వంట ఏజెన్సీ నిర్వా హకులు కలెక్టర్‌కి తెలపడంతో సంతృప్తి చెందని ఆమె ఎన్ని సంవత్సరాలుగా ఏజెన్సీ నడుపుతున్నారని కలెక్టర్ ప్రశ్నించగా 20 సంవ త్సరాల నుంచి నడుపుతు న్నట్లు ఏజెన్సీ నిర్వాహకు రాలు చెప్పడంతో 6 నెలల బిల్లులు రాకపోతే మెనూ ప్రకారం భోజనం పెట్టరా..? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మెనూ పాటించని ఏజెన్సీ నిర్వాహకురాలికి మెమో జారీ చేయాలని డీఈఓను ఆదేశించారు. మొత్తం పాఠశాల విజిట్లకు సంబంధించిన అన్ని రకాల రిజిస్టర్లను పరి శీలించి, పూర్తిస్థాయిలో రిపోర్ట్ తనకు ఇవ్వాలని డీఈఓను ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక తహసిల్దార్ అమ రేంద్ర కృష్ణ, మున్సిపల్ కమిషనర్ సునీత, పాఠశాలల మధ్యాహ్న భోజన నిర్వహణ సమన్వయకర్త యాదయ్య శెట్టి పాల్గొన్నారు.

## చెరువులను ఆక్రమిస్తే చూస్తూ ఊరుకునేది లేదు



- బఫర్‌జోన్‌లో అక్రమ వ్యాపారాలు వెలుగుచూశాయి
- హైడ్రా కమిషనర్ రంగనాథ్

**అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 8 (జనంసాక్షి) :** పెద్ద అంబర్పేట్ పరిధిలోని కుంట్లూరు రాయన్ చెరువులో బఫర్ జోన్ ను ఆక్రమించి చాపల పెంపకం పై వచ్చిన ఫిర్యాదుల మేరకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ నేతృత్వంలో ఇరిగేషన్ డిపార్ట్మెంట్ అధికారులు బుధవారం పరిశీలన నిర్వహించారు. చెరువు పరిసర బఫర్ జోన్‌లో కొన్ని వ్యాపార కార్యకలాపాలు జరుగుతున్నట్టు నివేదికలు అందాయి. ఈ సందర్భంగా చెరువు దట్ట ప్రాంతాలను, నీటిమట్టాన్ని, పక్కన ఉన్న నిర్మాణాలను కమిషనర్ పరిశీలించారు. బఫర్ జోన్‌లో జరుగు అక్రమ నిర్మాణాలు మరియు చెరువు నీటి మట్టానికి హాని కలిగే కార్యకలాపాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రంగనాథ్ మాట్లాడుతూ, "చెరువులు మరియు వాటి పరిసర ప్రాంతాలు పట్టణ పరిరక్షణలో కీలక భాగంగా ఉన్నాయి. బఫర్ జోన్‌లో జరుగుతున్న అక్రమ వ్యాపారాలు తక్షణమే ఆపాలి. చెరువుల పరిరక్షణ కోసం ప్రజలు, అధికారులు కలిసికట్టుగా పనిచేయాలి," అని తెలిపారు. ఈ విచారణ అనంతరం, బఫర్‌జోన్ ఉల్లంఘనలపై పూర్తి నివేదికను సిద్ధం చేసి సంబంధిత శాఖలకు అందజేయనున్నట్లు తెలిపారు. రాయన్ చెరువు సమస్యలపై ఈ పరిశీలన తర్వాత మరింత కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని స్థానికులు భావిస్తున్నారు.

## మత్స్యకారులకు నష్టం వాటిల్లితే సహించేది లేదు

### జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షుడు వాకిటి ఆంజనేయులు

**అచ్చంపేట, జనవరి 8 (జనంసాక్షి) :** నియోజకవర్గ పరిధిలోని. బల్మూరు మండలం చెన్నారం గ్రామంలోని నల్లచెరువు తూమును తొలగించడంతోపాటు, అలుగును ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చెరువులలో నీటిని తొలగించి మృత్యుకారుల జీవితాలతో చెలగాటమాడితే సహించేది లేదని జిల్లా వృత్తికార సంఘం అధ్యక్షుడు వాకిటి ఆంజనేయులు హెచ్చరించారు అనంతరం చెన్నారం గ్రామంలోని నల్లచెరువును జిల్లా మత్స్యకార సంఘం డైరెక్టర్లతో కలిసి ఆంజనేయులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం మత్స్య సంపద పై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులకు నష్టం కలిగించే విధంగా వ్యవహరించడం సరైనది కాదని, అలాంటి వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా మత్స్య కార సంఘం డైరెక్టర్ వెంకటయ్య, ముదిరాజ్ సంఘం తాలూకా కోశాధికారి పాపయ్య, తుమ్మేన్ పేట మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు వెంకటయ్య ,లింగం ,సత్యనారాయణ ,దశరథం ,నిజంజన్ ,పరమేష్ ,నారాయణ, శివరాం, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యమివ్వాలి

- షాబాద్ సీఐ కాంతా రెడ్డి, చేవెళ్ల ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి



**చేవెళ్ల, జనవరి 8 (జనంసాక్షి) :** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని షాబాద్ సీఐ కాంతా రెడ్డి, ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డిలు అన్నారు. స్వామి వివేకానంద 162వ జయంతి ఉత్సవాలలో భాగంగా చేవెళ్ల మండల కేంద్రంలోని స్థానిక వివేకానంద కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ చీరుమని జైపాల్ రెడ్డి, డైరెక్టర్ ఇంద్రసేనారెడ్డిల ఆధ్వర్యంలో విద్యార్థులకు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ క్రీడా పోటీలను సిఐ కాంతారెడ్డి, ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి సిఐ కాంతారెడ్డి, చేవెళ్ల ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డిలు మాట్లాడుతూ...క్రీడలు మానసికోల్లాసానికి, శరీరదారుఢ్యానికి దోహదపడతాయన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యమివ్వాలని, రాష్ట్రస్థాయి, జాతీయ పోటీల్లోనూ రాణించాలని తెలిపారు. క్రమశిక్షణతో చదువుకుంటే విద్యార్థులు నిర్దేశించుకున్న లక్ష్యాలను సులువుగా ఛేదించవచ్చన్నారు. విద్యార్థులు గెలుపోటములను సమానంగా తీసుకొని ఒకరి పట్ల ఒకరు స్నేహ భావం కలిగి ఉండాలాన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ చిరుమని జైపాల్ రెడ్డి మాట్లాడుతూ...క్రీడా పోటీలు నాలుగు రోజుల పాటు నిర్వహించడం జరుగుతుందని విద్యార్థులంతా ఉత్సాహంగా పాల్గొనాలన్నారు. క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు స్వామి వివేకానంద జయంతి రోజున బహుమతులు ప్రధానం చేయడం జరుగుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

## చైనా మాంజా విక్రయించిన, వినియోగించిన చర్యలు

- జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్

**నారాయణపేట జిల్లా ప్రతినిధి, జనవరి 8 (జనంసాక్షి) :** నారాయణపేట జిల్లా పరిధిలో చైనా మాంజ పై నిషేధం విధించడం జరిగిందని, జిల్లా లో ఎవరైనా చైనా మంజా అమ్మిన, వాడినా దాని వలన ఎవరికైనా ప్రమాదం జరిగిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఒక ప్రకటనతో హెచ్చరించారు. రాబోయే సంక్రాంతి పండగ సందర్భంగా చైనా మాంజ ఎక్కువగా విక్రయించే దుకా ణాల పై అధికారులు తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. నైలాన్, సింథటిక్ దారాలతో తయారు చేసే ఈ చైనా మాంజాలతో పర్యవరణానికి విపత్తుగా మారడంతో పాటు చైనా మాంజ వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అన్నారు. చైనా మాంజా విక్రయాలు, వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని అన్నారు. చైనా మాంజను ఉపయో గించి గాలి పటాలు ఎగుర వేసే క్రమంలో ఎన్నో పక్షులు, సాధారణ ప్రజలు కూడా ప్రమాదానికి గురవుతారన్నారు. అదే క్రమంలో గాలిపటాలు ఎగురవేసే వ్యక్తులు కూడ ప్రమాదానికి గురైన సందర్భాలు అనేకం ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో చైనా మంజా నిషేదించాం అని ఎస్పి తెలి పారు. చైనా మాంజాపై రాష్ట్ర ప్రభుత్వం నిషేధంవిధించింది. పర్యావరణ పరిరక్షణ చట్టం 1986 ప్రకారం అమ్మినా, కొనుగోలు చేసినా నేరమే అన్నారు. చైనా మాంజాను అమ్మితే ఏడేళ్ల జైలు, రూ.10 వేల జరిమానా వుంటుంది అని తెలిపారు. జిల్లా పరిధి లో అన్ని ప్రాంతాల్లో చైనా మాంజా విక్రయాలు జరగకుండా తగు చర్యలు తీసుకొ వడం జరుగుతొందని తెలిపారు. ప్రధానంగా ప్రజలు సైతం చైనా మాంజా వినియో గించకుండా ఎవరికి హాని కలగని సాధారణ దారంతో గాలిపటాలను ఎగురవే సుకోవాలని సూచించారు. అలాగే ఎవరైనా చైనా మాంజా విక్రయిస్తున్న, వినియోగిస్తున్న డయల్ 100 నంబర్‌కు ఫోన్ చేసి సమా చారం ఇవ్వాలనీ జిల్లా ఎస్పీ ప్రజలకు సూచించారు.

## మెరుగైన వైద్య సేవలకు సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించాలి

- గద్వాల జిల్లా కలెక్టర్ సంతోష్



**గద్వాల నడిగడ్డ, జనవరి 8 (జనంసాక్షి) :** ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అధికారులు, సిబ్బంది తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ ఆదేశించారు. బుధవారం అయిజ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జనరల్ వార్డ్, ఫార్మసీ, ల్యాబ్ వంటి విభాగాలను తనిఖీ చేసి, ఆసుపత్రి సేవలు, ప్రసవాల సంఖ్య, సీజనల్ వ్యాధుల నియంత్రణ, రిఫరల్ రిజిస్టర్, ప్రతిరోజు నమోదవుతున్న ఔట్‌పేషెంట్ల వివరాలు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్ర సిబ్బందితో సమావేశమై రోగులకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. ఆసుపత్రి వసతులు, వైద్య పరికరాలను సక్రమంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. గర్భిణీ స్త్రీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. రక్తపరీక్షలు, మూత్ర పరీక్షలు, ఇతర పరీక్షలను వేగంగా పూర్తి చేసి తక్షణ రోగనిర్ణయం చేయాలని ఆదేశించారు. ఎమర్జెన్సీ పరిస్థితుల్లో అవసరమైతే గద్వాల జిల్లా ఆసుపత్రికి రిఫరల్ అందించాలని తెలిపారు. ఆసుపత్రిలో నీటి సమస్యతో పాటు చిన్న చిన్న పనులన్ని కూడా వెంటనే పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని అదనపు 30 పడకల వార్డు నిర్మాణ పనులను పరిశీలించి, పెండింగ్ పనులపై అధికారుల నుంచి పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఐజా నుంచి అలంపూర్ చౌరస్తా రహదారి పరిస్థితిని పరిశీలించారు. రహదారి మరమ్మతులు వెంటనే చేపట్టాలని, పెండింగ్‌లో ఉన్న పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కాంట్రాక్టర్లతో సమన్వయం చేసుకుని, పనులను పూర్తి చేసేలా పరిశీలన నిర్వహించాలని ఆర్ అండ్ బి అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగ రావు, డి.ఎం.హెచ్.ఓ సిద్దప్ప, డాక్టర్ విష్ణు, టి.ఎస్.ఎం.ఐ.డి.సి ఈ.ఈ జైపాల్ రెడ్డి, రహీముద్దీన్, ఆర్ అండ్ బీ ఈఈ ప్రగతి, కిరణ్ కుమార్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతు వేదికను సందర్శించిన రాజస్థాన్ రాష్ట్ర వ్యవసాయ సెక్రటరీ



**శామీర్‌పేట్, జనవరి 8 (జనంసాక్షి) :** అలియాబాద్ రైతువేదికని బుధవారం రోజు రాజస్థాన్ రాష్ట్ర వ్యవసాయ సెక్రటరీ రాజన్ విశాల్ ఐఏఎస్ సందర్శించారు. తెలంగాణలోని రైతు వేదికల పనితీరు తెలుసుకోవటానికి వచ్చారు. అందులో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ పని తీరుని చూసి సెక్రటరీ రాజన్ విశాల్ సంతృప్తి చెందారు. అన్ని స్కీమ్ ల విషయాల గురుంచి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవ సాయ కమీషనర్ ఆఫీస్ నుండి డిడిఏ సింగారెడ్డి, ఏడిఏ వినోద్ కుమార్, మేడ్చల్ ఏడిఏ వెంక ట్రామ్ రెడ్డి, మండల వ్యవసాయధికారి రమేష్, ఏఈఓలు రవి కుమార్, సుధీర్ కుమార్ పాల్గొన్నారు.

## సికింద్రాబాద్ నుండి చర్లపల్లి రైల్వే టెర్మినల్‌కు 10 నిమిషాలకు ఒక బస్సు



**బోడుప్పల్, జనవరి 8 (జనంసాక్షి) :** సికింద్రాబాద్ నుండి చర్లపల్లి రైల్వే టెర్మినల్ వరకు ప్రతి 10 నిమిషాలకు ఒక బస్సు నడుపుతున్నట్లు ఆర్టీసీ చెంగిచెర్ల డిపో మేనేజర్‌కే కవిత తెలిపారు. ఆర్టీసీ చెంగిచెర్ల డిపోలో బుధవారం ఆమె మాట్లాడుతు నూతనంగా చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారంభం అయినందున రైల్వే ప్రయాణికులకు రవాణా సౌకర్యం కల్పించేందుకు ప్రతి నిత్యం 10 నిమిషాలకు ఒక్క బస్సు నడుపుతున్నామన్నారు. రూట్ నెంబర్ 250సీ సికింద్రాబాద్ బ్లూసీ పాయింట్ నుండి ఉదయం 4.30 గంటల నుండి రాత్రి 10.30 గంటల వరకు వయా హబ్సిగూడ, నాచారం, మల్లాపూర్, హెచ్ పీసీఎల్ మీదుగా ప్లాట్ ఫాం నెంబర్ 1 చర్లపల్లి రైల్వే టెర్మినల్‌కు అక్కడి నుండి సికింద్రాబాద్‌కు బస్సు సౌకర్యం ఉందని చెప్పారు. చర్లపల్లి రైల్వే టెర్మినల్ నుండి చెంగిచెర్ల, ఉప్పల్, రామంతాపూర్ మీదుగా బోరబండకు ప్రతిరోజు 40 నిమిషాలకు ఒక్క బస్సు కొత్తగా ప్రారంభించినట్లు చెప్పారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా అదనంగా నడిపే ప్రత్యేక రైళ్లలో ప్రయాణించే ప్రయాణికుల రవాణా సౌకర్యార్థం ప్రతిరోజు ఉదయం, సాయంత్రం, రాత్రివేళలో ఉప్పల్ నుండి ప్లాట్‌ఫాం నెంబర్ 9 చర్లపల్లి రైల్వే టెర్మినల్‌కు అదనంగా బస్సులు నడుపుతున్నట్లు చెప్పారు. ఈ సౌకర్యాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని ఆమె కోరారు.

## 400 కేవీ ఏఈ పేరుతో పైసల్ వసూల్

- రూ. 250లకే మీటర్ ఇస్తా

**శివ్వంపేట, జనవరి 8 (జనంసాక్షి) :** గోదూరి సురేష్ శివ్వంపేట మండల పరిధిలోని పిల్లుట్ల, కొత్తపేట, రత్నాపూర్, లింగోజిగూడ గ్రామాలకు సంవత్సరం కాలంగా విద్యుత్ శాఖ లో లైన్ మెన్ గా విధులు నిర్వహిస్తున్నాడు. అయితే ఈ నెల 5 న గోదూరి సురేష్ మండల పరిధిలోని రత్నాపూర్ గ్రామంలో విధులు నిర్వహిస్తుండగా సురేష్ కు గుర్తు తెలియని వ్యక్తి 9347756241 గల నంబర్ నుంచి ఫోన్ చేసి నేను 400 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ ఏఈ నీ మాట్లాడుతున్నా ప్రజలు విత్తవుట్ మీటర్ డోమెస్టిక్ సప్లై వాడుతున్నారు. మీరు ఏం చేస్తున్నారు, నిన్ను సస్పెండ్ చేస్తా అని బెదిరించాడని తెలిపాడు. అయితే లైన్మెన్ సురేష్ అది ఫేక్ కాల్ అని దాని గురించి పట్టించుకోలేదు. తర్వాత ఈనెల 8న లింగోజిగూడ గ్రామపంచాయతీ వద్ద దాసరి బిక్షపతి గ్రామపంచాయతీ వర్కర్ ఒక గుర్తు తెలియని వ్యక్తి వారి వద్దకు వచ్చి తాను కరెంటు ఏఈనని నేను 250 రూపాయలకే ఒక కరెంటు మీటర్ను మీ గ్రామంలో మీటర్లు లేని వారందరికీ ఇస్తానని చెప్పడం జరిగిందన్నారు. అంతేకాదు నాకు ఫోన్ చేసి బెదిరించిన వ్యక్తి, మీటర్లు విక్రయిస్తానని చెప్పిన వ్యక్తి ఇద్దరు ఒకరేనని నాకు తెలిసిందన్నారు. వెంటనే నేను అక్కడికి వెళ్లి చూడగా అతను ఏఈనని అందర్నీ నమ్మిస్తూ, 250 రూపాయలకే మీటరు ఇస్తానని ప్రజలను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నాడు. కాబట్టి దీనిపై విచారణ జరిపి చట్టఫ్రారంగా చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్సై మధుకర్ రెడ్డికి లైన్మెన్ సురేష్ బుధవారం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

## నల్లమల్లలో గెజిటెడ్ ఉద్యోగానికి ఎంపిక

**అచ్చంపేట, జనవరి 8 (జనంసాక్షి) :** నియోజకవర్గ పరిధిలోని అమ్రాబాద్ మండలం మన్ననూర్ గ్రామనికి చెందిన దూమర్ల లక్ష్మణ్, కానిస్టేబుల్ అన్న సతీమణి సంధ్యారాణి తెలంగాణ జెన్ కో కెమిస్ట్ గా గెజిటెడ్ ఉద్యోగానికి ఎంపికై నియామకపత్రాన్ని, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకోవడం జరిగింది. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క ఉపముఖ్యమంత్రికి స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

- పల్లె నుంచి ప్రపంచ స్థాయికి ఎదగాలి
- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి





**తాండూరు, జనవరి 8 (జనంసాక్షి) :** విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం తాండూరు పట్టణంలోని గౌతమి మోడల్ స్కూల్ గ్రౌండ్స్‌లో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి 2025 టోర్నమెంట్ కు ముఖ్యఅతిథిగా పాల్గొని, టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న విద్యార్థుల ప్రతిభను గుర్తించాలనే ముఖ్య ఉద్దేశంతో నియోజకవర్గ పరిధిలో ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విద్యార్థులను ఒకే వేదికపై తీసుకొచ్చి ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి 2025 ను నిర్వహించడం జరిగిందన్నారు .నియోజకవర్గ పరిధిలో 50 పాఠశాల నుంచి 191 టీంలలో 2,100 మంది విద్యార్థులు పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా కల్గిన దేశాలలో భారత్ ముందు వరుసలో ఉంటే అందులో ప్రముఖ రాష్ట్రాల్లో తెలంగాణ ఒక్కటి అన్నారు. నేటి విద్యార్థుల భవిష్యత్తుతోనే రాష్ట్ర సంపద దాగి ఉందని, విద్యార్థులకు ఖర్చు చేసే ప్రతి పైసా రేపటి తరానికి పెట్టుబడి లాంటిదని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చాలా వేదికలపై ప్రస్తావించారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఐటీ, ఫార్మా, రియల్ ఎస్టేట్, కృత్రిమ మేధస్సు బయె టెక్నాలజీ ఇలా ఏ రంగమైన రోజురోజుకు అభివృద్ధిలో ముందు వరుసలో ఉంటే, పదేళ్ల తెలంగాణ రాష్ట్రంలో క్రీడా రంగం పూర్తిగా నిర్వీరామంగా తయారైందన్నారు. నేను ఎమ్మెల్యేగా గెల్చిన తర్వాత కూడా గ్రామాలలో పర్యటిస్తున్నపుడు చాలా మంది విద్యార్థులు క్రీడల్లో విశేషమైన ప్రతిభా కనబరిచే నైపుణ్యం ఉన్న వారికి సరైన ప్రోత్సహం లేదని చాలా సందర్భాల్లో గమనించానని తెలిపారు. పల్లె నుంచి ప్రపంచ స్థాయికి అనే నినాదంతో గత మాసంలో సీయం కప్ దిగ్విజయంగా మనం నిర్వహించుకున్నాం. అదే స్ఫూర్తితో అదే ఉత్సాహంతో మన తాండూరులోని మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించాలనే, ముఖ్య ఉద్దేశంతో కొంత మంది క్రీడా అభిమానులు, వ్యాయామ ఉపాధ్యాయుల సూచనలతో నియోజకవర్గ స్థాయి ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి కప్ 2025 నిర్వహించాలని నిర్ణయించడం జరిగిందన్నారు. ఇందులో కూడా మన సాంప్రదాయ క్రీడాలు అయిన కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్‌కు మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. ఈ టోర్నమెంట్ ద్వారా ఆటలు ఆడటం మాత్రమే కాదు విద్యార్థుల్లో కొత్త కొత్త పరిచయాలు ఏర్పడి స్నేహ భావం పెరుగుతుందన్నారు. ఆటల్లో గెలుపు, ఓటమి అనేది సర్వసాధారణం, క్రీడాకారులు లక్ష్య సాధనకు చేసే ప్రయత్నమే ముఖ్యమైనదన్నారు. క్రీడలు ఆడటం వల్ల విద్యార్థులకు భౌతిక ప్రయోజనాలతో పాటు, సంతోషకరమైన మరియు ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపడంలో క్రీడాలు దోహదపడుతాయి. ఈ పోటీల ద్వారా విద్యార్థులు కేవలం క్రీడా స్ఫూర్తి మాత్రమే కాదు నాయకత్వ లక్షణాలు, సమయపాలన, పట్టుదల పెంపొందించడానికి అవసరమవుతాయి. అనంతరం వివిధ పాఠశాల నుంచి వచ్చిన క్రీడాకారులతో పరిచయం చేసుకొని టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
09 జనవరి 2025

# పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

**• నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్**




**నారాయణపేట జిల్లా బ్యూరో, జనవరి 8 (జనంసాక్షి) :** పదవ తరగతి పరీక్షా ఫలితాలలో జిల్లాలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. గతేడాది పది లో సాధించిన ఉత్తీర్ణత కంటే ఈ సారి మెరుగు పడాలన్నారు. గతేడాది ఉత్తీర్ణత శాతం పెంచడానికి నిర్వహించిన ప్రత్యేక తరగతులు, విధానాలను అమలు చేసి పదిలో వంద శాతం ఫలితాలు రాబట్టాలని కలెక్టర్ ఆదేశించారు. బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లాలోని కాంప్లెక్స్ హెచ్ఎంలతో పదో తరగతి ఉత్తీర్ణత శాతం పెంపు పై ఏర్పాటు చేసిన సమావేశానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాఠశాలల వారీగా ఎస్. ఏ -1 ఫలితాలపై సమీక్షించారు. ఎస్ ఏ-1 ఫలితాలు ఆశాజనకంగా లేవని, ఇంకా మెరుగు పడాలని ఆయా పాఠశాలల హెచ్ఎంలకు సూచించారు. గతేడాది వంద శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలో అవలంభించిన విధి విధానాల గురించి చర్చించారు. ఈ సారి ముందస్తుగా తగిన ప్రణాళిక రూపొందించుకుని ఫలితాలలో జిల్లా రాంక్యును గతేడాది కంటే మెరుగైన స్థానంలో నిలిచేలా విద్యాధికారులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆమె కోరారు. ముఖ్యంగా వెనక బడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు సబ్జెక్టుల వారీగా వ్యక్తిగత శ్రద్ధ చూపి వారిని ఆయా సబ్జెక్టులలో మంచి మార్కులు సాధించేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలలు, కేజీబీవీ లు,గురుకులాల్లో క్యాటగిరి వారీగా విద్యార్థుల జాబితాను రూపొందించి సీ గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి వెనుక బడిన సబ్జెక్టులలో ముందు ఉండేలా మెలకువలు నేర్పించాలని సూచించారు.పక్షం రోజుల తర్వాత మళ్ళీ సమీక్ష చేద్దామని, అంతలోపు విద్యార్థుల విద్యా నైపుణ్య సామర్థ్యాల పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ గరీమా నరుల, డీఈఓ గోవింద రాజులు, సెక్టరియల్ అధికారులు పాల్గొన్నారు.

# తూప్రాన్‌లో కీర్తన గోల్డ్ రావడం అదృష్టం



**తూప్రాన్, జనవరి 8 (జనంసాక్షి) :** వ్యాపారాత్మకంగా అభివృద్ధి చెందుతున్న తూప్రాన్ పట్టణానికి కీర్తన గోల్డ్ లోన్స్ రావడం ఈ ప్రాంత ప్రజలకు మరింత ఉపయోగపడుతుందని తూప్రాన్ మున్సిపల్ వైస్ చైర్మన్ నంద్యాల శ్రీనివాస్ తెలిపారు. తూప్రాన్ లోని పోలీస్ స్టేషన్ ఎదురుగా కీర్తన గోల్డ్ లోన్స్ వ్యాపారి కేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. బంగారంపై తక్కువ వడ్డీ రేటుతో ఎక్కువ డబ్బులు ఇస్తుందని ప్రజలకు తక్కువ వడ్డీ రేటుతో రుణాలు ఇవ్వాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా కీర్తన గోల్డ్ లోన్స్ ఉపాధ్యక్షులు కోటేశ్వరరావు మాట్లాడుతూ.. దేశంలో తెలంగాణ ఆంధ్ర రాష్ట్రాలలో 600 గోల్డ్ లోన్ కేంద్రాలను ప్రారంభించామని తెలిపారు. విజయవాడ కేంద్రంగా కీర్తన గోల్డ్ లోన్ స్థాపించి విస్తరిస్తూ తెలంగాణ ఆంధ్రా లో 500 బ్రాంచీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గజ్వేల్ మేడ్చల్ తూప్రాన్ రామాయంపేట చేగుంట కామారెడ్డి మొదట ప్రాంతాలలో అందరికీ అందుబాటులో ఉండడానికి కీర్తన గోల్డ్ లోన్స్ బ్రాంచ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తులం 22 క్యారెట్ల బంగారానికి 56 వేల నుండి 60 వేల వరకు ఇస్తామని కేవలం 75 పైసల రెడ్డితో రుణాలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పల్లెర్ల రవీందర్ గుప్తా రాజు, కీర్తన గోల్డ్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ రామకృష్ణ, క్లస్టర్ మేనేజర్ భాస్కర్ బ్రాంచ్ మేనేజర్ ఐలేంధర్ గౌడ్, ఆపరేషన్ మేనేజర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్న డిప్యూటీ సీఎం

**• నేడు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వనపర్తికి రాక**



**వనపర్తి బ్యూరో, జనవరి 8 (జనంసాక్షి) :** జనవరి 9న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వనపర్తి జిల్లా పర్యటన విజయవంతం చేసేందుకు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని జిల్లా కలక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి జిల్లా పర్యటన సందర్భంగా ఉదయం 9.30 గంటలకు రేవల్లి మండలం తల్పనూర్ గ్రామంలో 33/11 కే.వి సబ్ స్టేషన్ ను ప్రారంభిస్తారు. అనంతరం గోపాలపేట మండలంలో ఎదుట్ల గ్రామంలో 33/11 కే.వి సబ్ స్టేషన్ ను ప్రారంభోత్సవం చేస్తారు. అనంతరం వనపర్తి పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం పక్కన ఉన్న విద్యుత్ శాఖ కార్యాలయం ఆవరణలో వనపర్తి మండలానికి చెందిన ఖాసింనగర్, చిమన్ గుంటపల్లి, మెట్టుపల్లి, నాగవరం గ్రామాలకు చెందిన( 4 ) 33/11 కే.వి., పెద్దమందడి మండలానికి చెందిన పామిరెడ్డి పల్లి గ్రామ 33/11 కే.వి., గోపాల్ పేట మండలం, చెన్నూరు గ్రామానికి సంబంధించిన 33/11 కే.వి., శ్రీరంగాపూర్ మండలం నాగరాల గ్రామానికి చెందిన 33/11 కే.వి మొత్తం 7 విద్యుత్ సబ్ స్టేషన్లకు శంఖుస్థాపన చేస్తారని తెలిపారు. మధ్యాహ్నం కలక్టరేట్ లో అధికారుల సమావేశం ఉన్నందున ఇట్టి కార్యక్రమాలకు ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని అధికారులను ఆదేశించారు. ఉప ముఖ్యమంత్రి పర్యటనను పురస్కరించుకొని బుధవారం కలక్టర్ వనపర్తి విద్యుత్ శాఖ కార్యాలయం, గోపాల్పేట మండలం ఎదుట్లా సబ్ స్టేషన్ ను సందర్శించి ఏర్పాట్ల పై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆర్డీఓ సుబ్రమణ్యం, విద్యుత్ శాఖ డి.ఈ శ్రీనివాస్, తహశీల్దార్లు రమేష్ రెడ్డి, గోపాల్ పేట తహసిల్దార్ తిలక్ కుమార్ రెడ్డి, గోపాల్ పేట ఎస్.ఐ. ఇతర అధికారులు కలక్టర్ వెంట ఉన్నారు.

## ప్రభుత్వ గురుకులాల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులు చేసుకోవాలి

**• రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి**




**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, జనవరి 8 (జనంసాక్షి) :** ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్న ప్రభుత్వ గురుకులాల్లో ప్రవేశాల కోసం విద్యార్థినీ విద్యార్థులు ఆన్లైన్ లో దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ సి. నారాయణ రెడ్డి సూచించారు. 2025-26 విద్యా సంవత్సరంలో వివిధ గురుకులాల్లో ఆంగ్ల మాధ్యమంలో ప్రవేశాల కోసం ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరి 23న కామన్ ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహించనుందని బుదవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురుకులాల్లో విద్యను అభ్యసించదల్చిన బాలబాలికలు https://tgcet.cgg.gov.in ద్వారా ఆన్లైన్‌లో ఫిబ్రవరి 01వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. దరఖాస్తు చేసుకునేందుకు కుల ధ్రువీకరణ పత్రం నెంబరు, ఆదాయ ధ్రువీకరణ పత్రం నెంబరు, ఆధార్ కార్డు నెంబరు, బర్త్ సర్టిఫికెట్, ఫోటో అవసరమని తెలిపారు. పై ధ్రువీకరణ పత్రాల సత్వర జారీ కోసం కలెక్టరేట్లో సహాయ కేంద్రం ఏర్పాటు చేశామని, ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఈ కేంద్రం తెరిచి ఉంటుందని అన్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఎస్సీ, ఎస్టీ, బీసీ, సాధారణ గురుకులాల్లో ప్రవేశాల కోసం ఆసక్తి గల విద్యార్థులు ఆన్లైన్ ద్వారా గడువులోపు దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ సి. నారాయణ రెడ్డి సూచించారు. ఈ అవకాశాన్ని విద్యార్థిని, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

## క్షయ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

**• ముప్పారంలో జాతీయ బృందం పర్యటన**



**అల్లాదుర్గం, జనవరి 8 (జనంసాక్షి) :** క్షయ రహిత సమాజాన్ని నిర్మించడానికి ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని జాతీయ బృందం వైద్యులు అన్నారు. నిరూప్ నిక్షయ్ 100 రోజుల కార్యక్రమాన్ని బుధవారం అల్లాదుర్గం మండలంలోని మప్పారం గ్రామంలో జాతీయ టిబి వైద్య బృందం పర్యటించి క్షయవ్యాధి పై అవగాహనను పరిశీలించారు. క్షయ వ్యాధి రహిత సమాజాన్ని నిర్మించడానికి ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని వైద్యులు అన్నారు. ఈ సందర్భంగా మొబైల్ అంబులెన్స్ వద్ద తెమడ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిబి వైద్యులు డా.రాజేశ్వరి, జిల్లా టిబి వైద్యులు డా.నవీన్ . మండల వైద్యాధికారి డా.సారిక , కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సుదర్శన్ , ఏ.ఎన్ఎం.లు సుకలత, నిర్మల తదితరులు పాల్గొన్నారు

## జాబ్ మేళాతో దివ్యాంగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

**• మేళాను ప్రారంభించిన కలెక్టర్ వల్లూరి క్రాంతి**



**సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 8 (జనంసాక్షి) :** జిల్లాలోని అర్హులైన దివ్యాంగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంగా ప్రవేట్ సెక్టార్ చొరవ చూపడం ఎంతో హర్షనీయమని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. బుధవారం జిల్లా ఉపాధి కల్పన, మహిళా సంక్షేమ, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సంయుక్తంగా ఏర్పాటు చేసిన.. "జాబ్ మేళాను" జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా పాలనాధికారి మాట్లాడుతూ.. దివ్యాంగులు సైతం సాధారణ పౌరుల వలె జీవితాన్ని కొనసాగించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లను చేస్తోందని, దివ్యాంగులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా వృద్ధి సాధించాలని కోరారు. వివిధ రకాలకు చెందిన 32 కంపెనీలు 200 మేర దివ్యాంగులకు ఉద్యోగ, ఉపాధి కల్పించేందుకు పరిశ్రమలు సిద్ధంగా ఉన్నాయన్నారు. నిర్వహించిన జాబ్ మేళాకు 156 గురు దివ్యాంగులు హాజరవ్వగా, షార్ట్ లిస్ట్ అయిన అభ్యర్థులు 57 గురు కాగా, మరో 8 మంది దివ్యాంగులకు నియామక పత్రాలు అందించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో దాదాపు 5 వేల మేరకు వివిధ రకాల కంపెనీలు ఉన్నాయని, రానున్న మాసంలో నిర్వహించే జాబ్ మేళా ద్వారా వివిధ రకాల కంపెనీల భాగస్వామ్యంతో అర్హులైన వారికీ ఉపాధి కల్పించేందుకు దృష్టి సారిస్తామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి అనిల్ కుమార్, మహిళా సంక్షేమ అధికారిణి లలిత, జాబ్స్ మేనేజర్ అశ్విన్, వివిధ కంపెనీలకు చెందిన ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## బోడుప్పల్‌పై హైడ్రా ఫోకస్

**చింతల చెరువును సందర్శించిన కమీషనర్ రంగనాథ్**



**బోడుప్పల్, జనవరి 8 (జనంసాక్షి) :** ప్రభుత్వ భూముల పరిరక్షణకు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా బోడుప్పల్ కార్పొరేషన్‌లో ఫోకస్ పెంచింది. హైడ్రా కమీషనర్ ఏవీ రంగానథ్ బుధవారం నాడు బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని చింతల చెరువు దిగువ భాగంలో చేపట్టిన బహుళ అంతస్తుల భవనాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్,కార్పొరేటర్లు చింతల చెరువు కట్టను కబ్జా చేసి చేపట్టిన బహుళ అంతస్తుల భవనం నిర్మాణం గురించి వివరించారు. అనంతరం బోడుప్పల్ మేయర్, డిప్యూటీ మేయర్లు మాట్లాడుతూ చింతల చెరువు కట్టను అనుకోని ప్రభుత్వ నిబంధనలను విరుద్ధంగా గత పాలక పార్టీలో పెద్దమనిషిగా చెలామణి అయిన మాజీ ఎమ్మెల్యే చెరువు స్థలంతో పాటు, పార్క్ కు కేటాయించిన స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తుల భవనాన్ని నిర్మించాడని దాంతో చెరువు దిగువ భాగాన ఉన్న కాలనీ వాసులు తీవ ఇబ్బందులు పడుతున్నారని వివరించారు.హైడ్రా కమీషనర్ రంగనాథ్ మాట్లాడుతూ చెరువు స్థలం,పార్క్ స్థలం కబ్జాకు గురైనట్లు మాకు ఫిర్యాదులు వచ్చాయి దీనిపై అన్ని శాఖల అధికారులతో సంయుక్త విచారణ జరిపి వచ్చిన నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటాం అన్నారు.ఈ కార్యక్రమంలో కొత్త ప్రభాకర్ గౌడ్, కుర్రి శివశంకర్, కొత్త విక్రం గౌడ్,శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మణికొండ మున్సిపాలిటీలో రూ. 500.50 లక్షలతో అభివృద్ధి పనులు



**రాజేంద్రనగర్, జనవరి 8 (జనంసాక్షి) :** నియోజకవర్గం అభివృద్దే ధ్యేయంగా ఎక్కడ తగ్గకుండా అభివృద్ధి పనులు చేస్తున్నానని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. బుధవారం రాజేంద్రనగర్ శాసనసభ్యులు టి.ప్రకాష్ గౌడ్ చేతుల మీదగా వివిధ వార్డులలో మొత్తం రూ.506.50 లక్షలతో స్థానిక చైర్మన్ కస్తూరి నరేందర్ తో కలిసి ఎమ్మెల్యే అభివృద్ధి పనులను ప్రారంభించారు. అభివృద్ధి పనులుగా 9వ వార్డు లోని అల్కాపూర్ టౌన్షిప్ యందు పార్క్ అభివృద్ధి పనులకు రూ. 104.00 లక్షలు, 7వ వార్డులోని స్పెక్ట్రమ్ విల్లాల దగ్గర రూ. 50 లక్షల అంచనా వ్యయంతో బాక్స్ కల్వర్టు నిర్మాణం పనులు, 7వ వార్డు లోని వెంకటేశ్వర కాలనీ లోని అనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ ని ప్రారంభించడం జరిగింది. 6వ వార్డు లో సాధారణ నిధుల నుండి హెచ్ఆర్‌సికి అలీజాపూర్‌లో సెంట్రల్ లైటింగ్ 5వ వార్డు లోని ఫ్రెండ్స్ కాలనీ ప్రధాన రహదారి వద్ద సీసీ రోడ్డు కొరకు రూ.50.00 లక్షలు, 13వ వార్డు లోని పోచమ్మ కాలనీ లోని కమ్యూనిటీ హాలు,13వ వార్డు లోని లక్ష్మీ నగర్ లో నిర్వహించిన బటర్ ఫ్లై పార్క్, 12వ వార్డు లో మల్లన్న ఆలయం వద్ద నుండి అశోకా లివియానో అపార్ట్మెంట్ వరకు, బిరప్ప దేవాలయం నుండి లాంకోహిల్స్ సర్కిల్ వరకు ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్స్ పనులను ఆయన ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నరేందర్ రెడ్డి ,కమీషనర్ డి. ప్రదీప్ కుమార్ , కౌన్సిలర్లు రామకృష్ణారెడ్డి, లక్ష్మీనారాయణ, పురుషోత్తం, శైలజ, కావ్య శ్రీరాములు, లావణ్య నరేష్, వందన, పద్మ రావు, కో ఆప్షన్ సభ్యులు అహ్మద్ షా ఖాన్ , డిఈ శివ సాయి, ఏఈ సంజయ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జితేందర్, నాయకులు మల్లేష్ రవికాంత్ రెడ్డి , లక్ష్మి శ్రీ ,బాల్రెడ్డి, కుమార్ మేనేజర్ శ్రీధర్ ,డిఈఈ సాయి శివ,ఎఇఇ సంజయ్ పాల్గొన్నారు.

## గోవా అక్రమ మద్యం పట్టివేత

**కృష్ణ, జనవరి 8 (జనంసాక్షి) :** కృష్ణ మండలం పరిధిలోని గుడేయబల్లూరు శివారులో 167 జాతీయ రహదారి చెక్‌పోస్ట్‌లో మంగళవారం ఉదయం అక్రమంగా గోవా నుండి హైదరాబాద్ కు వాహనంలో తరలిస్తున్న గోవా మద్యంను పోలీసులు పట్టుకున్నారు. సిఐ శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో 16 బాటిళ్లును సీజ్ చేశారు, 9.72 లీటర్లు బాటిళ్లను సీజ్ చేసి నారాయణపేట ఎస్‌హెచ్ఓ ఆఫీస్‌కి అప్పగించడం జరుగుతుందని తెలిపారు. ఈ తనిఖీల్లో కానిస్టేబుల్ కే శ్రీనివాసులు, మల్లేష్ పాల్గొన్నారు.

## నలుగురు వ్యక్తుల బైండోవర్

**• సత్ప్రవర్తనతో ఉండాలి**

**• రెండు లక్షల సొంత బాండ్**



**మల్కాజిగిరి, జనవరి 8 (జనంసాక్షి) :** నేరచరిత్ర కలిగిన వారు సత్ ప్రవర్తనతో మెలగాలని, ఎటువంటి నేరాలకు పాల్పడవద్దని మల్కాజిగిరి తహసిల్దార్ హెచ్చరించారు.నేరెడ్ మెట్ సిఐ సందీప్ కుమార్ తెలిపిన వివరాలు ప్రకారం. మారుతినగర్‌లో నివాసముంటున్న జేమ్స్(24) పాత నేరస్థుడు ఇతను మంచి ప్రవర్తన తో ఉండాలని తహసిల్దార్ ముందు బైండో వర్ చేయగా సొంత పూచి కత్తు పై రెండు లక్షల బాండ్ తీసుకొని సత్ప్రవర్తనతో మెలగాలని హెచ్చరించి పంపారు.దొంగతనాలు, కొట్లాటలు, రేప్ కేసు నందు నిందితుడు, ఇతనిపై 7 కేసులు ఉన్నాయని తెలిపారు.ఇతనితో పాటు రేణుకనగర్‌లో నివాసం ఉంటున్న అన్నదమ్ములు కొమ్మరాజు యాదగిరి, అతని కొడుకు వెంకటేష్, కుమ్మరాజు, బాలరాజు ఆస్తి విషయంలో గొడవ పడుతుండగా వీరందరినీ బైండోవర్ చేశామని తెలిపారు. గత కొద్ది కాలంగా అన్నదమ్ములు ఇద్దరూ ఆస్తి కోసం గొడవ పడడం జరుగుతున్నది. దీనిలో భాగంగా సత్ప్రవర్తనతో ఉండాలని,ఏటువంటి నేరాలకు పాల్పడవద్దని ఎమ్మార్వో ముందు బైండో చేయడం జరిగిందని తెలిపారు.

## మల్కాజిగిరి డిగ్రీ కళాశాలకు శాశ్వత భవన స్థలం మంజూరు



**మల్కాజిగిరి, జనవరి 8 (జనంసాక్షి) :** మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మల్కాజిగిరి పాత కోర్టు స్థలం లో రెండు ఎకరాలు శాశ్వత భవనం కొరకు స్థలం మంజూరు అయిన విషయం ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి ద్వారా తెలుసుకున్న కళాశాల సిబ్బంది, విద్యార్థులు ఆనందాన్ని వ్యక్తం చేసారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బండి రాజు మాట్లాడుతూ, మల్కాజిగిరి డిగ్రీ కళాశాల 2013 లో మంజూరు అయిందని అప్పటి నుండి సొంత భవనం లేక విద్యార్థులు, అధ్యాపకులు అనేక ఇబ్బందులు పడ్డారని, గత ఆరు సంవత్సరాలుగా శాశ్వత భనం కొరకు అవిరామంగా చేసిన కృషి నేడు ఫలించిందని వర్షాన్ని వ్యక్తం చేసారు.

## రోడ్డు ప్రమాదాల్లో నష్టపోతున్న వారిలో ఎక్కువ శాతం యువతే..



**వనపర్తి బ్యూరో, జనవరి 8 (జనంసాక్షి) :** రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా జిల్లా రోడ్డు రవాణా శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఐడిఒసి ప్రాంగణం నుండి నల్ల చెరువు వరకు నిర్వహించిన భారీ బైక్ ర్యాలీని జిల్లా కలక్టర్ స్థానిక శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి, జిల్లా ఎస్పీతో కలిసి జెండా ఊపి ప్రారంభించడమే కాకుండా స్వయంగా ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలక్టర్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ మరణాలు సంభవిస్తున్నందునే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రోడ్డు భద్రతా వారోత్సవాల నుంచి మాసోత్సవాలుగా నిర్వహిస్తున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని, రోడ్డు ప్రమాదాల కారణంగా నష్టపోతున్న వారిలో 60 నుంచి 70 శాతం యువతే ఉన్నారని చెప్పారు. కాబట్టి రోడ్డు భద్రతా నియమాలు పాటించకపోవడం వల్ల కుటుంబానికి కలిగే నష్టాన్ని ఎవరు పూడ్చలేరని ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా వ్యవహరించాలని చెప్పారు. జిల్లా ఎస్పీ గిరిధర్ రావుల మాట్లాడుతూ సమాజం మనకు ఎంతో ఇస్తుందని, కాబట్టి మనం కూడా ఇతరులకు ఇబ్బంది కలగకుండా చక్కగా రోడ్డు భద్రత పాటిస్తూ బాధ్యతగా మెలగాలన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు తక్షణం స్పందించి సహాయం చేస్తున్న శ్రీనివాస్ అనే యువకుడిని సన్మానం చేసి హెల్మెట్ ను బహుకరించారు. నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి మానస, జిల్లా పౌర సంబంధాల అధికారి సీతారాం, యువజన సర్వీసుల శాఖ అధికారి సుధీర్ రెడ్డి, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి అంజయ్య ఇతర అధికారులు, విద్యార్థులు, యువత, తదితరులు పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కల నెరవేరుస్తాం..

**• ఇందిరమ్మ ఇంటి నమూనాకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**



**కడ్తాల్, జనవరి 8 (జనంసాక్షి) :** నిరుపేదల సొంతింటి కల సహకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు.బుధవారం కడ్తాల్ మండల కేంద్రంలో రైతు వేదిక ఆవరణంలో ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణం కోసం అధికారులతో కలిసి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సొంత ఇంటి స్థలం ఉన్నవారు ఇల్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వం 5 లక్షలు అందిస్తుందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు.ప్రభుత్వం ఇచ్చిన నమూనా ప్రకారం పేదలు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవాలని కోరారు.అనంతరం అసంపూర్తిగా పనులు నిలిచిపోయిన ఎంపీడీవో కార్యాలయాన్ని పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడి ఎంపీడీవో కార్యాలయ నిర్మాణ పనులను పూర్తి చేస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ యాట గీతా నరసింహ్మ,టీపీసీసీ సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్,హౌసింగ్ అధికారులు బీసీ నాయక్,సురేష్, ఎంపీడీవో సుజాత,తహసిల్దార్ ముంతాజ్,ఏఎంసీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి,రాష్ట్ర గిరిజన సేవా సంఘం అధ్యక్షులు హన్మా నాయక్,డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి,కాంగ్రెస్ మండల అధ్యక్షులు బీచ్య నాయక్,ఏఎంసీ డైరెక్టర్ నరేష్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు పోతుగంటి అశోక్, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలుపాల్గొన్నారు.

# పేదవాడి సొంతింటి కల నెరవేరుస్తున్నాం



## నాగర్ కర్నూల్ శాసనసభ్యులు కూచుకుల రాజేష్ రెడ్డి

**బిజినేపల్లి, జనవరి 8 (జనంసాక్షి)**

గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వాగ్దానం నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు కట్టించి ఇస్తామని ప్రజలకు ఇచ్చిన హామీ నెరవేరుస్తున్నామని నాగర్ కర్నూల్ శాసనసభ్యులు కూచుకుల్ల రాజేష్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నమూనా ఇంటి నిర్మాణానికి బుధవారం బిజినేపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్ రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదవాడి సొంతింటి కలని నిజం చేయడానికి ఇందిరమ్మ ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయినప్పటినుండి నేటి వరకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అర్హులైన లబ్ధిదారులందరికీ అందేవిధంగా కృషి చేసిందని ఆయన అన్నారు. రాబోయే రోజులలో నియోజకవర్గాన్ని అన్నివిధాల అభివృద్ధి చేసుకొని ముందుకు సాగుదాం అన్నారు. గత పది సంవత్సరాలు పాలించి నా టిఆర్ఎస్ ప్రభుత్వం నిరుపేద ప్రజలకు ఏమి చేయలేకపోయి ందని ఎద్దేవ చేశారు. ఇందిరమ్మ రాజ్యంలో అన్ని వర్గాల ప్రజలకు సముచిత స్థానం కల్పిస్తూ ముందుకు తీసుకువెళ్లే దిశగా రాష్ట్ర ముఖ్యమ ంత్రి రేవంత్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నాడని అన్నారు.

అభివృద్ధి ఫలాలు ప్రతి ఒక్కరికి అందేవిధంగా కార్యకర్త లు బాధ్యత తీసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్ర మంలో మండల అధికారులు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మిద్దె రాములు, తిరుపతయ్య, వెంకట్ స్వామి, అమృత్ రెడ్డి, బంగారి పర్వతాలు, నజీర్, పాషా, శ్రీనివాస్ గౌడ్, ఖలీల్, మాన్య నాయక్, అవంతి, తిరుపతయ్య గౌడ్, శ్రీకాంత్, సూరి, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వ్యవసాయ, పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు నాబార్డ్, లోన్లు

**నాబార్డు డిజిఎం శ్రీకాంత్ జామ్రే.**

**వనపర్తి బ్యూరో జనవరి 08 (జనంసాక్షి)**




18 నుండి 60 సంవత్సరాలు వయస్సు ఉండి నాణ్యమైన వ్యవసాయ, అనుబంధ రంగాలలో వ్యాపార అవకాశాలు ఉన్నవారికి, శ్రామికవేత్తలుగా, వ్యాపారవేత్తలుగా ఎదిగేందుకు నాబార్డ్, బ్యాంకింగ్ వ్యవస్థలు లోన్లు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాయని నాబార్డ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్రీకాంత్ జాంరే అన్నారు

పెద్దమందడి మండలంలోని మోజర్ల ఉద్యాన కళాశాల లో కళాశాల, నాబార్డ్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన అగ్రి క్లినిక్, అగ్రి బిజినెస్ సెంటర్ పై సన్నెజేషన్ వర్క్ షాప్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.... గ్రామీణ అభివృద్ధితోనే దేశ అభివృద్ధి సాధ్యమవుతుంది అని, అందులో రైతుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. వ్యవసాయ, అనుబంధ రంగాలలో వ్యాపారాత్మక ధోరణిని పెంపొందించేందుకు నాబార్డ్ కృషి చేస్తుంది అన్నారు. బ్యాంకుల ఆర్థిక సహాయంతో రైతాంగం, ఉద్యాన, వ్యవసాయ రంగాలలో ఆసక్తి ఉన్నవారు, నిపుణుల ఎంటర్ప్రెన్యూర్షిప్ అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. అగ్రి క్లినిక్, అగ్రీ బిజినెస్ సెంటర్ పథకం కింద ఇంటర్మీడియట్ నుండి పోస్ట్ గ్రాడ్యుయేట్ అభ్యర్థులకు 45 రోజుల పాటు శిక్షణ ఇచ్చి, ఒక వ్యక్తికి 20 లక్షల వరకు, అలాగే ఐదుగురు ఉన్న గ్రూప్ కి కోటి రూపాయల వరకు ప్రాజెక్టు కాస్టు ఇవ్వనున్నట్టు తెలిపారు. జనరల్ కేటగిరీకి 30%, మహిళలు ఎస్సీ ఎస్టీలకు 44 శాతం సబ్సిడీ ఉన్నట్లు తెలిపారు. కోవిడ్ తర్వాత ఉద్యానరంగంలో ఎంటర్ప్రేనర్ షిప్ కి చాలా అవకాశాలు ఉన్నాయి అని ఉద్యాన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పిడిగం సైదయ్య అన్నారు. హైడ్రోపోనిక్, విలువల జోడింపు, ఆర్గానిక్ ఫార్మింగ్, తేనె తయారీ, పుట్టగొడుగుల పెంపకం, ఔషధ, సుగంధ ద్రవ్యాల పెంపకం లో వ్యాపార అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని సైదయ్య తెలిపారు. అర్హత, వ్యాపార అవకాశాలు ఉన్న ఎంటర్టెన్యూరర్స్ కి బ్యాంకులు లోన్లు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్టు వనపర్తి లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ కౌశల్ కిషోర్ పాండే అన్నారు.

నాబార్డ్ అమలు చేస్తున్న పథకాలలో గురించి మహబూబ్నగర్ క్లస్టర్ డీడీఎంలు షణ్ముఖ చారి, పి. మనోహర్ రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా అధికారులు గోవింద నాయక్ తో పాటు వనపర్తి, నాగర్ కర్నూల్, మహబూబ్నగర్, గద్వాల్, నారాయణపేట జిల్లాలోని అన్ని బ్యాంకుల రీజినల్ మేనేజర్స్, డిస్టిక్ లీడ్ మేనేజర్స్, బ్రాంచ్ మేనేజర్లు, అంకుర పరిశ్రమల అధికారులు, అగ్రికల్చర్ కాలేజ్, ఫిషరీ కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రిన్సిపాల్ లు, ఎఫ్ఈఓ లు, ప్రొఫెసర్లు విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# భూ పరిపాలనలో నూతన మార్పులకు శ్రీకారం

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ..**

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):**



రాష్ట్ర ప్రభుత్వం భూ పరిపాలనలో నూతన మార్పులకు శ్రీకారం చుట్టిందని, రైతులు, భూ యజమానుల హక్కుల రక్షణ, భద్రతతోపాటు పలు రకాల సహాయ సహకారాలు అందించేలా ప్రభుత్వం భూ భారతి బిల్లును అమల్లోకి తేనున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం ఐడిఓసి కార్యాలయంలో తెలంగాణ భూ భారతి చట్టంపై రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో వచ్చే సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఏదన్నా భూ సమస్య ఎదురైతే పైసా ఖర్చు లేకుండా ఉచితసలహాలు పొందేందుకు వీలు కల్పించారని తెలిపారు. భూ వివాదాలకు కోర్టుల చుట్టూ తిరగకుండా జిల్లా స్థాయిలోనే రెండు అప్పీళ్ల వ్యవస్థలు ఉంటాయని, ధరణి స్థానంలో 19 సెక్షన్లతో తెలంగాణ భూ భారతి ఆర్వోఆర్-2024 బిల్లును ప్రభుత్వం అందుబాటులో కి తెచ్చినట్లు పేర్కొన్నారు. వచ్చే సమస్యలపై అవగాహన కలిగి ఉండాలని అట్టి సమస్యలను ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు ఆయన వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఆర్డిఓ మంగిలాల్, అన్ని మండలాల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# 13న మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు





## రావాలంటూ సీఎం రేవంత్‌కు మంత్రి కొండా సురేఖ విజ్ఞప్తి

**హైదరాబాద్, జనవరి 8 (జనంసాక్షి) :**

జనవరి 13 నుంచి జరిగే ఐనవోలు మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలకు రావాలని కోరుతూ అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖా మంత్రి కొండా సురేఖ హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి, దేవాదాయశాఖ తరఫున ఆహ్వానపత్రికను అందించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో, సిబ్బంది స్వామి వారి తీర్థప్రసాదాలను అందించి, శేష వస్త్రాలతో సత్కరించగా, ఆలయ అర్చకులు సీఎం రేవంత్ రెడ్డికి వేదాశీర్వచనం అందించారు. జానపదుల జాతరగా ఖ్యాతికెక్కిన ఐనవోలు మల్లన్న బ్రహ్మోత్సవాల వైభవాన్ని, దేవాలయ చారిత్రక నేపథ్యాన్ని, ఆలయ ప్రాశస్త్యాన్ని ఆలయ సిబ్బంది, అర్చకులు సీఎం రేవంత్ రెడ్డికి వివరించారు. అంతకుముందు వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు, టెస్కాబ్ ఛైర్మన్ మార్నేని రవీందర్ రావు, ఆలయ ఈవో అద్దంకి నాగేశ్వర్ రావు, అర్చకులు హైదరాబాద్‌లోని జూబ్లిహిల్స్ లో మంత్రి కొండా సురేఖని వారి నివాసంలో కలిసి మల్లన్న బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు. ఆలయ సిబ్బంది మంత్రికి మల్లికార్జున స్వామి వారి తీర్థప్రసాదాలను అందించి, శాలువాతో సత్కరించారు. అర్చకులు వేదాశీర్వచనం అందించారు. అనంతరం జాతర ఏర్పాట్లపై ఆలయ ఈవో మంత్రి సురేఖకి వివరించారు.

జనవరి 13 నుంచి ఉగాది పర్వదినం వరకు వైభవోపేతంగా నిర్వహించే మల్లికార్జున స్వామివారి బ్రహ్మోత్సవాలకు దేవాదాయ, పోలీస్, విద్యుత్, పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బి, అగ్నిమాపక, ఆర్టీసి తదితర శాఖలు చేపడుతున్న పనుల వివరాలను మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ అన్ని శాఖలు పరస్పరం సమన్వయంతో పనిచేస్తూ జాతరను విజయవంతం చేయాలని సూచించారు. భక్తులకు సౌకర్యాల కల్పనలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి ఈవోను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో కిరణ్ కుమార్, ప్రధానార్చకులు రవీందర్ శర్మ, అర్చకులు నరేష్ శర్మ, భాను ప్రసాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలు సైబర్ క్రైమ్ పట్ల అప్రమత్తంగా ఉండాలి




## నర్సంపేట ఏసిపి కిరణ్ కుమార్

## మంగళవారిపేటలో పోలీసుల కార్డెన్ సెర్చ్

**ఖానాపురం: జనవరి 8 (జనంసాక్షి)**

మత్తు పదార్థాల పట్ల యువతరం అప్రమత్తంగా ఉండి తమ బావి జీవితానికి బాటలు వేసుకోవాలని నర్సంపేట ఏసిపి కిరణ్ కుమార్ అన్నారు. బుధవారం కానాపురం మండలం మంగళ వారి పేటలో కాన స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు ఈ సందర్భంగా నర్సంపేట ఎ సిపి మాట్లాడుతూ ప్రజలందరూ సైబర్ క్రైమ్ పట్ల జాగ్రత్తగా ఉండి సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకోకూడదని అన్నారు. సైబర్ నేరగాళ్ల మోసం చేయడానికి వివిధ రకాల పన్నాగాలు పన్నుతారని వారి వలలో చిక్కుకోకుండా ఇలాంటి ఓటిపిలు పంపరాదు అన్నారు. ప్రస్తుతం సమాజంలో యువతరం వివిధ రకాల మాదకద్రవ్యాలకు మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారని వాటి పట్ల అవగాహన కలిగి జీవితాన్ని అంధకారం చేసుకోకుండా డ్రగ్స్ రహిత సమాజంగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఏసిపి అన్నారు. ఈ సందర్భంగా నిషేధిత గుట్కా ప్యాకెట్లను అనుమానిత వాహనాలను నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో దుగ్గొండి సీఐ సాయి రమణ, ఖానాపురం ఎస్సై రఘుపతి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలి

**కలెక్టర్ సత్య శారదా దేవి**

**వరంగల్ ప్రతినిధి: జనవరి 8(జనంసాక్షి)**



ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో అధికారులు అత్యంత పారదర్శకంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇళ్ల ప్రత్యేక అధికారులు, తహసిల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల విషయంలో అధికారులు ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి, ఇండ్లులేని వారిని, అత్యంత నిరుపేదలకు గుర్తించి, వార్డ్, గ్రామ సభలో చర్చించి లబ్ధిదారుల ఎంపిక చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో పెండింగ్ లో ఉన్న వాటిని, గ్రామాల్లో లేని వారిని పిలిపించి వివరాలు సేకరించి సర్వే పూర్తి చేయాలన్నారు. జిల్లాలోని దూపకుంట, పైడిపల్లి రాయపర్తి, తిమ్మాపూర్ లలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు అందజేయుటకు గానునియ మించిన బృందాలు క్షేత్రస్థాయిలో మౌలిక వసతుల కల్పనకు అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా పరిషత్ సీఈఓ రామిరెడ్డి, తాసిల్దార్లు ఇక్బాల్, నాగేశ్వరరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజనంలో నాణ్యత లేకపోతే చర్యలు





**వరంగల్ ప్రతినిధి, జనవరి 8 (జనంసాక్షి)**



మధ్యాహ్న భోజన విషయంలో నాణ్యత లేకపోతే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద హెచ్చరించారు. బుధవారం వరంగల్ రంగశాయిపేట ఉన్నత ప్రాథమిక పాఠశాలలను అంగన్వాడి కేంద్రాన్ని తనిఖీ చేశారు. పాఠశాల గదులను, మధ్యాహ్న భోజనం షెడ్డును, మరుగుదొడ్లు ఉన్న ప్రాంతంలో నిల్వ ఉన్న మురుగు నీటిని పరిశీలించి అక్కడి అపరిశుభ్రతపై ప్రధానోపాధ్యాయులు శారదాబాయి ని మందలించారు. పాఠశాల పరిసరాలలో ఉండవలసిన పిల్లలు రోడ్లపై ఎందుకు. కనిపిస్తున్నారని ఉపాధ్యాయులు ని ప్రశ్నించారు. పాఠశాల గేటును సమయానుసారం తెరువాలన్నారు. అనంతరం కంప్లైంట్ బాక్స్ ను పరిశీలించి బాక్స్ యొక్క తాళం డిఈఓ కంట్రోల్ లో ఉండవలసిందిగా సూచించారు. డిగ్రీ, జూనియర్ కళాశాల సందర్శించి పరిసర ప్రాంతాల్లో చెట్ల పొదల్లు లేకుండా శుభ్రంగా ఉండేలా చూడాలని కళాశాల ప్రిన్సిపాల్, హయ్యర్ ఎడ్యుకేషన్ నోడల్ అధికారి నవీన్ ను ఆదేశించారు

**యాజమాన్యం, టిజిఈడబ్ల్యుఐడీ**

ఈఈ జనార్ధన్ రెడ్డి, డి ఇ రాజేందర్, ఏఈ అజీజ్ ఖాన్ తదితరులు ఉన్నారు.

# సౌరశక్తి విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు స్థలాన్ని గుర్తించాలి

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):**




సౌరశక్తి విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు భూములను గుర్తించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. సోలార్ ప్లాంట్స్ ఏర్పాటుకు భూ సేకరణ ప్రక్రియపై బుధవారం ఐడిఓసి కార్యాలయంలో రెవెన్యూ, విద్యుత్, డిఆర్డీఏ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ, విద్యుత్తు, డిఆర్డీఏ అధికారులు జాయింట్ సర్వే నిర్వహించి ప్రతిపాదనలు అందచేయాలని సూచించారు. ఈ నెల 20వ తేదీ వరకు ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాల్సి ఉన్నందున 17వ తేది వరకు పూర్తి నివేదికలు అందచేయాలని తహసీల్దార్ లను ఆదేశించారు. మహిళా స్వయం సహాయక సంఘాల మహిళల ద్వారా సోలార్ ప్లాంట్స్ ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ జిల్లా నుండి 150 ఎకరాలు ఇవ్వాల్సి ఉందని ఇప్పటి వరకు 28 ఎకరాలు గుర్తించినట్లు తెలిపారు. మహిళలను వ్యాపారవేత్తలుగా తయారు చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం మహిళా స్వయం సహాయక సంఘాల మహిళల ద్వారా సోలార్ ప్లాంటు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఒక మెగావాట్ సోలార్ ప్లాంటు ఏర్పాటుకు 4 ఎకరాల భూమి అవసరం ఉందని, ప్రభుత్వ, దేవాదాయ, అటవీ, ఇరిగేషన్ భూములను గుర్తించాలని తెలిపారు.

సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయుటకు మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ, మహిళా సంఘాలను మ్యాచింగ్, బ్యాచింగ్ చేయు ప్రక్రియ పూర్తి చేయాలని డిఆర్డీఏ అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో స్మాల్ అండ్ మైక్రో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయుటకు 5 ఎకరాలు గుర్తించాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, విద్యుత్ శాఖ ఎస్ఈ మల్హూర్ నాయక్, అన్ని మండలాల తహసీల్దార్లు, విద్యుత్ శాఖ డీఈలు, ఎఈలు, డిఆర్డిఏ డీపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

# తాడిచర్ల డేంజర్ జోన్ ప్రాంతం మిగులు భూములు తీసుకోవాలి

**మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**

**మల్హర్, జనవరి 08(జనంసాక్షి)**



తాడిచర్ల గ్రామము లోని ఉపరితల గని పరిధి లోని మిగులు భూములు, డేంజర్ జోన్ భూములు, పలు సమస్యల గురించి విద్యుత్ శాఖ ముఖ్య కార్యదర్శి, జెన్కో సిఎండి సందీప్ కుమార్ సుల్తానియా ఐఏఎస్ కు వినతి పత్రం అందజేసిన మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్. హైదరాబాద్ డా. బి ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో విద్యుత్ శాఖ ముఖ్య కార్యదర్శి, జెన్కో సిఎండి సందీప్ కుమార్ సుల్తానియా ఐఏఎస్ ను కలిసి టీజీ జెన్కో తాడిచెర్ల - 1 కోల్ బ్లాక్ ఓపెన్ కాస్ట్ కు సంబంధించి పెండింగ్ లో ఉన్న భూసేకరణ సమస్యలు, తాడిచెర్ల డేంజర్ జోన్ భూ సేకరణ, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ సమస్యలను త్వరగా పరిష్కరించాలని వినతి పత్రం అందజేసినారు. ఈ కార్యక్రమం లో మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్, మాజీ జడ్పీటీసీ గోనె శ్రీనివాస్ రావు, మాజీ ఎంపీటీసీ రావుల కల్పన మొగిలి, అర్ని సత్యనారాయణ, రామిడి గట్టయ్య, రాగం సతీష్ ఉన్నారు.

జనంసాక్షి www.janamsakshi.org
గురువారం 09 జనవరి 2025

## తహశీల్దార్ ఆనంద్‌రావుపై చర్యలు తీసుకోండి

- సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు



**బొంరాస్‌పేట, జనవరి 8 (జనంసాక్షి) :** దుద్యాల మండలం గౌరారం గ్రామానికి చెందిన బోయిని సాయప్ప మరణానంతరం ఆయన వారసుడు బోయిని అశోక్ కు విరసత్ చేయాల్సిన 1.13 గుంటల భూమిని దుద్యాల తహసిల్దారుగా గతంలో పనిచేసిన ఆనందరావు అక్రమంగా వేరే వ్యక్తులకు పట్టా చేయడం జరిగిందని ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకొవాలని బుధవారం సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ కు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. ఇలాంటి అవినీతి అక్రమాలకు పాల్పడినటువంటి తహసిల్దార్ ఆనందరావు పై పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, అశోక్ కు విరసత్ చేసి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బుస చంద్రయ్య, కే. శ్రీనివాస్, జిల్లా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ హక్కుల సమితి అధ్యక్షులు కే .చంద్రయ్య తదితరులు ఉన్నారు.

## మహిళల ఆర్థికాభివృద్ధికి ఎమ్మెల్యే కృషి అమోఘం

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ జిల్లా బ్యూరో, జనవరి 8 (జనంసాక్షి) :** జిల్లా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటులో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు కృషి మరువ లేనిదని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్ లో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా ఆధ్వర్యంలో మహిళలందరికీ సభ్యులు జిల్లా కలెక్టర్ ను కలవడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మెదక్ ఎమ్మెల్యే నియోజకవర్గ అభివృద్ధిలో విశేష కృషి చేస్తున్నారని మెడికల్ కళాశాలలో మున్సిపల్ కౌన్సిల్ మెదక్ అధ్వర్యంలో మెడికల్ కాలేజి నందు మహిళా సంఘాల ద్వారా సరస్వతి స్లమ్ సమాఖ్య అద్వర్యంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటు చేయడంలో శాసన సభ్యులు కృషి మరువలేనిది అన్నారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో క్యాంటీన్ ప్రారంభించడం జరిగిందని తెలిపారు. దానికి సంభంధించిన ఆర్డర్ కాపీ బుధవారం మహిళా ఈ సంఘ సభ్యులకు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సరస్వతి స్లమ్ సమాఖ్య అధ్యక్షులు, క్యాంటిన్ సభ్యులు పి.అనిత, ఎ. సంధ్యారాణి, అమీన బేగం, జి. ఉద్విత, శాఫియా బేగం, పి.డి. మెప్మా ఇందిరా, టి.యం.సి. జి. సునిత మరియు కమ్యూనిటీ ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

## నేతన్నల బలోపేతనికి ప్రభుత్వ సహకారం

- భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**భూదాన్ పోచంపల్లి, జనవరి 8 (జనంసాక్షి) :** నేతన్నలు ఆర్థికంగా బలోపేతం కావడానికి



ప్రభుత్వం సహకారం అందిస్తుందని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం నాడు భూదాన్ పోచంపల్లి పట్టణ కేంద్రంలో టై అండ్ డై సిల్క్ చీరల ఉత్పత్తిదారుల సంఘం 47వ వార్షికోత్సవ మహా సభను భారత లవ కుమార్ అధ్యక్షతన నిర్వహించగా, ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన సంవత్సరంలోపే చేనేత కార్మికుల రుణమాఫీ చేసిందని అన్నారు. అదేవిధంగా త్రిఫ్ట్ పథకం కింద 270 కోట్లు ఇచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తడక వెంకటేష్, టై అండ్ డై అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ముస్కూరి నరసింహ, గౌరవ అధ్యక్షులు కర్నాటి బాలరాజు, ఉపాధ్యక్షులు ఈపూరి ముత్యాలు, కుడికాల రామ్ నరసింహ, సహాయ కార్యదర్శిలు గంజి బాలరాజు, వనం దశరథ, సీతా సుధాకర్, కోశాధికారి మంగళపల్లి రమేష్, కార్యవర్గ సభ్యులు వనం శంకర్, సీత భవాని శంకర్, కడివేరు సత్యనారాయణ, కందగట్ల శంకరయ్య, రచ్చ భాస్కర్, సీత కృష్ణ, నామాల శ్రీనివాస్, వేముల నరేష్, కడవేరు భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## భూ నిర్వాసితులకు ప్లాట్ల కేటాయింపు

- లాటరీ ద్వారా ఇండ్ల స్థలాలు



**చింతపల్లి, జనవరి 8 (జనంసాక్షి) :** శివన్నగూడెం రిజర్వాయర్ నందు ముంపుకు గురైన మర్రిగూడ మండలం నర్సిరెడ్డి గూడెం గ్రామ భూ నిర్వాసితులకు చింతపల్లి మండల కేంద్రంలోని సాయి సుమంగళీ ఫంక్షన్ హాల్ లో బుధవారం ప్లాట్ల కేటాయింపు కార్యక్రమాన్ని నిర్వహించారు.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ శ్రీనివాసులు హాజరై భూ నిర్వాసితులకు డ్రా పద్ధతిలో ప్లాట్ లను కేటాయించి మాట్లాడుతూ.. డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్వహిస్తున్న ప్రాజెక్టుల కింద భూములు కోల్పోతున్న నర్సిరెడ్డిగూడెం గ్రామ 289 భూ నిర్వాసితులకు చింతపల్లి మండల కేంద్రంలోని 154 సర్వే నెంబర్లో లే అవుట్ చేసి ప్లాట్ కేటాయించడం జరిగిందన్నారు. లేఅవుట్ను డిస్ల్పై చేసి రైతులకు చూపించారు. ఈ లేఔట్ లో అన్ని వసతులు సమకూరుస్తామని హామీ ఇచ్చారు. మౌలిక సదుపాయాల నిమిత్తం సిసి రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పార్కు, విద్యుత్తు, వాటర్ ట్యాంకులు, అంగన్వాడి భవనం, దేవాలయాలు నిర్మిస్తామని టెండర్ ప్రాసెస్ లో ఉన్నందున త్వరలోనే పూర్తి సౌకర్యాలు అందిస్తామని తెలిపారు. అనంతరం రైతుల సలహాలు సూచనలు అడిగి తెలుసుకున్నారు. భూ నిర్వాసితులకు డ్రా పద్ధతిలో ప్లాట్లను కేటాయించారు.. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రమణారెడ్డి, ఈ ఈ రాములు, డి ఈ కాసిం, ఏ ఈ రఘు, మర్రిగూడ ఎమ్మార్వో శ్రీనివాస్, చింతపల్లి ఎమ్మార్వో రమాకాంత్ శర్మ, ఆర్ ఐ లు సునీత, రామారావు, మండల సర్వేయర్ రతన్లాల్, రెవిన్యూ సిబ్బంది,ఇరిగేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## గురుకులాల ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలి

**వికారాబాద్ జిల్లా బ్యూరో, జనవరి 8 (జనంసాక్షి) :** ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్న ప్రభుత్వము గురుకులాల్లో ప్రవేశాల కోసం విద్యార్థినీ విద్యార్థులు ఆన్లైన్ లో దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరంలో వివిధ గురుకులాల్లో ఆంగ్ల మాధ్యమంలో ప్రవేశాల కోసం ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరి 23న కామన్ ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహించనుందని తెలిపారు. గురుకులాల్లో విద్యను అభ్యసించదల్చిన బాలబాలికలు https://tgcet.cgg.gov.in ద్వారా ఆన్లైన్ లో ఫిబ్రవరి 01వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. దరఖాస్తు చేసుకునేందుకు కుల ధ్రువీకరణ పత్రం నెంబరు, ఆదాయ ధ్రువీకరణ పత్రం నెంబరు, ఆధార్ కార్డు నెంబరు, బర్త్ సర్టిఫికెట్, ఫోటో అవసరమని తెలిపారు.

# జిల్లా వ్యాప్తంగా 11 సైట్లలో 270 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించాం

- జిల్లా కలెక్టర్



**నల్లగొండ బ్యూరో, జనవరి 8 (జనంసాక్షి) :** నల్లగొండ జిల్లాలో స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు 270 ఎకరాల స్థలాన్ని గుర్తించినట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క కు తెలిపారు. రాష్ట్రంలో మహిళలందరిని మహాలక్ష్మిలుగా తీర్చిదిద్దేందుకు, వారికి ఆర్థిక సాధికారతను కల్పించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం వివిధ కార్యక్రమాల ద్వారా ప్రయత్నం చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా రాష్ట్రంలోని స్వయం సహాయక మహిళా సంఘాలకు సుమారు 1000 మెగావాట్ల సోలార్ పవర్ విద్యుత్ ఉత్పత్తిని చేపట్టి వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం గత నవంబర్లో ఇంధన, గ్రామీణాభివృద్ధి శాఖలు ఎంఓయు సైతం చేసుకున్నాయి. ఇందులో భాగంగా ఒక్కో మెగావాట్ కు 4 ఎకరాల చొప్పున ప్రతి జిల్లాలో కనీసం100 నుండి150 ఎకరాలకు తగ్గకుండా ప్రభుత్వ స్థలాన్ని గుర్తించాలని ప్రభుత్వం జిల్లా కలెక్టర్లను ఇదివరకే ఆదేశించింది. ఇందులో భాగంగా ఈ విషయమై బుధవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క,అటవీ శాఖ మంత్రి కొండా సురేఖా,రాష్ట్ర సీనియర్ అధికారులతో కలిసి హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, అటవీ,ట్రాన్స్కో,తదితర శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు జిల్లాల వారీగా గుర్తించిన భూముల వివరాలు, తీసుకున్న చర్యలపై ఉప ముఖ్యమంత్రి కోరిన సందర్భంలో నల్లగొండ జిల్లా వివరాలను జిల్లా కలెక్టర్ తెలియజేస్తూ జిల్లా వ్యాప్తంగా 11 సైట్లలో 270 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించడం జరిగిందని, ఇదివరకే రెవెన్యూ, ఫారెస్ట్ ఇతర అధికారుల ఉమ్మడి తనిఖీ సైతం పూర్తి చేసినట్లు తెలిపారు. మరోసారి ఆదివారంలోగా తనిఖీ నిర్వహించి ఆ భూములలో సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు ఉన్న అవకాశాలపై నివేదికను సమర్పిస్తామని తెలిపారు. రాష్ట్రస్థాయి నుండి ఈ వీడియో కాన్ఫరెన్స్ కు రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ లోకేష్, సెర్ప్ సీఈవో దివ్య ,సీఎం కార్యదర్శి, ట్రాన్స్కో సిఎండి కృష్ణ భాస్కర్ హాజరుకాగా, జిల్లా నుండి జిల్లా అటవీ శాఖ అధికారి రాజశేఖర్,డి ఆర్ డి ఓ శేఖర్ రెడ్డి, ట్రాన్స్కో ఎస్ ఈ వెంకటేశ్వర్లు, రెడ్ కో జిల్లా మేనేజర్ ఎం. పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

# దొంగతనాల నివారణకు పటిష్ట నిఘా..

- జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్




**నల్గొండ బ్యూరో, జనవరి 8 (జనంసాక్షి) :** మీ ఇంటి పరిసరాల్లో,కాలనీల్లో ముఖ్యమైన ప్రదేశాల్లో సీసీటీవీ కెమెరాల ప్రాముఖ్యత ఎంతో ముఖ్యం. అనుమానిత వ్యక్తుల కదలికలపై అప్రమత్తంగా ఉండాలి,వెంటనే తగు సమాచారాన్ని సంబంధిత పోలీస్ స్టేషన్ కి అందించాలని ఎస్పీ కోరారు. జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీస్ అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో జిల్లాలో దొంగతనాలు నివారణకు పగలు రాత్రి పటిష్ఠ గస్తీ నిర్వహించాలని, పాత నేరస్తుల కదలికలపైన ఎప్పటికప్పుడు నిఘా పెట్టాలని అధికారులకు సూచించారు. రాత్రి,పగలు అన్ని ప్రాంతాల్లో క్షుణ్ణంగా గస్తీ నిర్వహించాలని పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో అనుమానిత వ్యక్తుల కదలికల పైన నిఘా పెట్టాలని అన్నారు. ప్రతి కాలనిలలో ముఖ్యమైన కూడలిలో,రహదారుల వెంట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా ప్రజలు కూడా ఈ విషయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో దొంగతనాల నివారణకు జిల్లా పోలీస్ యంత్రాంగం పటిష్ఠ నిఘా ఏర్పటు చేసి అన్ని ప్రాంతాలలో నిఘా పెట్టి నియంత్రణ చర్యలు చేపట్టామని అన్నారు. మీ ఇంటి పరిసరాల్లో, కాలనీల్లో,షాపులలో సిసిటివి కెమెరాలు అమర్చుకోవడం చాలా ముఖ్యమని,ఏదైనా సంఘటన జరిగిన వెంటనే సంబంధిత వ్యక్తుల కదలిక పై తగు చర్యలు తీసుకునుటకు వీటి ప్రాముఖ్యత చాలా అవసరం ఉంటుందని అన్నారు. కాబట్టి ప్రతి ఒక్కరు తమ ఇంటి పరిసరాల్లో కాలనీల్లో,షాపులలో మరియు ముఖ్యమైన ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. దొంగతనాల నియంత్రణ జిల్లా ప్రజలు ఈ దిగువ తెలియజేసిన నిబంధనలు పాటిస్తూ పోలీస్ వారికి సహకరించాలని అన్నారు. మీ విలువైన వస్తువులు బంగారం,నగదు బ్యాంక్ లాకర్ లో భద్రపరచుకోవాలని,మీ యొక్క ఇంటి డోర్ కి సెంట్రల్ లాకింగ్ వాడాలని చెప్పారు. సుదూర ప్రాంతాలకు వెళ్లే పట్టణ, గ్రామంలోని ప్రజలు సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులకు ముందుగానే తెలియజేస్తే అక్కడ పోలీస్ వారు నిఘా ఏర్పాటు చేయవచ్చుఅని అన్నారు.

## ముమ్మరంగా కొనసాగుతున్న సర్వే

- ప్రతి దరఖాస్తును సర్వేయర్లు వెరిఫికేషన్
- ఇప్పటివరకు 39.80 శాతం పూర్తి



**హైదరాబాద్, జనవరి 8 (జనంసాక్షి) :** గ్రేటర్‌లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే ముమ్మరంగా కొనసాగుతున్నది వేగవంతంగా పూర్తి చేసేందుకు క్షేత్ర స్థాయి అధికారులు కృషి చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో ప్రతి దరఖాస్తుదారుని ఇంటికి వెళ్లి సర్వేయర్ లు దరఖాస్తు ను పరిశీలన చేస్తారు. సర్వేయర్లకు కేటాయించిన డివిజన్ లో దరఖాస్తు దారుల వివరాలను ఇప్పటి వరకు మిగిలిపోయిన ఆర్జిదారులకు సర్వే చేస్తారు వారికి ముందస్తుగా ఆర్జిదారులకు ఫోన్ చేసి ఇంటి వద్ద ఉండే విధంగా ఒక రోజు ముందస్తుగా సమాచారం ఇస్తారు సర్వేయర్ ఆర్జిదారుని ఇంటికి వచ్చే సందర్భంలో ఆధార్ కార్డు, ఇంటి స్థలానికి సంభందించిన పత్రాలు సిద్ధంగా పెట్టుకోవాలి. గ్రేటర్ లో ప్రజా పాలన సందర్భంగా స దరఖాస్తు చేసుకున్న నేపథ్యంలో అట్టి దరఖాస్తు చేసుకున్న వారందరినీ తప్పని సరిగా అప్లికేషన్ ను వెరిఫికేషన్ చేసే భాధ్యత సర్వేయర్ పై ఉందన్నారు. సర్కిల్ కు కేటాయించిన సర్వేయర్లు కేటాయించిన లక్ష్యం మేరకు సర్వే చేస్తున్నారో లేదో డిప్యూటీ కమిషనర్లు రోజుకు కనీసం 5 నుండి 10 దరఖాస్తులను ర్యాండమ్ గా చెక్ చేయాలన్నారు. అంతే కాకుండా గ్రేటర్ పరిధిలో ఉన్న జిల్లా కలెక్టరేట్ కార్యాలయం నుండి సర్వే కోసం డిప్యూట్ చేసిన సిబ్బంది యొక్క విధులను సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. రోజు వారీగా హాజరు తీసుకొని కేటాయించిన ఏరియాకు వెళ్లి సర్వే చేస్తున్నారో లేదో పరిశీలన చేయాలనీ డిప్యూటి కమిషనర్ లకు సూచించారు. ప్రజాపాలన కార్యక్రమం సందర్భంగా గ్రేటర్ వ్యాప్తంగా 10,70,463 అప్లికేషన్లు సర్వే చేయుటకు 2570 లాగిన్ లను క్రియేట్ చేసినట్లు అందులో భాగంగా ఇప్పటివరకు 4,25,9940 ఇళ్ల సర్వే పూర్తిచేసారు మిగితా దరఖాస్తు దారులను ఎవ్వరినీ మిస్ కాకుండా సర్వే చేస్తారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా లక్షలాది మంది నిరుపేదలకు సొంతిల్లు కల్పించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం కృషి చేస్తున్న నేపథ్యంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రాముఖ్యత చాటుతున్న నేపథ్యంలో సర్వే ప్రక్రియను వేగవంతంగా చేసేందుకు జోనల్, డిప్యూటీ కమిషనర్లను కమిషనర్ విశేష కృషి చేస్తున్నారని హౌసింగ్ అధికారులు తెలిపారు.

## ఉపాధ్యాయురాలికి ఆర్థిక సాయం చేసిన ట్రస్మా సభ్యులు




**శామీర్‌పేట్, జనవరి 8 (జనంసాక్షి) :** తుర్కపల్లిలోని సెంట్ మేరీ సెంట్రల్ స్కూల్లో జరిగినటువంటి ట్రస్మా షామీర్ పేట మండల సమావేశంలో బుధవారం రోజు నూతన కార్య వర్గాన్ని ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోనె హన్మంత్ రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని ప్రైవేట్ స్కూలు కరస్పాండెంట్స్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు . ట్రస్మా శామీర్ పేట్ మండల అధ్యక్షునిగా కె.మాధవరెడ్డి, శ్రీ సరస్వతీ విద్యానికేతన్ హై స్కూల్, ప్రధాన కార్యదర్శిగా జె.కిష్ట రెడ్డి, జీనియస్ గ్రామర్ స్కూల్, కోశాధి కారిగా జి . జ్యోతి దివ్య జ్యోతి హై స్కూల్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సమావేశంలో ఊపిరితిత్తుల సమస్యలతో బాధపడుతున్న రవళిక అనే ప్రైవేట్ స్కూల్ టీచర్ యశోద హాస్పిటల్ లో చికిత్స పొందుతుండడంతో చికిత్స నిమిత్తం డాక్టర్లు సుమారు కోటి యాభై లక్షలు రూపాయలు ఖర్చుయితాయని తెలియ జేసినట్లు ఇట్టి విషయమై మానవతా దృక్పథంతో స్పందించి శామీర్ పేట్ మండలంలోని ప్రవేట్ స్కూల్ మేనేజ్మెంట్ ట్రస్మా వారు (1,00,000) లక్ష రూపాయలను వారి యొక్క కుటుంబ సభ్యులకు అందజేసి మానవతా దృక్పథం చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోనె హనుమంత రెడ్డి ట్రస్మా శామీర్ పేట్ మండల అధ్యక్షులు ధ్యక్షుడు మాధవ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కిష్ట రెడ్డి, కోశాధికారి జ్యోతి, ట్రస్మా సభ్యులు రాజశేఖర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, ముత్తయ్య, శ్రీకాంత్ రెడ్డి, శివశంకర్, వరప్రసాద్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కలుషిత నీరు తాగి 15 మందికి అస్వస్థత



**కల్లూరు, జనవరి 8 (జనంసాక్షి) :** కల్లూరు మండలంలోని రఘునాథ గూడెం గ్రామంలో బుధవారం కలుషిత నీరు తాగి 15 మంది అస్వస్థతకు గురైనారు. గ్రామంలోని బోరు పంపు నుండి నీరు త్రాగగా, 15 మందికి వాంతులు, విరోచనాలు అయ్యాయి, విషయం తెలిసిన వెంటనే చెన్నూరు లోని ప్రభుత్వాసుపత్రి డాక్టర్ తపస్సుమ్ ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించి అస్వస్థతకు గురైన వ్యక్తులకు చికిత్స నిర్వహించారు. మరో రెండు రోజులపాటు రఘునాథగూడెంలోనే వైద్య శిబిరం నిర్వహిస్తామని డాక్టర్ తపస్సుమ్ తెలిపారు. కలుషిత నీరు తాగటం వలన వాంతులు విరోచనాలు అయినాయని, ఎవరికి ఎటువంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు.


## లేడిపై కుక్కల దాడి..

- స్వల్ప గాయాలు



**పెద్దెముల్, జనవరి 8 (జనంసాక్షి) :** లేడిపై కుక్కలు దాడి చేసిన సంఘటన పెద్దెముల్ మండలం తింసాన్ పల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది వివరాలిలా ఉన్నాయి. తింసాన్ పల్లి గ్రామ సమీపంలోని పంటపొలలో అటవీ ప్రాంతంలో నుండి వచ్చిన లేడి పై కుక్కలు దాడి చేస్తుడగా గ్రామస్తులు గమనించి కుక్కలను తరిమివేశారు. గాయపడ్డ లేడి పిల్లను ఒక రూమ్ లో భద్రపరిచారు. అనంతరం గ్రామస్థులు వెటర్నరీ డాక్టర్ శివప్రసాద్ కు, స్థానిక అటవీ శాఖ అధికారులు స్వప్న నాగ సాయికి సమాచారమిచ్చారు. అక్కడికి చేరుకున్న అధికారులు లేడి కి ప్రథమ చికిత్స అనంతరం లేడి అడవిలో వదిలిపెట్టారు. గతంలోనూ పదుల సంఖ్యలో జింకలు కుక్కల దాడిలో ప్రాణాలు కోల్పోయాయి. అటవీ ప్రాంతంలో తరచూ జింకలపై కుక్కలు దాడి చేస్తున్నాయని, జింకల రక్షణకు చర్యలు తీసుకోవాలని అటవీ శాఖ అధికారులకు స్థానికులు విన్నవించారు.

## చైన్స్ స్నాచర్ అరెస్ట్



**కూకట్‌పల్లి, జనవరి 8 (జనంసాక్షి) :** గొలుసు దొంగతనానికి పాల్పడిన ఓ వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించిన సంఘటన కూకట్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏసీబీ శ్రీనివాసరావు విలేకరుల సమావేశంలో నిందితుడి వివరాలను వెల్లడించారు. కృష్ణాజిల్లా పామర్రుకు చెందిన కోటి సాయిరాం(28 ) కెపిహెచ్బి రోడ్ నెంబర్ 5 లోని ఐశ్వర్య మెన్స్ హాస్టల్లో నివాసం ఉంటూ సెక్యూరిటీ గాడుగా పనిచేస్తున్నాడు ఈ నెల నాలుగో తేదీన వివేకానంద నగర్ కాలనీలో మహిళా మెడలో నుంచి ఎనిమిది గ్రాముల బంగారం గొలుసు దొంగలించి పరారయ్యాడు సదరు మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పోలీసుల కళ్ళు కప్పేందుకు నిందితుడు బాలానగర్ వైపు వెళ్లి అక్కడి నుండి కేపిహెచ్బిలోని పలు ప్రాంతాల్లో తిరిగి బాలాజీ నగర్ చేరుకున్నట్లు పోలీసులు తెలిపారు 180 సీసీ కెమెరాలను పరిశీలించి నిందితుని పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఎదురు అవడంతో దొంగతనాలకు పాల్పడుతున్నట్లు నిందితుడు పోలీసులకు విచారణలో తెలిపాడు గతంలో బైక్ దొంగతనాలకు పాల్పడినట్లు పోలీసులు పేర్కొన్నారు నిందితుడి నుంచి ఎనిమిది గ్రాముల బంగారం, బైకు, మొబైల్ స్వాధీనం చేసుకుని బుధవారం రిమాండ్ కు తరలించారు ఈ సమావేశంలో కూకట్పల్లి పల్లి సిఐ ముత్తు, డిఐ వెంకటేశం సిబ్బంది పాల్గొన్నారు.

# సమన్వయంతో శివరాత్రి జాతర ఘనంగా నిర్వహించాలి

- జాతర పనుల అంచనా నివేదికలు అందజేయాలి
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**మేళ్లచెరువు, జనవరి 8 (జనంసాక్షి) :** శివరాత్రి జాతర ఘనంగా నిర్వహించేందుకు పనుల అంచనాలు అందజేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. బుధవారం మేళ్లచెర్వు శివాలయం లో వచ్చే శివరాత్రి జాతర ఏర్పాట్లపై అధికారులతో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శివాలయానికి రావటం, దేవుడు ఆశీసులు తీసుకోవడం అదృష్టంగా భావిస్తానని ప్రజలందరికి ఆయురారోగ్యాలు కల్పించాలని సంతోషంగా జీవించాలని కోరుకుంటూ రాష్ట్ర నీటి పారుదల పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దిశా నిర్దేశం ప్రకారం శివరాత్రి జాతర వైభవంగా నిర్వహించేందుకు ఇప్పటి నుండి ఏర్పాట్లు మొదలుపెట్టి భక్తులకి ఎలాంటి అసౌకర్యం కల్గించకుండా చూసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ముందుగా దేవాదాయ శాఖ అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే శివరాత్రి జాతర కి సుమారుగా 5 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉంది కాబట్టి వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా దైవ దర్శనం అందేలా క్యూ లైన్లు ఏర్పాట్లు చేయాలని, ప్రసాద కౌంటర్లు ఎక్కువగా ఏర్పాటు చేయాలని, ప్లాస్టిక్ రహిత సంచు లలో ప్రసాదం ఇవ్వాలని, దేవాలయం ఆవరణలో సి సి కెమెరా లు ఏర్పాటు, వి ఐ పి లకి ప్రత్యేక దర్శనం కొరకు భక్తులకి ఇబ్బంది లేకుండా ప్రత్యేక లైన్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం లో ఆర్ డి ఓ శ్రీనివాసులు, డి పి ఓ నారాయణ రెడ్డి, ఆర్ అండ్ బి ఈఈ సీతారామయ్య,సి ఐ రజితరెడ్డి, తహసీల్దార్ జ్యోతి, యం పి డి ఓఖాజా ఆజగర్ అలీ ,పంచాయతీ కార్యదర్శి ఫరీద్,కమిటీ చైర్మన్ శంబిరెడ్డి, దేవాలయ ఈ ఓ కొండా రెడ్డి, అధికారులు, దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



# ఓలాకు ఊహించని షాక్..



నిబంధనలు ఉల్లంఘించినట్లు పేర్కొంటూ ప్రముఖ ఎలక్ట్రిక్ స్కూటర్ల తయారీ కంపెనీ ఓలా ఎలక్ట్రిక్ సంస్థకి మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ వార్నింగ్ లెటర్ పంపించింది. ఈ క్రమంలో ఓలా కంపెనీ షేర్లు భారీగా పడిపోతున్నాయి. ఉదయం మార్కెట్లు ఆరంభమైన కొద్ది సమయానికి 5 శాతానికిపైగా నష్టపోయింది.

ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్‌కు ఊహించని షాక్ తగిలింది. నిబంధనలు ఉల్లంఘించినట్లు పేర్కొంటూ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా వార్నింగ్ లెటర్ పంపించింది. నిబంధనలు ఉల్లంఘించినట్లు హెచ్చరిక లేఖ వచ్చిన ట్లు వార్తలు బయటకు రావడంతో ఓలా కంపెనీ షేర్లు భారీగా పడిపోతున్నాయి. ఒక దశలో 5 శాతం మేర క్షీణించాయి. మధ్యాహ్నానికి కాస్త కోలుకుని రూ. 77 వద్ద ట్రేడింగ్ అవుతున్నాయి. వార్నింగ్ లెటర్ వివరాలు తెలుసుకుందాం.

సాధారణంగా ఏ కంపెనీ అయిన అన్ని ప్రణాళికల వివరాలను ముందుగానే ఎక్స్ఛేంజీలకు తెలియజేయాల్సి ఉంటుంది. కానీ ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ సీఈఓ భవీశ్ అగర్వాల్ తన రిటైల్ స్టోర్ల సామర్థ్యాన్ని 4 రెట్లు పెంచుతున్నట్లు సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ముందుగానే వెల్లడించారు. తమ కస్టమర్లకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రస్తుతం 800 ఉన్న స్టోర్ల సంఖ్యను 4000కు పెంచుతున్నట్లు తెలిపారు. ఒకేసారి 3200 స్టోర్లను తెరుస్తున్నట్లు 2024, డిసెంబర్ 2, ఉదయం 9.58 గంటల ప్రాంతంలో ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఆ తర్వాత స్టాక్ ఎక్స్ఛేంజీలకు మధ్యాహ్నం 1.36 గంటల నుంచి 1.41 గంటల సమయంలో అందించినట్లు సెబీ తెలిపింది.

మార్కెట్ రెగ్యులేటర్ నియమాల ప్రకారం స్టాక్ మార్కెట్‌లో లిస్టయిన సంస్థలకు సంబంధించిన అన్ని కార్యక్రమాలు, ప్రణాళికలు ఇతర సమాచారాన్ని ఏ సందర్భాల్లోనైనా బహిర్గతం చేసే ముందే స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలపాల్సి ఉంటుంది. కానీ ఓలా మాత్రం స్టోర్ల ఓపెనింగ్ సమాచారాన్ని మొదట బహిర్గతం చేసి ఆ తర్వాత ఎక్స్ఛేంజీలకు తెలిపిందని సెబీ వార్నింగ్ లెటర్‌లో పేర్కొంది. రెగ్యులేటర్ నిబంధనలు పాటించడంలో ఓలా విఫలమైందని పేర్కొంది. నిబంధనలు ఉల్లంఘనల్ని తీవ్రంగా పరిగణనించి హెచ్చరిక లేఖ జారీ చేసినట్లు తెలిపింది. భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా చూసుకోవాలని హెచ్చరించింది. సెబీ లేఖపై స్పందించిన ఓలా.. హెచ్చరికల కారణంగా ఆర్థికపరమైన చిక్కులేమీ ఉండవని తెలిపింది. ఈ వివరణతో షేర్లు కోలుకున్నాయని చెప్పవచ్చు.

**ఓలా షేరు ధర..**

మధ్యాహ్నం 2 గంటల సమయంలో 1.34 శాతం నష్టంతో రూ.78.10 వద్ద ట్రేడింగ్ అవుతోంది. ఒక దశలో ఇంట్రాడే కనిష్ఠ స్థాయి రూ. 75.16 స్థాయికి పడిపోయింది. ఆ తర్వాత ఓలా ప్రకటనతో కాస్త కోలుకుంది. ఓలా ఆల్ టైమ్ హై స్థాయి రూ. 157 వద్ద ఉండగా.. ఆల్ టైం కనిష్ఠ స్థాయి రూ. 66.66 వద్ద ఉంది.

# కొత్త పన్ను శ్లాబులతో ఇదే బెనిఫిట్..

2024 బడ్జెట్ సమయంలో కేంద్ర ప్రభుత్వం కొన్ని కీలక మార్పులు చేసిన సంగతి తెలిసిందే. పాత పన్ను విధానంలో మాత్రం ఎలాంటి మార్పులు చేయకుండా.. ఇదే సమయంలో కొత్త పన్ను విధానంలో స్టాండర్డ్ డిడక్షన్ పెంచడంతో పాటు టాక్స్ శ్లాబుల్ని కూడా సవరించింది. దీంతో మధ్యతరగతికి కాస్త ఉపశమనం కలిగింది. ఇప్పుడు గరిష్టంగా రూ. 7.75 లక్షల వరకు అస్సలు టాక్స్ ఉండదు. పూర్తి వివరాల్ని చూద్దాం.

2025: భారత్‌లో నిర్దిష్ట ఆదాయం దాటితే పన్ను చెల్లించాలన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం దేశంలో పాత పన్ను విధానం, కొత్త పన్ను విధానం ఉన్నాయి. ఇక కొంత కాలంగా పాత పన్ను విధానంలో అసలు ఎలాంటి మార్పులు చేయట్లేదు కేంద్ర ప్రభుత్వం. త్వరలోనే దీనిని రద్దు చేస్తుందన్న వాదనలు కూడా వినిపిస్తున్నాయి. ఇదే సమయంలో కొత్త పన్ను విధానంలో మాత్రం వరుసగా ప్రతి బడ్జెట్‌లోనూ మార్పులు చేస్తూనే ఉంది. 2024 బడ్జెట్ సమయంలో ఇదే విధంగా కొత్త పన్ను విధానం కింద స్టాండర్డ్ డిడక్షన్ పెంచింది. అంతకుముందు రూ. 50 వేలుగా మాత్రమే ఉండగా.. దీనిని రూ. 75 వేలకు పెంచిన సంగతి తెలిసిందే. పాత పన్ను విధానంలో మాత్రం ఇది రూ. 50 వేలుగానే ఉంది. దీంట్లో మార్పులు చేయలేదు.

కొత్త పన్ను విధానంలో ఇదొక్కటే కాకుండా ఇంకా పన్ను శ్లాబుల్ని కూడా సవరించింది. వేతన జీవులకు, మధ్య తరగతి వారికి ఊరట కలిగించేలా మరింత సరళీకృతం చేసింది. ముఖ్యంగా రూ. 6నుంచి 7 లక్షలు, రూ. 9 నుంచి 10 లక్షల వరకు ఆదాయ బ్రాకెట్లలో ఉండే వారికి ప్రయోజనం చేకూర్చనుంది. ఇందులో కీలక మార్పులు చేసింది.

కనీస పన్ను మినహాయింపు పరిమితి కొత్త పన్ను విధానంలో రూ. 3 లక్షలుగా ఉంది. అంటే రూ. 3 లక్షల వరకు పన్ను చెల్లించాల్సిన పనిలేదు. ఇక గతంలో రూ. 3-6 లక్షల మధ్య పన్ను 5 శాతంగా ఉండగా.. ఇప్పుడు దీనిని రూ. 3-7 లక్షలకు చేర్చారు. ఇంకా రూ. 6 లక్షలపైన ఆదాయం ఉంటే అది 10 శాతం పన్ను పరిధిలోకి వచ్చేది. 2024 బడ్జెట్‌లో మార్పుల నేపథ్యంలో ఇప్పుడు రూ. 7 లక్షల వరకు కూడా 5 శాతం పరిధిలోకే వస్తుంది. ఇంకా రూ. 7-10 లక్షల ఆదాయంపై ఇప్పుడు 10 శాతం పన్ను రేటు ఉంది. గతంలో రూ. 9-12 లక్షలపై 15 శాతం టాక్స్ ఉండేది. ఇప్పుడు 15 శాతం టాక్స్ రూ. 10-12 లక్షలపై వర్తిస్తుంది. ఇక రూ. 12-15 లక్షల ఆదాయంపై 20 శాతం టాక్స్, రూ. 15 లక్షలపై అయితే 30 శాతం పన్ను పడుతుంది.

ఇక కొత్త పన్ను విధానంలో ఇప్పుడు గరిష్టంగా రూ. 7.75 లక్షల వరకు టాక్స్ చెల్లించనక్కర్లేదు. స్టాండర్డ్ డిడక్షన్ రూ. 75 వేలు తీసేస్తే రూ. 7 లక్షలపై టాక్స్ రేట్లు ఎలా ఉంటాయో చూద్దాం. కొత్త పన్ను విధానం కింద రూ. 7 లక్షల వరకు సెక్షన్ 87కింద పన్ను మినహాయింపు ఉన్న సంగతి తెలిసిందే. ఆలోపు ఆదాయం వారు టాక్స్ చెల్లించనక్కర్లేదు. కొత్త పన్ను విధానంలో టాక్స్ రీబేట్ రూ. 25 వేలుగా ఉండగా.. పాత పన్ను విధానంలో రూ. 12,500 గా ఉంది. రూ.



3 లక్షలు ఆదాయం దాటిన వారు టాక్స్ రీబేట్ పొందాలంటే ఐటీఆర్ ఫైల్ చేయాలి.

ఇక్కడ పన్ను లెక్కలు ఎలా ఉంటాయంటే.. ఉదాహరణకు రూ. 7 లక్షల ఆదాయంపై మొదట 0-3 లక్షల వరకు నో టాక్స్ కాబట్టి.. రూ. 3 లక్షలు తీసేయాలి. అప్పుడు ఇంకా రూ. 4 లక్షలు ఉంటుంది. ఇది రూ. 3-7 లక్షల ఆదాయ బ్రాకెట్లోకి వస్తుంది కాబట్టి ఇక్కడ ప్రస్తుతం 5 శాతం పన్ను ఉంది. రూ. 4 లక్షలపై 5 శాతం టాక్స్ అంటే రూ. 20 వేలుగా ఉంటుంది. వాస్తవానికి రూ. 7 లక్షల ఆదాయం ఉంటే ఇంత పన్ను చెల్లించాల్సి ఉంటుంది. కానీ టాక్స్ రిబేట్ రూ. 25 వేలుగా ఉంది కాబట్టి ఇక్కడ పన్ను చెల్లించాల్సిన పని లేదు. త్వరలో బడ్జెట్- 2025లో మరి ఎలాంటి మార్పులు తీసుకుంటారో చూడాలి.




# రూ.25 వేలు పొందే ఛాన్స్!

ఆదాయపు పన్ను శాఖ కీలక ప్రకటన చేసింది. సెక్షన్ 87ఏ ట్యాక్స్ రిబేట్ క్లెయిమ్ చేసుకునేందుకు అవకాశం కల్పిస్తూ ఐటీఆర్ ఫామ్స్ అప్డేట్ చేసినట్లు తెలిపింది. దీని ద్వారా రూ.25 వేల వరకు ట్యాక్స్ రిబేట్ క్లెయిమ్ చేసుకునే అవకాశం లభించినట్లయింది.

ఆదాయపు పన్ను చట్టం 1961లోని సెక్షన్ 87ఏ కింద ట్యాక్స్ రిబేట్ పొందేందుకు అర్హత ఉన్న ట్యాక్స్ పేయర్లకు శుభవార్త అందించింది ఇన్‌కమ్ ట్యాక్స్ విభాగం. ఎవరైతే జులై 5, 2024 తర్వాత ట్యాక్ రిబేట్ క్లెయిమ్ చేసుకునేందుకు అవకాశం కోల్పోయారో వారికి మరో అవకాశం లభించింది. బాంబే హైకోర్టు ఆదేశాల మేరకు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు సీబీటీడీ కీలక నిర్ణయం తీసుకుంది. సెక్షన్ 87ఏ కింద ట్యాక్స్ రిబేట్ క్లెయిమ్ చేసుకునేందుకు జనవరి 15, 2025 వరకు అవకాశం ఇచ్చింది.

ఇప్పుడు ఐటీఆర్ ఫామ్స్ 2, 3లో అప్డేట్ చేసిన ఎక్సెల్ యుటిలిటీలను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీని ద్వారా ఆర్థిక సంవత్సరం 2023-24కు సంబంధించిన సెక్షన్ 87ఏ రిబేట్ కోసం క్లెయిమ్ చేసుకోవచ్చు. అలాగే యుటిలిటీలు సైతం త్వరలోనే అందుబాటులోకి వస్తాయని తెలిపింది. ఈ మేరకు సోమవారమే ఓ ప్రకటన జారీ చేసింది. కొత్త సదుపాయం ప్రకారం ఐటీఆర్ ఎక్సెస్ యుటిలిటీలో మాన్యువల్‌గా ట్యాక్స్ రిబేట్ కాలమ్ ఎడిట్ చేసుకోవచ్చు. ఆ తర్వాత ట్యాక్స్ రిబేట్ క్లెయిమ్ చేసినట్లు వాలిడేట్ చేయాల్సి ఉంటుంది. అర్హత కలిగిన ట్యాక్స్ పేయర్లందరూ సెక్షన్ 87ఏ కింద రిబేట్ క్లెయిమ్ చేసుకోవచ్చు. వారు బిలెటెడ్ ఐటీఆర్ లేదా రివైజ్డ్ ఐటీఆర్ దాఖలు చేయాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ ఇ-ఫైలింగ్ ఐటీఆర్ పోర్టల్ ద్వారా ఫైల్ చేసిన ఐటీఆర్‌ని ప్రాసెస్ చేసేందుకు %ఎమీా% ఆధారిత యుటిలిటీ అనేది బ్యాకెండ్‌లో సాయం చేస్తుందని పన్ను నిపుణులు చెబుతున్నారు. స్వల్ప కాలిక మూలధన లాభాలు వంటి ప్రత్యేక ఆదాయం ఉన్నట్లయితే సెక్షన్ 87ఏ పన్ను రాయితీని క్లెయిమ్ చేసేందుకు ఎక్సెస్ ఐటీఆర్ యుటిలిటీలో రిబేట్ కాలమ్‌ను మాన్యువల్‌గా సవరించడం మాత్రమే పరిష్కారంగా సూచిస్తున్నారు. ఇన్‌కమ్ ట్యాక్స్ విభాగం జనవరి 7వ తేదీన ఐటీఆర్ ఫామ్స్ ఐటీఆర్-2, ఐటీఆర్- 3 అప్డేట్ చేసినట్లు తెలిపింది. అయితే హెచ్‌టీఎంఎల్ యుటిలిటీ అందుబాటులోకి రాకపోవడంతో సెక్షన్ 87ఏ కింద రిబేట్ క్లెయిమ్ చేసుకునేందుకు ఇంకా అనుమతించడం లేదని పలువురు ట్యాక్స్ పేయర్లు ఫిర్యాదులు చేస్తున్నారు. ట్యాక్స్ రిబేట్ క్లెయిమ్ చేసుకునేందుకు జనవరి 15, 2025 వరకే అవకాశం ఉంది. ఇప్పటికే వారం గడిచి పోయిన క్రమంలో మళ్లీ ఆందోళన నెలకొంది. హెచ్‌టీఎంఎల్ యుటిలిటీ అందుబాటులోకి తీసుకురాకపోవడంపై పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

# రత్నాభరణాలపై జీఎస్టీ తగ్గింపు..?

పన్నుల హేతుబద్ధీకరణ సహా వ్యాపారానికి సహకారం అందించేందుకు రుణ లభ్యత పెంచాలని అడిగినట్లు అఖిల భారత రత్నాభరణాల మండలి ఛైర్మన్ రాజేశ్ రోక్డే తెలిపారు. ఈ మేరకు మంగళవారం రోజు ఒక ప్రకటన విడుదల చేశారు. గోల్డ్ రేట్లు ప్రస్తుతం భారీగా పెరుగుతున్నందున.. ప్రస్తుత జీఎస్టీ రేట్లతో పరిశ్రమ, వినియోగదారులపై అధిక భారం పడుతోందని రాజేశ్ అభిప్రాయపడ్డారు. అందుకే రాబోయే బడ్జెట్‌లో ఈ రంగంపై జీఎస్టీని ప్రస్తుతం ఉన్న 3 శాతం నుంచి 1 శాతానికి తగ్గించాలని తాము ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. ఇంకా నిబంధనల పాటింపును ప్రోత్సహించేందుకు కూడా ఇది ఉపకరిస్తుందని చెప్పారు. మరోవైపు జీఎస్టీ పన్ను రేట్ల తగ్గింపు వల్ల గ్రామీణ ప్రాంతాల్లో అధికారిక కొనుగోళ్లు ఇంకా పెరుగుతాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు రోక్డే. ప్రయోగ శాలల్లో అభివృద్ధి చేసిన వజ్రాల పై జీఎస్టీ రేట్లను తగ్గించాలని జీజేసీ కోరింది. ప్రస్తుతం సహజసిద్ధంగా లభించే వజ్రాలకు, ల్యాబ్స్‌లో అభివృద్ధి చేసిన వజ్రాలకు ఒకటే జీఎస్టీ రేటు వర్తిస్తోంది. జువెల్లరీ రంగంకోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను కేటాయించాలని..రాష్ట్రాల వారీగా నోడల్ అధికారుల్ని నియమించాలని కోరింది. ఆభరణాల కొను గోలుకు కూడా ఈఎంఐ అంశాన్ని పరిశీలించాలని కూడా తాము ప్రభుత్వాన్ని కోరినట్లు జీజేసీ వైస్ ఛైర్మన్ అవినాశ్ గుప్తా తెలిపారు.




# హమాస్‌కు ట్రంప్ వార్నింగ్

అక్టోబరు 7, 2023 ఈ తేదీ చెప్పగానే ఇజ్రాయేల్ వెన్నులో వణుకుపుడుతుంది. హమాస్ రాసిన మరణశాసనం వారి కళ్లముందు కదలాడుతుంది. ఈ ఘటనతో యావత్తు ప్రపంచం ఉలిక్కిపడింది. దీనికి ప్రతీకారంగా ఇజ్రాయేల్.. గాజాలోని హమాస్‌పై యుద్ధం ప్రకటించింది. అప్పటి నుంచి హమాస్ స్థావరాలే లక్ష్యంగా భీకర దాడులు కొనసాగిస్తోంది. ఇక, వారి చెరలో బందీలుగా ఉన్నవారిని విడుదల చేయించడానికి అమెరికా సహా పలు దేశాలు ప్రయత్నాలు చేస్తూనే ఉన్న సంగతి తెలిసిందే.

గత 15 నెలలుగా ఇజ్రాయేల్, హమాస్ మధ్య యుద్ధం భీకర పోరాటం కొనసాగుతూనే ఉంది. ఈ క్రమంలో బందీల విడుదల విషయంలో హమాస్‌కు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలు చేశారు. తాను అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టలోగా బందీలను వదలిపెట్టాలని, లేకుంటే మీ అంతుచూస్తానని హెచ్చరించారు. ఫ్లోరిడాలోని తన మార్-ఎ-లాగో ఎస్టేట్‌లో తాజాగా ట్రంప్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ... ఈ వ్యాఖ్యలు చేశారు. ‘అమెరికా అధ్యక్షుడిగా 2025 జనవరి 20న నేను బాధ్యతలు చేపట్టబోతున్నాను.. ఈలోపు బందీలను హమాస్ విడుదల చేయాలి.. అలా జరగని పక్షంలో ఈ దురాగతాలకు పాల్పడేవారికి నరకం చూపిస్తా... చరిత్రలో చూడని పరిణామాలు చవిచూడాల్సి ఉంటుంది.. వెంటనే బందీలను వదలిపెట్టండి’ అని ట్రంప్ వార్నింగ్ ఇచ్చారు.

హమాస్ చెరలో బందీలుగా ఉన్న అమెరికనల్ల విడుదలపై చర్చల గురించి మీడియా అడిగిన ప్రశ్నకు బదులిస్తూ.. గతంలో ఏం జరిగింది అనే దానిపై తాను ఇప్పుడు మాట్లాడదలచుకోలేదని వ్యాఖ్యానించారు. ట్రంప్ ప్రత్యేక “ఏ విధంగానూ ప్రతికూలంగా ఉండాల్సిన అవసరం లేదు... కానీ, అధ్యక్షుడిగా స్థాయికి తగినట్టుగా వ్యవహరించాలి.. నేను బుధవారం దోహాకు వెళ్తున్నాను.. పలు అంశాలపై అక్కడ పురోగతి వస్తుందని ఆశిస్తున్నా.. ఇజ్రాయేల్-హమాస్ మధ్య చర్చలకు నేను విఘాతం కలిగించాలని అనుకోవడం లేదు’ అని పేర్కొన్నారు.

కాగా, బందీల విడుదలపై చర్చలు తుది దశకు చేరుకున్నాయని మధ్య ఆసియాలో అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవెన్ చార్లెస్ విట్కాఫ్ వెల్లడించారు. “చర్చలు చివరి దశకు చేరుకున్నాయి.. మేం ఈ విషయంలో గొప్ప పురోగతి సాధించాం.. డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టే నాటికి దీనిపై మేం శుభవార్త ప్రకటిస్తామని ఆశిస్తున్నాం.. బందీలను హమాస్ ఇప్పటికే విడుదల చేయాల్సి ఉంది. కానీ అలా చేయలేదు.. ఇది వారికి అంత మంచిది కాదు. అక్టోబర్ 7 నాటి దాడులు పునరావృతం కాకూడదు.. ఆ దాడుల్లో అనేకమంది ప్రాణాలు కోల్పోయారు. ఇజ్రాయేల్ నుంచి చాలామంది నాకు ఫోన్ చేసి బందీలని త్వరగా విడిపించాలని వేడుకుంటున్నారు. బందీల్లో అమెరికా పౌరులు కూడా ఉన్నారు’ అని అన్నారు.

కాగా, ఇజ్రాయేల్‌పై ఒత్తిడి తీసుకొచ్చేందుకు హమాస్ వ్యూహాత్మకంగా పావులు కదుపుతోంది. ఆ సంస్థ మిలిటరీ విభాగం అల్ కస్సామ్ బ్రిగేడ్.. తమ వద్ద బందీగా ఉన్న అమెరికన్ ఇజ్రాయేల్ పౌరుడు ఎడాన్ అలెగ్జాండర్ వీడియోను విడుదల చేసింది. ‘నేను గత 420 రోజులుగా హమాస్ చెరలో ఉన్నాను.. భయంతో మేము రోజుకు వెయ్యిసార్లు చస్తున్నాం. మమ్మల్ని త్వరగా విడిపించండి’ అని కన్నీళ్లుపెట్టుకున్నాడు. ఈ నేపథ్యంలో ట్రంప్ హెచ్చరికలు చేయడం గమనార్హం.



# కెనడా ప్రధాని రేసులో భారతీయులు..

**జస్టిన్ ట్రూడో రాజీనామాతో తెరపైకి అనితా, చాహల్**

కెనడా ప్రధానమంత్రి రేసులో భారత సంతతి వ్యక్తులు ఉన్నారు. కెనడాలో అధికారంలో ఉన్న లిబరల్ పార్టీ నాయకత్వంతో పాటు ప్రధాని పదవికి రాజీనామా చేయనున్నట్లు ఇప్పటికే జస్టిన్ ట్రూడో ప్రకటించిన నేపథ్యంలో.. తదుపరి కెనడా ప్రధానమంత్రి ఎవరా అనేది ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కొత్త ప్రధాని వచ్చేవరకు తాను ఆ పదవిలో కొనసాగనున్నట్లు జస్టిన్ ట్రూడో చెప్పిన విషయం తెలిసిందే. ఇంతకీ ఆ భారత సంతతి వ్యక్తులు ఎవరు. వారి బ్యాక్‌గ్రౌండ్ ఏంటో ఈ స్టోరీలో చూద్దాం.

గత కొంత కాలంగా వ్యక్తం అవుతున్న తీవ్ర వ్యతిరేకతను తట్టుకోలేక తాను రాజీనామా చేయనున్నట్లు కెనడా ప్రధానమంత్రి జస్టిన్ ట్రూడో సోమవారం ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే కెనడా ప్రధాని పదవితోపాటు అధికార లిబరల్ పార్టీ నాయకత్వం నుంచి కూడా తప్పుకోనున్నట్లు జస్టిన్ ట్రూడో స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే కెనడాలో రాజకీయాలు హాట్ హాట్‌గా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే కెనడా తదుపరి ప్రధానమంత్రి ఎవరు అవుతారు అనే ఉత్కంఠ ఇప్పుడు తీవ్రం అవుతోంది. అయితే కెనడా తదుపరి ప్రధాని రేసులో భారత సంతతి నేతల పేర్లు వినిపిస్తున్నాయి. అనితా ఆనంద్, జార్జ్ చాహల్ అనే భారత సంతతి వ్యక్తులు కెనడా ప్రధాని పదవి కోసం ముందంజలో ఉన్నట్లు తెలుస్తోంది.



**అనితా ఆనంద్, జార్జ్ చాహల్ అనే భారత సంతతి వ్యక్తులు కెనడా ప్రధాని పదవి కోసం ముందంజలో ఉన్నట్లు తెలుస్తోంది.**

జస్టిన్ ట్రూడో రాజీనామా నేపథ్యంలో ఆయన స్థానంలో ఎవరిని కూర్చోబెట్టాలి అనే పనిలో లిబరల్ పార్టీ నిమగ్నం అయింది. అయితే లిబరల్ పార్టీ నుంచి ప్రముఖంగా కొంతమంది పేర్లు బాగా వినిపిస్తున్నాయి. కెనడా ప్రధాని రేసులో క్రిస్టినా ఫ్రీలాండ్, మార్క్ కార్నీ, డొమినిక్ లీ బ్లాంక్, మెలనీ జోలీ, ఫ్రాంకోయిస్ ఫిలిప్పీ, క్రిస్టీ క్లార్క్‌లకు అవకాశాలు కనిపిస్తున్నాయి. వీరితో పాటు భారత సంతతి వ్యక్తులు అయిన అనిత ఆనంద్, జార్జ్ చాహల్ పేర్లు కూడా వార్తల్లో నిలుస్తున్నాయి.

తమిళ్, పంజాబీ మూలాలు ఉన్న 57 ఏళ్ల అనితా ఆనంద్ ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో చదువుకున్నారు. అనితా ఆనంద్ తండ్రి తమిళనాడుకు చెందిన ఫిజీషియన్ కాగా.. ఆమె తల్లి పంజాబ్‌కు చెందినవారు. 2019లో ఓక్‌విల్లే నుంచి ఆమె ఎంపీగా ఎన్నికయ్యారు. అయితే తొలిసారి ఎంపీగా గెలిచిన వెంటనే జస్టిన్ ట్రూడో కేబినెట్‌లో మంత్రిగా అనితా ఆనంద్‌కు చోటు దక్కడం గమనార్హం. ఇక 2019 నుంచి 2021 వరకు ఆమె పబ్లిక్ సర్వీసెస్ మంత్రిగా పని చేశారు. అనంతరం 2 ఏళ్ల పాటు రక్షణమంత్రిగానూ ఉన్నారు. అయితే అనితా ఆనంద్.. కెనడా రక్షణ శాఖ మంత్రిగా ఉన్న సమయంలోనే ఉక్రెయిన్‌కు ఆర్థిక ప్యాకేజీని ప్రకటించడం గమనార్హం. గత నెలలో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ తర్వాత రవాణా, అంతర్గత వాణిజ్య వ్యవహారాల మంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

# 24 గంటల్లో 20 సార్లు కంపించిన భూమి



టిబెట్‌ను భారీ భూకంపం వణికించిన విషయం తెలిసిందే. టిబెట్-నేపాల్ సరిహద్దుల్లో మంగళవారం ఉదయం భారీ భూకంపం సంభవించింది. ఈ దుర్ఘటనలో 100 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. వందలాది మంది గాయపడ్డారు. నేపాల్, భారత్ సహా చైనాలోనూ భూ ప్రకంపనలు చోటు చేసుకున్నాయి. అనేక ఇళ్లు నేలమట్టమయ్యాయి.

ముందుగా ఉదయం 6:30 గంటలకు 7.1 తీవ్రతతో భారీ భూకంపం సంభవించింది. ఆ తర్వాత రిక్టరు స్కేలుపై 4 తీవ్రతతో పలుమార్లు భూమి కంపించింది. 24 గంటల్లోనే కనీసం 20 సార్లు ప్రకంపనలు నమోదైనట్లు అధికారులు తెలిపారు. కాగా, టిబెట్ ప్రాంతంలో నిత్యం భూ ప్రకంపనలు చోటు చేసుకుంటుంటాయి. గతేడాది కనీసం 3 తీవ్రతతో వందసార్లు భూమి కంపించింది. అయితే, ఈ స్థాయిలో ప్రకంపనలు (7 తీవ్రతతో) రావడం చాలా అరుదు. 20వ శతాబ్దం ప్రారంభం నుంచి కేవలం తొమ్మిది మాత్రే అధిక స్థాయిలో ప్రకంపనలు నమోదైనట్లు తెలిసింది.

ఇక మంగళవారం సంభవించిన భూకంపం ధాటికి భారీగా ఆస్తి, ప్రాణ నష్టం సంభవించింది. ఇప్పటి వరకూ అందిన సమాచారం ప్రకారం.. 126 మంది ప్రాణాలు కోల్పోయారు. 400 మంది గాయపడ్డారు. వాహనాలు, రోడ్లు ధ్వంసమయ్యాయి. అనేక ఇళ్లు నేలమట్టమయ్యాయి. వేలాది మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. ప్రస్తుతం టిబెట్ ప్రాంతంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

# జనాభా తగ్గుదలపై ఎలాన్ మస్క్ ఆందోళన



ప్రపంచ వ్యాప్తంగా జనాభా తగ్గుదలపై అపరకుబేరుడు, టెస్లా బాస్ ఎలాన్ మస్క్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా జనాభా తగ్గుదలపై అపరకుబేరుడు, టెస్లా బాస్ ఎలాన్ మస్క్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచంలోని అత్యంత ముఖ్యమైన సవాళ్లలో ఇది ఒకటిగా పేర్కొన్నారు.

జనాభా క్షీణతకు సంబంధించిన ఓ గ్రాఫ్‌నుటెస్లా ఓనర్స్ సిలికాన్ వ్యాలీ ఎక్స్‌లో పోస్టు చేసింది. ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన భారత్, చైనా సహా నైజీరియా, అమెరికా, ఇండోనేషియా, పాకిస్థాన్ వంటి కీలక దేశాల్లో 2018 నుంచి 2100 మధ్య జనాభాలో ఎలాంటి మార్పులు ఉండనున్నాయనే దాన్ని ఈ గ్రాఫ్‌లో చూపించారు. ముఖ్యంగా భారత్, చైనా దేశాల్లో 2100 నాటికి జనాభా క్షీణత తీవ్రంగా ఉంటుందని ఆ గ్రాఫ్‌లో అంచనా వేశారు. ఈ గ్రాఫ్‌ను పోస్టు చేసిన టెస్లా ఓనర్స్ సిలికాన్ వ్యాలీ.. ‘జనాభా తగ్గుదల మానవాళికి అత్యంత ముప్పు’ అని పేర్కొంది. ఈ ట్వీట్‌ను రీపోస్ట్ చేసిన మస్క్.. ‘అవును’ అని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

# సైబర్ అవగాహన కార్యక్రమ నిర్వహణ

**సైబర్ జాగృత దివస్ సందర్భంగా కరీంనగర్ లోనీ ప్రభుత్వ మహిళ జూనియర్ కళాశాలలో సైబర్ అవగాహన కార్యక్రమ నిర్వహణ**

**కరీంనగర్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ. ఏసీపీ నర్సింహారెడ్డి.**





**కరీంనగర్ బ్యూరో, జనవరి 08 (జనం సాక్షి) :**

సైబర్ జాగృత దివస్ సందర్భంగా కరీంనగర్ లోని స్థానిక సవరన్ స్ట్రీట్ లో గల ప్రభుత్వ మహిళ జూనియర్ కళాశాలలో బుధవారం రోజు సైబర్ నేరాల నివారణ కొరకు అవగాహన కార్యక్రమం నిర్వహించామని కరీంనగర్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్. ఓ. ఏసీపీ నర్సింహారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ... ప్రస్తుత సమాజంలో రోజురోజుకీ సైబర్ నేరాలు పెరుగుతున్నందున వాటి కట్టడికి సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసగించుటకు అవలంబిస్తున్న మోసపూరిత పద్దతులపై ప్రజలు ఎప్పటికప్పుడు అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని తెలిపారు. తద్వారా సైబర్ నేరాల భారిన పడకుండా ఉండేలా స్వీయ రక్షణ పొందవచ్చన్నారు. సైబర్ నేరగాళ్లు ఎప్పటికపుడు వారి నేరం చేసే విధానం మార్చుతూ ప్రజలను మోసం చేస్తూ ఖాతాల్లో వుండే డబ్బును చోరీ చేసుతున్నారన్నారు. బాధితుల్లో ఎక్కువగా అవగాహన లేక వ్యక్తిగత సమాచారం అందించి మోసపోయిన వారే ఉన్నారన్నారు. వాటిల్లో కొన్ని సమావేశంలో వివరించామన్నారు. మీ పేరు పైన పార్సల్ వచ్చిందని, ఆ పార్సల్లో డ్రగ్స్ ఉన్నాయని, టి ఆర్ ఏ ఐ (ట్రాయ్) నుంచి ఫోన్ చేస్తున్నామనీ మీ సిమ్ కార్డ్ పైన టెర్రరిస్ట్ యాక్టివిటీస్, కేసులు నమోదైనవని మిమ్మల్ని అరెస్టు చేస్తున్నామనీ మీరు మాతో వీడియో కాల్ లో ఉండాలని పోలీస్ ఉన్నతాధికారుల లాగా యూనిఫాం ధరించి అక్కడే ఒక కోర్టు లాంటి సెటప్ చూపిస్తూ మిమ్మల్ని భయభ్రాంతులకు గురిచేసి డిజిటల్ అరెస్టు చేస్తున్నామని మోసం చేస్తున్నారు. చట్టాన్ని అమలు చేస్తున్నటువంటి ఏ సంస్థలు కూడా వాట్సాప్ కాల్ , స్కైప్ లాంటి సోషల్ మీడియా సాధనల ద్వారా వీడియో కాల్ చేస్తూ మిమ్మల్ని అరెస్ట్ చేస్తున్నామనీ తెలపవని అటువంటి కాల్స్ వస్తే మోసపూరితవిగా గుర్తించి వాటిని నమ్మకూడదనీ డిజిటల్ అరెస్ట్ పేరుతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని, డిజిటల్ అరెస్ట్ వంటివి లేవని ఏసీపీ తెలిపారు.

రివ్యూ రేటింగ్, ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్, బెట్టింగ్ ఫ్రాడ్ లాంటి మోసాలకు సైబర్ నేరగాలు పాల్పడుతున్నారని, బ్యాంక్ అధికారులు అంటూ ఫోన్ చేస్తూ ఓటిపిలు అడిగిన, మొబైల్ ఫోన్ లోకి వస్తున్నటువంటి ఎపికె ఫైల్స్ లను క్లిక్ చేయవద్దని సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.

సోషల్ మీడియా సాధనాలు అయినటువంటి ఇన్స్టాగ్రాం,ఫేస్బుక్, స్నాప్ చాట్ లాంటి సాధనలో ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు సందేశాలు పంపించినట్లయితే వాటికి స్పందించవద్దని, మీ స్నేహితుల పేరుతో ఫొటోస్ పెట్టి డబ్బులు అడిగితే వెంటనే పంపించకూడదని, నిర్ధారించుకున్న తర్వాతనే వారికి రెస్పాండ్ కావాలని తెలిపారు.

# షాదీఖానలు, ఖబ్రస్తాన్లు, కమిటీ హాల్లు, ఈద్గాల ఏర్పాటు, పునర్నిర్మాణం చెయ్యాలి

**నియోజకవర్గ సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లిన మైనారిటీ నాయకులు**

**కరీంనగర్ బ్యూరో, జనవరి 08 (జనం సాక్షి) :**



కరీంనగర్ జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షులు తాజోద్దీన్, ఎండి షబ్బీర్ ల ఆధ్వర్యంలో చొప్పదండి నియోజకవర్గంలోని ఆరు మండలాల మైనారిటీ సెల్ అధ్యక్షులతో కలిసి నియోజకవర్గం లోని కమిటీ హాల్లు , షాదీఖానాల నిర్మాణం, శిదిలావస్తాలో ఉన్న భవనాలను పునర్నిర్మించాలని చొప్పదండి శాసనసభ్యులు డా. మెడిపెల్లి సత్యం దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. గంగాధర మండల కేంద్రంలో షాదీఖానా, కమిటీ హాల్ ఏర్పాటు, చొప్పదండి లో కమిటీ హాల్ ఏర్పాటు, షాధిఖాన పునర్నిర్మాణం, మల్యాల మండల కేంద్రంలో కమిటీ హాల్ ఏర్పాటు, షాదిఖానా పునర్నిర్మాణం, కబ్రస్తాన్ ప్రహరీ గోడ నిర్మాణం, ఈద్గా ప్రహరీ గోడ నిర్మాణం, బోయినపల్లి మండల కేంద్రంలో కమిటీ హాల్ ఏర్పాటు, షాదిఖానా ఏర్పాటు, రామడుగు మండల కేంద్రంలో అసంపూర్ణంగా ఉన్న కమిటీ హాల్ పూర్తి చెయ్యాలి, షాదిఖానా పునర్నిర్మాణం, నమిలికొండ మస్జిద్ ఏ అక్షా అనుకుని ఉన్న ఈద్గా నిర్మాణంకోసం నిధులు, కమిటి హాల్ నిర్మాణం, గురించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ని జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ చైర్మన్ ఎండి తాజుద్దీన్ ఆరు మండలాల మైనారిటీ సెల్ అధ్యక్షులు,తెలంగాణ రాష్ట్ర సంచార ముస్లిం తెగల సంఘం స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండి షబ్బీర్, కోశాధికారి ఎండి షాదుల్లా, జిల్లా అధ్యక్షులు ఎండి దావూద్, సోహల్ ఎమ్మెల్యే ని ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా మైనారిటీ చైర్మన్ తాజుద్దీన్ తెలంగాణ రాష్ట్ర సంచార ముస్లిం తెగల సంఘం స్థాపకులు, స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండి షబ్బీర్, కోశాధికారి ఎండి షాధుల్లా, కరీంనగర్ జిల్లా అధ్యక్షులు ఎండి దావూద్, ఉపాధ్యక్షులు సోహెల్, సెక్రటరీ అజ్మత్, రామడుగు మైనారిటీ మండల అధ్యక్షులు ఆసిఫ్, గంగాధర మండలమైనారిటీ అధ్యక్షులు ఎండి షాదుల్లా, చొప్పదండి మైనారిటీ మండల అధ్యక్షులు జహంగీర్, ఉపాధ్యక్షులు రజాక్ మల్యాల మైనారిటీ మండల అధ్యక్షులు సంశుద్దీన్, బోయినపల్లి మైనారిటీ మండల అధ్యక్షులు రఫిక్ తదితరులు పాల్గొన్నారు.

# జానపద కళలను ప్రోత్సహించాలి

**జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి.**

**కరీంనగర్ బ్యూరో, జనవరి 08 (జనం సాక్షి) :**



జానపద కళలను ప్రోత్సహించాలని, అందుకు భవిష్యత్తు తరాలు ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కరీంనగర్ ఫోక్ ఆర్ట్స్ అకాడమీ 41వ వార్షికోత్సవ వేడుకలు కళాభారతిలో బుధవారం జరిగాయి. ఈ కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, యేండ్ల తరబడి కళాకారులుగా ఉన్నవారు తమకున్న అపార అనుభవంతో భవిష్యత్తు తరాలకు కళను నేర్పించాలని అన్నారు. కళారంగంలో భవిష్యత్తు తరాలను తయారు చేయాలని ఇందుకు యువత ముందుకు రావాలని సూచించారు. ప్రజలు కళలను ఆదరించాలని, జానపదాన్ని కాపాడాలని ఆకాంక్షించారు. విద్యార్థులు జానపద కళలను వీక్షించేలా చూడాలని సూచించారు. మేయర్ సునీల్ రావు మాట్లాడుతూ, జానపదం జీవించి ఉండాలంటే కొత్త తరం రావాలని ఆకాంక్షించారు. మిద్దె రాములు వంటి కళాకారులను తయారు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో ప్రాముఖ్యం ఉన్న కళలను ప్రోత్సహించాలన్నారు. కళాకారులు కళాభిమానంతో తమ సర్వస్వాన్ని ధారపోస్తారని తెలిపారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామాల్లో ప్రజలను చైతన్యపరిచేది కళాకారులేనని కళాకారులకు పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లలో ప్రాముఖ్యత ఇస్తున్నామని తెలిపారు. అనంతరం జానపద వృత్తిలో రాణించిన వారికి కళాజ్యోతి జీవిత సాఫల్య పురస్కారం, యువ పురస్కారాలు, బాల పురస్కారాలు ప్రదానం చేశారు. పలు ప్రాంతాల నుండి హాజరైన కళాకారులు తమ ప్రదర్శనలతో ఆహూతులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ నాటక సమాఖ్య అధ్యక్షులు సదానందం, తెలంగాణ జానపద వృత్తి కళాకారుల సమాఖ్య అధ్యక్షులు కృపాదానం, తాడూరి కరుణాకర్, వంగ సురేందర్ పాల్గొన్నారు.

# మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం



**స్వయం సహాయక సంఘాల ద్వారా 1000 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి త్వరలో టెండర్లు ఖరారు చేస్తాం**

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి జనవరి 8 (జనం సాక్షి)**



స్వయం సహాయక సంఘాల ద్వారా సోలార్ పవర్ ప్లాంట్ ల ఏర్పాటు ప్రగతిపై జిల్లా కలెక్టర్లతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజా ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుందని, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా సోలార్ పవర్ ప్లాంట్ లు ఏర్పాటుచేసి 1000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ఇప్పటికే ఇంధన శాఖ, గ్రామీణ అభివృద్ధి శాఖ ల ఒప్పందం కుదిరిన నేపథ్యంలో జిల్లాల వారీగా ప్రగతిని బుధవారం ఉదయం ప్రజాభవన్ లో మంత్రులు సీతక్క, కొండా సురేఖలతో కలిసి డిప్యూటీ సీఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మహిళలు ఆర్థిక సాధికారత సాధిస్తేనే వారి ఎదుగుదలకు అవకాశాలు ఏర్పడతాయని డిప్యూటీ సీఎం తెలిపారు. అందుకుగాను అంది వస్తున్న కొత్త విద్యుత్ పాలసీ, ఇంధన, గ్రామీణ అభివృద్ధి శాఖల మధ్య గత సంవత్సరం నవంబర్ 19న కుదిరిన ఒప్పందాన్ని జిల్లా కలెక్టర్లు ఉపయోగించుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. ఐదు సంవత్సరాల కాలంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలని ఇందిరమ్మ ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ, కామారెడ్డి జిల్లాలో 44 ఎకరాలు రెండు ప్రాంతాల్లో గుర్తించామని, మిగతా భూములు ఈ నెల 20 లోగా గుర్తిస్తామని తెలిపారు. కాన్ఫరెన్స్ లో కామారెడ్డి జిల్లా అటవీ అధికారిణి నిఖిత, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ట్రాన్స్కో ఎస్.ఈ. ఎన్.శ్రావణ్ కుమార్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారిణి రజిత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎగుమతి కార్యాచరణ ప్రణాళికలపై వ్యవస్థాపక అవగాహన






**కామారెడ్డి జిల్లా ప్రతినిధి జనవరి 8 (జనం సాక్షి)**

ఎగుమతి కార్యాచరణ ప్రణాళిక పై వ్యవస్థాపక అవగాహనకార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవస్థాపక ప్రణాళికలపై ఒకరోజు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎగుమతులు చేసే వాటిపై అనుమానాలు, సలహాలు, సూచనలు అందించడానికి వివిధ విభాగాల వాటాదారులతో ఈ అవగాహన కార్యక్రమంలో చర్చించారని, సమస్యలను దశలవారీగా నివృత్తి చేయడం జరుగుతుందని అన్నారు. ఈ అవగాహన కార్యక్రమం జిల్లాలోని వ్యాపార వేత్తలకు ఉపయోగకరంగా ఉంటుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలో అత్యధికంగా సాగవుతున్న వరి ధాన్యం నాణ్యత ప్రమాణాలు కలిగి వున్న వాటిని ఎగుమతులు చేసుకోవచ్చని సూచించారు. జిల్లా నుండి ఎగుమతులను నిరోధించే పలు అడ్డంకులను వాటాదారులతో చర్చించారు. ఈ అవగాహన సదస్సులో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్, అపెడ, టీఎస్ఐఐసి, పలు సంస్థల ప్రతినిధులు ఈ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ లాలు నాయక్, జిల్లా నుండి జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్, జిల్లా మత్స్య శాఖాధికారి శ్రీపతి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా మార్కెటింగ్ అధికారిణి రమ్య, ఎల్.డి.ఏం.రవికాంత్, జిల్లాలోని పలువురు వ్యాపార వేత్తలు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# మల్టీపర్పస్ పార్కు పనులు పరిశీలించిన సుడా చైర్మన్



**కరీంనగర్ బ్యూరో, జనవరి 08 (జనం సాక్షి) :**

స్మార్ట్ సిటీ పనులలో భాగంగా కేంద్ర ప్రభుత్వ వాటా, రాష్ట్ర ప్రభుత్వ వాటా ధనం దాదాపు పదకొండు కోట్లతో పనులు చేపట్టిన మల్టీ పర్పస్ పార్కు పనులను సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి కార్పొరేటర్లతో కలిసి పరిశీలించారు. నాణ్యతలో లోపాలున్నాయని ఇంకా అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్ కు అధికారులకు సూచించారు. ఎవరి ఒత్తిడి ఉన్నప్పటికీ నాణ్యత ప్రమాణాలు పాటించాల్సిన అవసరం ఉందని గతంలో చేసిన పొరపాట్లు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వంలో నడువదని చూస్తూ ఊరుకోమని కాంట్రాక్టర్ ను అధికారులను హెచ్చరించారు. హంపి తియెటర్ వెనక వారసత్వ కట్టడం మల్టీ పర్పస్ పాఠశాల దెబ్బతిని ఉందని దాన్ని కొంత తీర్చి దిద్దాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సుడా చైర్మన్ వెంట కార్పోరేటర్లు చాడగొండ బుచ్చిరెడ్డి, భూమాగౌడ్, సరిల్ల ప్రసాద్ నాయకులు ఎండి తాజ్, ఆర్ష మల్లేశం, కాశెట్టి శ్రీనివాస్, మెండి చంద్రశేఖర్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, పెద్దిగారి తిరుపతి, కుర్ర పోచయ్య, దన్న సింగ్, జక్కుల మల్లేశం, జీడి రమేష్ , మీరాజ్, బషీర్, సుదర్శన్, ఎల్లారెడ్డి సత్యనారాయణ రెడ్డి, ఈఈ స్మార్ట్ సిటీ ఏఈ తదితరులు పాల్గొన్నారు.

**నాణ్యతలో లోపాలున్నాయి ఇప్పటికైనా సరిదిద్దాలి.**
**హెరిటేజ్ భవనం మల్టీ పర్పస్ పాఠశాలను కాపాడాలి.**
**కాంట్రాక్టర్ , అధికారులకు పలు సూచనలు చేసిన సుడా చైర్మన్.**

# గురుకులాలు సద్వినియోగం చేసుకోవాలి

**మంథని, (జనంసాక్షి) :**



గురుకులాలను సద్వినియోగం చేసుకోగలరని మంథని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనాథ్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంచే ప్రతిష్టాత్మకంగా నిర్వహించబడుతున్న గురుకులాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ఉమ్మడి గురుకులాల 5వ తరగతి ప్రవేశ పరీక్షకు అర్హత కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోగలరని ఆయన కోరారు. ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు ఎస్సీ ఎస్టీ బీసీ జనరల్ గురుకులాలలో 5వ తరగతి ప్రవేశ పరీక్షకు, ఎస్సీ, ఎస్టీ గురుకులాల్లో 6 నుండి 9 తరగతిలో ఖాళీల కొరకు ప్రవేశానికి, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ గౌలిదొడ్డి, అలుగునూరు సిఓఈలో 9వ తరగతి ప్రవేశానికి, తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ ఖమ్మం, పరిగి ఎస్ఓఈలో ఎనిమిదో తరగతి ప్రవేశానికి, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రుక్మాపూర్ సైనిక్ స్కూల్, మల్కాజ్ గిరి ఫైన్ ఆర్ట్ స్కూల్ లో ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అయన పేర్కొన్నారు. విద్యార్థులు ఫిబ్రవరి 01 లోపు దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు చేసుకోవడానికి విద్యార్థి కులం సర్టిఫికెట్ నెంబర్, ఆదాయం సర్టిఫికెట్ నెంబర్, ఆధార్ కార్డు నెంబర్, బర్త్ సర్టిఫికెట్, స్టడీ సర్టిఫికెట్, ఫోటో లతో ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోగలరని ఆయన సూచించారు. ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 23వ తేదీన ఉంటుందని ఆయన గుర్తు చేశారు. గురుకులాలను సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆయన తెలిపారు.

# పల్లెలు దావఖాన నిర్మించాలి

## అధికారులపై గ్రామస్తులు ఆగ్రహం

**గాంధారి జనవరి జనం సాక్షి**



పల్లె దావఖాన నిర్మించాలి. గ్రామంలో పల్లె దావఖాన నిధులు మంజూరైన నిర్మాణం చేపట్టకపోవడంతో అధికారుల పై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కామారెడ్డి జిల్లా సదాశివ నగర్ మండల్ భూంపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ హై స్కూల్ లో ఉన్న స్పోర్ట్స్ రూంలో పల్లె దవఖానా ఉంది పాఠశాలలో స్పోర్ట్స్ రూమ్ పల్లె దావఖాన కు వాడుకుంటున్నారని అంతేకాకుండా భూంపల్లి గ్రామంలో పల్లె దవఖాన నిధులు మంజూరయ్యాయని గ్రామస్తులు పేర్కొన్నారు. కానీ ఆ నిధులు ఎక్కడ ఉన్నాయో ఎవరికీ తెలియని అయోమయంలో గ్రామస్తులు అన్నారు. గత ప్రభుత్వం ఆయాంలో నిధులు మంజూరైన అధికారులు చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భూంపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ స్పోర్ట్స్ రూంలో పల్లె దావఖాన్ ఉన్నది. కానీ అది విద్యార్థులకు స్పోర్ట్స్ రూమ్ అవసర పడుతుందని ఉపాధ్యాయులు అంటున్నారు. ఇందులో ఫర్నిచర్ కూడా పట్టడం లేదని హెల్త్ డిపార్ట్మెంట్ వాళ్లు అంటున్నారు. అధికారులు స్పందించి భూంపల్లి గ్రామంలో పల్లె దావఖాన నిర్మించాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు. అంతేకాకుండా ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ స్పందించి భూంపల్లి లో హెల్త్ సబ్ సెంటర్ నిర్మించాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు. గ్రామంలో విష జ్వరాలతో చిన్నారులు చనిపోవడం వారికి సరపడా ఫర్నిచర్ లేకపోవడంతో ఇబ్బంది అవుతుందని హెల్త్ డిపార్ట్మెంట్ వాళ్ళు అంటున్నారు.

# అటవీ శాఖ కబ్జాలో ఉన్న ప్రభుత్వ భూములను వెనక్కి తీసుకోవాలి

**నూగూర్ వెంకటాపురం, జనవరి 9 (జనంసాక్షి):**



షెడ్యూల్ ప్రాంత భూములను రక్షించడంలో రెవిన్యూ శాఖలు పూర్తిగా విఫలం అయ్యాయని ఆదివాసీ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆరోపించారు . ప్రభుత్వ భూములన్నీ అటవీ శాఖా ఒక వైపు ఆక్రమిస్తూ ఉంటే, మరో ప్రక్క వలస గిరిజనేతరులు ఆక్రమించు కుంటున్నారని పేర్కొన్నారు. ఏ జే ఏ సి తరుపున ఎన్నో రోజులుగా రెవిన్యూ, అటవీ శాఖల జాయింట్ సర్వే నిర్వహించాలని కోరగా ఎట్టకేలకు బుధవారం తూ తూ మంత్రంగా సర్వే నెంబర్ 27 లో సర్వే నిర్వహించినారని ఉయిక శంకర్, కొర్స నర్సింహా మూర్తి, పూనెం సాయి తెలిపారు. వందలాది ఎకరాల ప్రభుత్వ భూములను అటవీ శాఖా తమ ఇష్టాను సారంగా ఆక్రమించారని మండిపడ్డారు. వెంకటాపురం మండలానికి ఇంటిగ్రెటెడ్ పాఠశాల, గిరిజన గురుకులం, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు వస్తే మండల కేంద్రంలో ఎక్కడ భూమి లేదని తహసీల్దార్ చెప్పడం సిగ్గు చేటు అన్నారు. అక్రమంగా అటవీ శాఖా, వలస గిరిజనేతరుల కబ్జాలో ఉన్న ప్రభుత్వ భూములను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములు లేవని గిరిజన గురుకుల పాఠశాలను వాజేడు మండలానికి తరలించడంపైన ఏ జే ఏ సి నాయకులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. గిరిజన ప్రాంతంలో గిరిజనుల విద్యాభివృద్ధి కోసం వచ్చిన గిరిజన గురుకులానికి స్థలం లేదనడం ఏమిటని తహసీల్దార్ ని ప్రశ్నించారు. గిరిజనులను విద్యకి దూరం చేసే కుట్ర జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అటవీ శాఖా అధికారులు ప్రభుత్వ భూమిని కబ్జా చేసి మా భూమి అని బెదిరింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్ట్ ఏ, పార్ట్ బి లు ఉత్తరం వైపున్న రిజర్వ్డ్ ఫారెస్ట్ అన్నారు. ఇది మాత్రమే గెజిట్ అయిందన్నారు. ఆ గెజిట్ రికార్డ్స్ తెచ్చి దక్షణం వైపున్న ప్రభుత్వ భూమికి సంబంధించింది అని అటవీ శాఖా అధికారులు బుక్కాయిస్తూ ఉన్నారని అన్నారు. షెడ్యూల్డ్ ప్రాంత చట్టాలకు విరుద్ధంగా 27 సర్వే నెంబర్ భూమిని కబ్జా చేసినట్టు తెలిపారు. అటవీ శాఖా అక్రమణలో ఉన్న ప్రభుత్వ భూములను తక్షణమే వెనక్కి ఇవ్వకపోతే ప్రత్యక్ష పోరాటాలకు సిద్ధం అవుతామని ఏజేఏసి నాయకులు హెచ్చరించారు. కొమరం భీమ్ కాలనీ ఆదివాసీల భూములను తీసుకోవాలని చూస్తే చూస్తూ ఊరుకో బోమని అన్నారు. ఈ సమావేశం లో జి ఎస్పీ కార్యనిర్వాహన జిల్లా అధ్యక్షులు పూనెం ప్రతాప్, ఏ ఎన్ ఎస్ మండల ఉపాధ్యక్షులు కుంజ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# నూతన కార్పొరేట్ వ్యవసాయ విధానాన్ని వ్యతిరేకించండి



**నర్సంపేట, జనవరి 8 (జనంసాక్షి)**

కనీస మద్దతు ధర హక్కు చట్టం చేయాలని జాతీయ రైతు సంఘం సంఘం నాయకులు జగ్జీత్ సింగ్ దల్లెవాలే 44 రోజులుగా నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోనందున నిరసనగా బుధవారం ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేయాలని అఖిలభారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ జాతీయ కమిటీ పిలుపునిచ్చింది. ఈ పిలుపులో భాగంగా నర్సంపేట పట్టణం అంబేద్కర్ సెంటర్లో ఏఐకేఎంఎస్ నాయకులు, కార్యకర్తలు దిష్టిబొమ్మను దగ్ధం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రాచర్ల బాలరాజు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం గతంలో తీసుకువచ్చిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలు రద్దు చేయాలని దేశవ్యాప్తంగా సంయుక్త కిసాన్ మోర్చా ఎస్ కేయం ఆధ్వర్యంలో ఆందోళన చేయగా ప్రభుత్వం వాటిని పసంహరించుకుని మూడు సంవత్సరాలు దాటింది. ఇదే సందర్భంలో మోడీ రైతులకు క్షమాపణ చెబుతూ కనీసం మద్దతు ద్వారా హక్కు చట్టం చేస్తామని ప్రకటించారు. కానీ ఇప్పటివరకు

దాని ఊసేత్తలేదు. పైగా మోడీ ప్రభుత్వం మరొక రూపంలో కార్పొరేట్ అనుకూల నూతన వ్యవసాయ విధానాన్ని తీసుకొస్తుంది. మద్దతు ధర హక్కు చట్టం కోసం పంజాబ్లో గత రెండు నెలలుగా రైతులు ఉద్యమాలు చేస్తుంటే అక్రమ కేసులు బనాయించి జైల్లో పెడుతున్నారు.ప్రభుత్వం ఇదే విధానాలు కొనసాగిస్తే మళ్లీ దేశవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమం చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గట్టి కృష్ణ పి వై ఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలకంటి రాజేందర్, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి పూలక్క పిడిఎస్ యు రాష్ట్ర సహాయ కార్యదర్శి అజయ్. పి వై ఎల్ జిల్లా అధ్యక్షులు వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తాం

**దివాలాకోరు రాజకీయాలు మాని అభివృద్ధికి సహకరించాలి**

**స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి**

**రిజర్వాయర్ నుండి సాగునీరు విడుదల**

**స్టేషన్ ఘన్పూర్, జనవరి 08 , (జనం సాక్షి) :**



నియోజకవర్గంలోని చివరి ఆయకట్టువరకు సాగునీరు అందిస్తామని, కొందరు నాయకులు దివాలాకోరు రాజ కీయాలు మాని అభివృద్ధికి సహకరించాలని మాజీ ఉపముఖ్యమంత్రి,ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు.మండల కేంద్రంలోని రిజర్వాయర్ నుండి కుడి కెనాల్ కు ఎమ్మెల్యే కడియం శ్రీహరి బుధవారం సాగు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ సంవత్సరంలోపు దేవాదుల ప్రధాన కాలువలు, పిల్ల కాలువలు మరమ్మత్తు చేయించి 1 లక్ష 50 వేల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా కృషి చేస్తానని అన్నారు. రైతుల పంట పొలాలకు సాగునీరు అందించడం కోసం నీటిపారుదల శాఖ అధికారులతో పలుమార్లు సమీక్ష సమావేశాలు నిర్వహించడం జరిగిందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భారీ నీటి పారుదల శాఖ మంత్రిగా ఉండి 2003 లో దేవాదుల ఎత్తిపోతల పథకం కింద నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. దాని ఫలితంగానే ఈరోజు గ్రామాలకు దేవాదుల ద్వారా సాగునీరు అందుతుంద న్నారు. ప్రతి గ్రామానికి దేవాదుల ద్వారా గోదావరి జలాలు తీసుకురావడమే లక్ష్యంగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్ పర్సన్ జూలుకుంట్ల లావణ్య శిరీష్ రెడ్డి, వైస్ చైర్మన్ నూకల ఐలయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జూలు కుంట్ల శిరీష్ రెడ్డి, నాయకులు చింతకుంట్ల నరేందర్ రెడ్డి, బెలిదే వెంకన్న, పోగుల సారంగపాణి, సింగపురం వెంకటయ్య, నీల గట్టయ్య, బూర్ల శంకర్, కొలిపాక సతీష్, రమేష్ బాలరాజు, రమేష్ నాయక్,జీడి రమేష్, తెల్లాకుల రామకృష్ణ, పల్లె రవి, సోమయ్య, ప్రసాద్, గోనెల రాజయ్య, పెసరు సారయ్య, నీల సోమన్న, మంద రాజు, సమ్మయ్య, తాహసిల్దార్ వెంకటేశ్వర్లు, ఆర్ఐ శ్రీకాంత్ ,వివిధశాఖల అధికారులు,పాల్గొన్నారు

# పార్కింగ్ లేక రోడ్డుకు ఇరువైపులా పత్తి వాహనాలు

**సారంగాపూర్, డిసెంబర్ 8 (జనంసాక్షి)**





నిర్మల్ నుండి స్వర్ణ మహారాష్ట్ర వెళ్లే రహదారిని ఆనుకొని ఉన్న సారంగాపూర్ జిన్నింగ్ మిల్ కు పార్కింగ్ ప్లేస్ లేకపోవడంతో రోడ్డుకు ఇరువైపులా ఉంచిన పత్తి వాహనాలు రహదారి వెంట ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సరైన సదుపాయాలు కల్పించి జిన్నింగ్ మిల్ నడపాలని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు అంతేకాకుండా మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతం కావడంతో తెలంగాణ రైతుల పేరిట మహారాష్ట్ర పత్తిని విక్రయిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వందల క్వింటాళ్ల పత్తి మహారాష్ట్ర తెలంగాణ జిన్నింగ్ మిల్లులలో కొనుగోలు చేస్తే తెలంగాణ రైతాంగంనష్టపోతున్నామని విచారణ వ్యక్తం చేస్తున్నారు ఇప్పటికైనా జిల్లాలోని పత్తి కొనుగోళ్ల విజిలెన్స్ అధికారులు పత్తి విక్రయాలపై దృష్టి సారించాలని రైతులు వేడుకుంటున్నారు.

# సొంత వాహనానికి సర్కారీ సొమ్ము

**బిల్లుల పేరిట ఏటా లక్షల్లో స్వాహా**

**గజిటెడ్ అధికారుల కక్కుర్తి**

**బెల్లంపల్లి, జనవరి 8 (జనంసాక్షి)**






సొంత వాహనాలను ప్రైవేట్ వాహనాలుగా చూపిస్తూ ప్రతినెలా అక్షరాలా 33 వేల రూపాయలు అక్రమంగా పొందుతున్నారు. ఏడాదికి మూడు లక్షల తొంబై ఆరు వేల రూపాయల ప్రభుత్వం ఖజానాకు గండి పెడుతున్నారు. తహసీల్దార్లకు, ఎంపీడీఓలకు విధులు నిర్వహించడానికి, సకాలంలో ప్రజలను కలవడానికి, ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడానికి ప్రభుత్వం ప్రతి నెల వాహనం బిల్లు ముప్పై మూడు వేల రూపాయలు చెల్లిస్తుంది. వాస్తవానికి నిరుద్యోగ యువకులకు ఉపాధి లభిస్తుందనే ఉద్దేశంతో ప్రభుత్వం అధికారులకు వాహన సౌకర్యం కల్పిస్తుంది. కాగా దీన్ని ఆసరా చేసుకున్న కొందరు అధికారులు తమ స్వంత వాహనాలను వాడుకుంటూ దర్జాగా, ప్రైవేట్ వాహనాల వివరాలు సమర్పించిన ప్రతినెలా ముప్పై మూడు వేల రూపాయలు బిల్లులు చేసుకొని ప్రభుత్వాన్ని మోసం చేసి డబ్బులు పొందుతున్నారు.

**ఇవీ నిబంధనలు..**

ప్రభుత్వ అధికారులు వాడే వాహనాలు అద్దె వాహనాలు అయి ఉండాలి. వాటికి మాత్రమే బిల్లుల చెల్లింపులు జరుగుతాయి. టాక్స్ ప్లేట్ వాహనం. బ్యాడ్జి లైసెన్స్ కలిగిన డ్రైవర్ ఉండాలనే నిబంధన సైతం ఉంది. ఇలాంటి నిబంధనలు ఉండటం వల్ల వాహన యజమాని కుటుంబం, డ్రైవర్ కుటుంబం ఇలా రెండు కుటుంబాలు ఉపాధి పొందుతాయి. ప్రభుత్వ ఆలోచన ఇలా ఉంటే కొందరు అధికారులు మాత్రం స్వంత వాహనాలనే వాడుతూ, బిల్లుల్లో మాత్రం ప్రైవేట్ వాహనం వాడుతున్నామని, నకిలీ వాహన పత్రాలు, అలాగే డ్రైవర్ వివరాలను పొందు పరుస్తూ బిల్లులు చేసుకొని అటు ప్రభుత్వాన్ని మోసం చేస్తూ, ఇటు నిరుద్యోగ యువతకు మోసం ఉపాధిని దూరం చేస్తున్నారు. స్వంత వాహనాల్లో, స్వంత డ్రైవింగ్ వల్ల ప్రయాణించి గెజిటెడ్ అధికారులు రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి ఆదర్శంగా ఉండాల్సిన గెజిటెడ్ అధికారులు కాసులకు కక్కుర్తి పడి ఇలా చులకన అవుతున్నారు.

**కక్కుర్తితో ప్రమాదాల బారిన పడుతున్న అధికారులు**

వాహనాల విషయంలో కక్కుర్తి పడుతున్న అధికారులు రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల నెన్నెల తహసీల్దార్ సబ్బ రమేష్ వాహనం ప్రమాదానికి గురైంది. దాదాపు పది, పదిహేను రోజులు చికిత్స పొంది తిరిగి విధుల్లో చేరాడు. ప్రైవేట్ వాహనం వాడుతున్నట్లు నకిలీ పత్రాలతో ప్రతి నెల ముప్పై మూడు వేల రూపాయల బిల్లులు దండుకుంటున్న తహసీల్దార్ అదే నిబంధనలకు అనుగుణంగా ప్రైవేట్ వాహనం వాడితే, బ్యాడ్జి లైసెన్స్ కలిగిన డ్రైవర్ ఉండటం వల్ల ప్రమాదం జరిగి ఉండేది కాదని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ప్రజల సొమ్ముతో జీతాలు తీసుకునే అధికారులు ఇలా నిరుద్యోగ యువత ఉపాధిని సైతం దూరం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలా తప్పుడు పత్రాలతో లక్షల్లో బిల్లులు పొందుతున్న అధికారుల్ని గుర్తించి వారినుంచి ఇప్పటి వరకు పొందిన బిల్లులను రికవరీ చేయాలని, ఏసీబీ అధికారులు ఇలాంటి తప్పుడు బిల్లులపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. కాగా తప్పుడు పత్రాలతో వాహన బిల్లుల విషయమై తహసీల్దార్ సబ్బ రమేష్ ను వివరణ కోరడానికి ఫోన్ లో ప్రయత్నించగా ఆయన స్పందించలేదు.

# లిఫ్ట్ పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే పల్లా

**తరిగొప్పుల (జనంసాక్షి)**



తరిగొప్పుల మండలంలో 52చెరువులకు సాగునీరు అందించుటకు మొదటి లిఫ్ట్ పునఃనిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమంకు ముఖ్య అతిధిగా ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి హాజరై ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ. తరిగొప్పుల నుంచి 15 గ్రామాల్లోని ప్రతి చెరువుకు రెండు పంటల్లో కావాల్సిన నీళ్లు వస్తున్నాయంటే జీవితకాలం ఆనందంగా ఉంటుంది. కొన్ని గ్రామాలకు నీళ్లు కావాలని సంబందించిన రైతులు అడుగుతున్నారు. అందరినీ పిలిపించి అధికారులతో మాట్లాడి నీళ్ల ఇప్పించే బాధ్యత నాదే. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పార్టీలకు ఆతీతంగా పైసా ఖర్చు లేకుండా వ్యక్తిగతంగా వైద్యం విషయంలో నీలిమ హాస్పిటల్ ద్వారా వందలాది మందికి సేవలందిస్తున్నా. ఇలానే ఈ సేవ కొనసాగుతుంది. నియోజకవర్గంలోని ప్రజలందరికి ఈ వచ్చే ఏడాదిలో సాగు నీరందాలి. విద్య, వైద్యంలో మంచి ప్రగతిని సాధించాలి. భవిష్యత్తులో కూడా ఇలానే సేవలు కొనసాగిస్తా. ఈ కార్యక్రమంలో బీ ఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి, అధికార


ప్రతినిధి చిలువేరు లింగం, సుదర్శన్ గౌడ్, జూమ్ లాల్, పద్మజా రెడ్డి, అర్జుల సంపత్ రెడ్డి, రామరాజు, తాళ్లపల్లి రాజేశ్వర్, సాయిల రాజు, సుధీర్, సంజీవులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# గత పాలకుల నిర్లక్ష్యంతో కోట్ల నిధులు వృథా

**బ్రహ్మణ్ గావ్ ఎత్తి పోతల పథకం ను పరిశీలించిన ఎమ్మెల్యే రామరావ్ పటేల్**

**ముధోల్, జనవరి 08(జనం సాక్షి)**






6 వేల ఎకరాలకు సాగునీరు అందించడం లక్ష్యంగా అప్పటి ప్రభుత్వం 80 కోట్ల రూపాయల నిధులు వెచ్చించి బ్రహ్మణ్ గావ్ ఎత్తిపోతల పథకాన్ని నిర్మించినప్పటికీ, ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యంతో ఎత్తిపోతల లిఫ్టింగ్ పరికరాలు దొంగతనానికి గురవ్వడం రైతంగానికి చుక్క నీరు అందలేదు. ఈ విషయాన్ని అసెంబ్లీ సమావేశంలో ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ శాసనసభ దృష్టికి తీసుకు రావడంతో మంత్రి ఉత్త కుమార్ రెడ్డి స్పందించారు. యుద్ధప్రాతిపాదికన ఎత్తిపోతల పథకాలకు నిధులు మంజూరు చేస్తామని చెప్పడంతో అందులో భాగంగానే ఎమ్మెల్యే రైతులతో కలిసి ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించారు. లిఫ్ట్ ప్రాంతంలో ఎలక్ట్రానిక్ పరికరాలు, పంపింగ్ పనులకు సంబంధించిన పరికరాలు దొంగతనానికి గురయ్యాయి. ఈ సందర్భంగా ఏమేం సౌకర్యాలు కావాలో రైతులు అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమస్యను శాసనసభ దృష్టికి తీసుకురావడంతో ప్రభుత్వం తక్షణ సహాయంగా 6 కోట్ల రూపాయల నిధులు ఇస్తుందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి ఉత్తంకుమార్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే గన్నోరా, రువి, రువి తండా, బ్రహ్మణ్ గావ్, కిర్గుల్ కె, కిర్గుల్ బి. గ్రామాల్లో 6000 ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ఎమ్మెల్యే వెంట నాయకులు నర్సా గౌడ్, సుదర్శన్, సతీష్ రెడ్డి, తాటివార్ రమేష్, మాజీ ఎంపిటిసిలు దేవోజీ భూమేష్, లక్ష్మి నారాయణ, కిష్టారెడ్డి, రాజు, బాలాజీ, శేఖర్ సంబంధిత శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజలకు మరింత చేరువలో నిర్మల్ జిల్లా పోలీసులు

**ముధోల్, జనవరి08(జనం సాక్షి)**

నిర్మల్ జిల్లా లోని భైంసా ఎస్పి ట్రాన్సిట్ క్యాంప్ లో ఏర్పాటు చేసిన నిర్మల్ పోలీస్.... మీ పోలీస్ కార్యక్రమం జిల్లా ఎస్.పి. డా.జి.జానకి షర్మిల భైన్సా ఏ ఎస్పి అవినాష్ కుమార్ తో పాటు సీ ఐ ఎస్సై లతో కలసి పాల్గొన్నారు.. నిర్మల్ జిల్లాలోని భైంసాలో ఎస్పి క్యాంప్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ ప్రజల ఫిర్యాదులు స్వీకరించారు. ఇందులో భాగంగా ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులకు పలు సూచనలు చేశారు. బుధవారం భైంసా సబ్ డివిజన్ లోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత స్టేషన్ ల యొక్క ఎస్ఐ, సిఐ లకు వెంటనే ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని మరియు పరిష్కారానికి జిల్లా ఎస్పీ జానకి షర్మిల సూచనలు చేశారు.

# మత్తు పదార్థాలపై యువతకు అవగాహన కల్పించాలి




**ఎంపీ కావ్య, ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి..**

**వరంగల్ ప్రతినిధి, జనవరి 8 (జనంసాక్షి)**


గంజాయి ఇతర మత్తు పదార్థాల వినియోగం పట్ల కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పరకాల శాసనసభ్యులు శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. నెహ్రూ యువ కేంద్ర వరంగల్ వారి ఆధ్వర్యంలో యాంటీ నార్కోటిక్స్ బ్యూరో తెలంగాణ గంజాయి మరియు మత్తు పదార్థాల నియంత్రణ పై బొల్లికుంట లోని వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వరంగల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ కడియం కావ్య, పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంజాయి ఇతర మత్తు పదార్థాల వినియోగం, సరఫరా, అక్రమ రవాణా, విక్రయం నివారణకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతుంది అని అన్నారు.ఈ చర్యల యొక్క ముఖ్య ఉద్దేశం ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించడం, నేర ప్రవర్తనలను అరికట్టడం, యువతను పదార్థాల వలన కలిగే ప్రమాదాల నుంచి కాపాడడం అని తెలిపారు.

గంజాయి,నార్కొటిక్ డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. డ్రగ్ ఫ్రీ తెలంగాణ గా కు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు మత్తు పదార్థాల సరఫరా, విక్రయం, వినియోగంపై నిఘా ఉంచి సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు చేపట్టాలన్నారు.యువత గుట్కా,మత్తు పదార్థాలకు అలవాటు పడితే ప్రమాదకరమైన రోగాల బారిన పడి ప్రాణాలకే ప్రమాదమని,తద్వారా కుటుంబాలు రోడ్డు నా పడతాయని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# అల్లు అర్జున్ విడుదలలో ఎలాంటి తప్పిదం లేదు

- జైళ్ల వార్షిక నివేదిక విడుదలలో డిజి సౌమ్యా మిశ్రా



**హైదరాబాద్, జనవరి8 (జనంసాక్షి) :** ఇటీవల పుష్ప 2 సినిమా విడుదల సందర్భంగా జరిగిన సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటన ఎంత దుమారం రేపిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ ఘటనలో హీరో అల్లు అర్జున్ అరెస్టయిన సంగతి కూడా తెలిసిందే. అయితే.. నాటకీయ పరిణామాల మధ్య అల్లు అర్జున్ అరెస్ట్ అవ్వడంపై పెద్ద ఎత్తున చర్చ జరిగింది. ఇదిలా ఉండగా, అల్లు అర్జున్ విడుదల సమయంలో వెనుక గేట్ నుండి పంపడంపై కూడా పలు అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ అంశంపై క్లారిటీ ఇచ్చారు జైల్ డీజీ సౌమ్య మిశ్రా. అల్లు అర్జున్ ను జైలు వెనుక గేటు నుండి పంపడంలో తమ నుండి ఎలాంటి తప్పు లేదని స్పష్టం చేశారు సౌమ్య మిశ్రా. జైళ్ల వార్షిక నివేదిక విడుదల సందర్భంగా మాట్లాడుతూ.. ఈ మేరకు సౌమ్య వ్యాఖ్యలు చేశారు. చివరిసారిగా 2019 లో వార్షిక సమావేశం ఏర్పాటు చేశామని.. 2024 లో జైల్ అదాలత్ లో 1045 లో అవకాశం కల్పించామని అన్నారు సౌమ్య. 2650 మంది ఖైదీలు స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రాంలో ట్రైనింగ్ తీసుకుంటు న్నారని.. సత్ప్రవర్తన కలిగిన 213 మంది ఖైదీలను విడుదల చేసినట్లు తెలిపారు. 2024 లో 8 మంది ఖైదీలకు బ్యాంక్ లోన్స్ ఇచ్చామని.. జైల్లో ఉండి 750 మంది డిగ్రీ పూర్తి చేశారని, 225 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్ పట్ట పొందారని అన్నారు. జైల్లో ఉన్న ఖైదీల ద్వారా ఇంటికి అవసరమైన పరికరాలను ఖైదీలతో తయారు చేయించామని.. ఖైదీల నుండి టైలరింగ్, ప్రింటింగ్ ప్రెస్ బేకరి యూనిటి,పౌల్టీ వంటి పరిశ్రమలు ఏర్పాటు చేశామని అన్నారు. జైల్లో ఉన్న ఖైదీలకు ఉపాధి కల్పనకు అవసరమైన జాతీయ చమురు కంపెనీలతో 29 అవుట్ లే అవుట్ లెట్ల ను ఏర్పాటు చేశామని అన్నారు సౌమ్య.నుమయిష్ ఎగ్జిబిషన్ లో మా స్టాల్ ఏర్పాటు చేశామని.. గతంలో నుమయిష్ ఎగ్జిబిషన్ లో ఏర్పాటు చేసిన స్టాల్ కి తెలంగాణ ప్రభుత్వం అవార్డు ఇచ్చిందని తెలిపారు సౌమ్య. జైళ్లను ప్లాస్టిక్ రహితంగా మార్చేందుకు కృషి చేస్తున్నామని, త్వరలోనే రాష్ట్రంలో ఉన్న జైళ్లను మరమ్మత్తులు చేయడానికి ప్రభుత్వం సన్నద్ధం అవుతుందని సౌమ్య తెలిపారు.

# సింగరేణికి స్పెషల్ క్యాంపెన్ 4.0 పురస్కారం

- కేంద్ర బొగ్గు శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి చేతుల మీదుగా స్వీకరించిన సీఎండీ ఎన్.బలరామ్

(ప్రత్యేక ప్రతినిధి / జనంసాక్షి)



పరిసరాల పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ ఎక్కువ సంఖ్యలో ప్రదేశాలను పరిశుభ్రం చేసినందుకు సింగరేణి కాలరీస్ కు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన స్పెషల్ క్యాంపెన్ 4.0లో ఎక్కువ ప్రాంతాలను పరిశుభ్ర పరిచిన (మ్యాగ్జిమమ్ నెంబర్ ఆఫ్ సైట్స్ క్లీన్డ్ ) విభాగంలో అవార్డు వరించింది. ఢిల్లీలో బొగ్గు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన చింతన్ శివిర్ లో భాగంగా మంగళవారం రాత్రి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి చేతుల మీదుగా సింగరేణి సీఎండీ ఎన్. బలరామ్ ఈ అవార్డును స్వీకరించారు. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ పరిధిలోని కోలిండియా, అనుబంధ సంస్థలు, నైవేలీ లిగ్నైట్ సంస్థల్లో గత ఏడాది అక్టోబరు 2వ తేదీ నుంచి అక్టోబరు 31వ తేదీ వరకు స్పెషల్ క్యాంపెన్ 4.0 పేరిట స్వచ్ఛతా కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. ఇందులో సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాల్లో 157 చోట్ల పరిసరాలను పరిశుభ్రం చేయడాన్ని స్వీయ లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. 216 ప్రదేశాల్లో పరిశుభ్రత కార్యక్రమాలను చేపట్టడం విశేషం. ఈ నేపథ్యంలో ఎక్కువ సంఖ్యలో ప్రదేశాలను శుభ్ర పరచిన విభాగంలో ఈ పురస్కారం లభించింది. సింగరేణి చేపట్టిన పరిశుభ్రత కార్యక్రమానికి గుర్తింపు లభించడంపై సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ మాట్లాడుతూ.. దేశ ఇంధన అవసరాలకు బొగ్గు ఎంత అవసరమో.. ఆరోగ్య భారతావనికి పరిశుభ్రత అంతే అవసరమన్నారు. సింగరేణి పరిశుభ్రతకు పెద్దపీట వేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బొగ్గు శాఖ కార్యదర్శి విక్రమ్ దేవ్ దత్, బొగ్గు శాఖ అదనపు కార్యదర్శులు రూపేందర్ బ్రార్, విస్మితా తేజ్, సింగరేణి జీఎం బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణాలు కాపాడే పోలీసులకే రక్షణ లేదు

- రిటైర్మెంట్ ఉద్యోగులకు శాపంగా కాంగ్రెస్ : హరీశ్‌రావు



**హైదరాబాద్,జనవరి 8 (జనంసాక్షి) :** హెూంమంత్రిగా కూడా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారూ.. మీ పాలనలో ప్రజల ప్రాణాలు కాపాడిన పోలీసుల జీవితాలకే 'భద్రత' లేకుండా పోవడం సిగ్గు చేటు అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. రిటైర్డ్ పోలీసు ఉద్యోగి సాధిక్ అలీ 8 నెలల నుంచి తనకు రావాల్సిన బెనిఫిట్స్ కోసం ఎదురుచూస్తున్నానని, ఇక అతహత్యే శరణ్యం అంటూ ఆవేదన చెందుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. కాంగ్రెస్ పాలన అన్ని వర్గాలతో పాటు రిటైర్మెంట్ ఉద్యోగులకు కూడా శాపంగా మారిందని హరీశ్‌రావు విమర్శించారు. విశ్రాంత జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా గడిపే రోజుల్లో వారిని మానసిక క్షోభకు గురి చేయడం హేయమైన చర్య అని మండిపడ్డారు. దాదాపు 7,000 మంది ప్రభుత్వ ఉద్యోగులు వారికి హక్కుగా రావాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం ఏడాది కాలంగా ఎదురుచూస్తున్నా, ప్రభుత్వం పట్టించుకోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. కోర్టుకు వెళ్లి ఆర్డర్ తెచ్చుకుంటే గాని రిటైర్మెంట్ బెనిఫిట్స్ పొందలేని దుస్థితికి విశ్రాంత ఉద్యోగులను నెట్టడం శోచనీయమని విమర్శించారు.

# కేటీఆర్ లంచ్‌మోషన్ పిటిషన్‌కు కోర్టు అనుమతి

**హైదరాబాద్, జనవరి 8 (జనంసాక్షి) :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లంచ్ మోషన్ పిటిషన్‌కు హైకోర్టు అనుమతినిచ్చింది. ఫార్ములా ఈ కార్ రేస్ వ్యవహారంలో ఈ నెల 9వ తేదీన విచారణకు రావాలని ఏసీబీ నిన్న నోటీసులు పంపించింది. అయితే ఈ విచారణకు లాయర్లతో హాజరయ్యేందుకు అనుమతించాలని కేటీఆర్ లంచ్ మోషన్ పిటిషన్ వేశారు. కేటీఆర్ వేసిన లంచ్ మోషన్ పిటిషన్‌కు హైకోర్టు అంగీకరించింది. మధ్యాహ్నం 2.30 గంటలకు ఈ పిటిషన్‌పై విచారణ జరుపుతామని తెలిపింది. కాగా, ఫార్ములా ఈ-కార్ రేస్‌పై అసెంబ్లీ సమావేశాల్లో చర్చ పెట్టాలని కోరితే ముఖ్యమంత్రి ఎందుకు పారిపోయారని, రేవంత్‌రెడ్డికి దమ్ముంటే.. ఆయ న జూబ్లీహిల్స్ ప్యాలెస్‌లో మీడియా సమక్షంలో చర్చ పెడితే తాను రెడీ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ చేశారు. ఆ తర్వాత ఏసీబీ విచారణకైనా, ఈడీ విచారణకైనా సిద్ధమేని స్పష్టంచేశారు. రాజ్యాంగం, న్యాయస్థానాలు, న్యాయమూర్తులపై తమకు సంపూర్ణ విశ్వాసం ఉన్నదని, తనపై మోపిన అక్రమ కేసులపై న్యాయస్థానాల్లోనే కొట్లాడుతామని తేల్చిచెప్పారు. ఈ కేసులు ఆరంభం మాత్రమేనని, నాలుగేండ్లలో ఇంకా ఎన్ని కేసులు పెట్టినా ఎదుర్కొంటామని, దేశానికి రక్షణ కవచంలా న్యాయ వ్యవస్థ ఉన్నదని పేర్కొన్నారు. 'నిజాయితీకి ధైర్యం ఎకువ.. రోషంగల్ల తెలంగాణ బిడ్డగా ఏ విచారణనైనా ఎదుర్కొనేందుకు సిద్ధం' అని చెప్పారు. లాయర్లతో విచారణకు బుధవారం హైకోర్టు అనుమతిస్తే 9న ఏసీబీ విచారణకు లాయర్లతో వెళ్తానని తెలిపారు. 16న ఈడీ విచారణకు కూడా హాజరవుతానని, వారు ఏమడిగినా సమాధానం చెప్తానని, దాపరికం లేదు.. దాయాల్సిందేమీ లేదని వెల్లడించారు.

# విద్యార్థుల బ్రేక్‌ఫాస్ట్‌లో గొడ్డుకారం బాధాకరం : కేటీఆర్



**హైదరాబాద్, జనవరి 8 (జనంసాక్షి) :** మహాత్మాగాంధీ యూనివర్సిటీలోని హాస్టల్‌లో విద్యార్థినులకు బ్రేక్‌ఫాస్ట్‌కు బదులు గొడ్డుకారం అన్నం పెట్టడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ స్కూల్ పిల్లలకు పౌష్టికాహారం కింద ఉప్పు, కారం, బియ్యం.. ఈ అమానవీయ పరిస్థితిపై స్పందించగల జాతీయ లేదా ప్రాంతీయ మీడియాకు ఈ శీర్షికను సూచిస్తున్నామని కేటీఆర్ తెలిపారు. హాస్టల్ విద్యార్థినులకు గొడ్డు కారంతో భోజనం పెట్టడంపై కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీపైనా కేటీఆర్ విమర్శలు గుప్పించారు. ప్రియాంక గాంధీ 2019లో ఆమె చేసిన ప్రకటనను గుర్తు చేసుకుని తెలంగాణ విద్యార్థులకు లబ్ధి చేకూర్చాలని సూచించారు. లేదా యూపీలో జరిగినప్పుడే దీన్ని జాతీయ సమస్యగా పరిగణిస్తారా? వేరే రాష్ట్రంలో జరిగిన అలాగే చూస్తారా అని నిలదీశారు. ఇది తెలంగాణ కాబట్టి ఉప్పు మాత్రమే కాకుండా.. ఉప్పుతో పాటు కారం కూడా ఉండటంతో వార్తకు స్పైసీనెస్ తగ్గిందా? లేదా సమస్య తీవ్రత తగ్గిందని భావిస్తున్నారా అని ప్రశ్నించారు.

# పెన్షన్‌పై సీలింగ్ ఎత్తివేయాలి

- కరువుభత్యంతో కూడిన కనీస పెన్షన్ 9 వేలు చెల్లించాలి
- ఈపీఎస్ పెన్షనర్ల రాష్ట్ర సదస్సు రాష్ట్ర అధ్యక్షులు పి.నారాయణరెడ్డి







**హైదరాబాద్, జనవరి 8 (జనంసాక్షి) :** పెన్షన్‌పై సీలింగ్ ఎత్తివేయాలని ఈపీఎస్ పెన్షనర్ల రాష్ట్ర సదస్సు రాష్ట్ర అధ్యక్షులు పి.నారాయణరెడ్డి అన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో, ఈపియస్ పెన్షనర్ల రాష్ట్ర సదస్సు రాష్ట్ర అధ్యక్షులు పి. నారాయణ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సుకు కేంద్ర కార్మిక సంఘాల నాయకులు బాల్ రాజ్ ఏఐటియుసి, ఎస్ భూపాల్ సిఐటియు, కె. సూర్యం టియుసిఐ, ఎం శ్రీనివాస్ ఐఎఫ్ టియు, జాతీయ కమిటీ అధ్యక్షులు ధర్మజన్, ప్ర. కా. అతుల్ దిగే హాజరయ్యారు. సదస్సు అధ్యక్షులు నారాయణ రెడ్డి మాట్లాడుతూ పెన్షన్‌పై సీలింగ్ ఎత్తివేయాలని కరువుభత్యంతో కూడిన కనీస పెన్షన్ ప్రతి నెలకు రు. 9000 చెల్లించేదాకా పోరాడుతామని తెలిపారు. ముఖ్య అతిథి జాతీయ కమిటీ ప్రధాన కార్యదర్శి అతుల్ దిగే మాట్లాడుతూ రానున్న కాలంలో కేంద్రంలో అధికారంలో ఉన్న రాజకీయ పార్టీ పెన్షనర్ల విషయంలో అనుసరిస్తున్న విధానాలను ప్రజలకు వివరించి ఈ ప్రభుత్వాన్ని అధికారంలోంచి దింపివేస్తామన్నారు. జాతీయ కమిటీ అధ్యక్షులు ధర్మజన్ మాట్లాడుతూ పిఎఫ్ కార్యాలయం హయ్యర్ పెన్షన్ మంజూరులో చేస్తున్న జాప్యాన్ని వ్యతిరేకిస్తూ పిఎఫ్ కార్యాలయాలయాలను ముట్టడిస్తామన్నారు. ఏఐటియుసి నాయకులు బాలరాజు మాట్లాడుతూ ప్రావిడెంట్ ఫండ్ లో ఉద్యోగులు దాచుకున్న సొమ్మును కార్పొరేట్లకు అప్పనంగా అప్పజెప్పడాన్ని దుయ్యబట్టారు. సిఐటియు నాయకులు భూపాల్ మాట్లాడుతూ పెన్షనర్స్ సంఘం చేస్తున్న పోరాటాలకు సంపూర్ణ మద్దతు ఇస్తామని, ప్రత్యక్ష కార్యాచరణలో కూడా పాల్గొంటామని హామీ ఇచ్చారు. టియుసిఐ నాయకులు కె. సూర్యం మాట్లాడుతూ ఈరోజు పెన్షనర్లు నిర్వహిస్తున్న పోరాటం 78 లక్షల మంది పెన్షనర్ల ది మాత్రమే కాదని దేశవ్యాప్తంగా ఆరు కోట్ల మంది పోరాటమనీ, ఈ పోరాటాలకు కార్మిక సంఘాల మద్దతు పూర్తిగా ఉంటుందని, కార్పొరేట్ల కడుపులు నింపడం మానుకోవాలని డిమాండ్ చేశారు. ఐఎఫ్ టియు నాయకులు ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ రోజు పెన్షనర్లే కాదు, ఉద్యోగులు, కార్మికుల సమస్యలకు ప్రధాన మూలం ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు విధానాలలో ఉన్నాయి. ఆ విధానాలను వ్యతిరేకించకుండా సమస్యలు పలిష్కరించు కోలేమని తెలిపారు. పెన్షన్ అనేది ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగి గౌరవప్రదమైన జీవితం గడిపేలా ఉండాలని అప్పటిదాకా ఐక్య పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సదస్సులో రాష్ట్ర నాయకత్వం ఎం జనార్ధన్ రెడ్డి, ఎన్ బ్రహ్మాచారి, ఎం నరహరి, కె వైకుంఠరావు, ఎం క్రిష్ణారావు, జి. అశోక్, రాధాకృష్ణ, శంకర్ రావు, రామారావు, బిజెఎం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మాధవ హిల్స్ కాలనీకి మార్గమేదీ?





- కొండాపూర్‌లో అక్రమంగా రహదారి ఆక్రమణ
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న స్థానికులు, నివాసితులు

**శేరిలింగంపల్లి, జనవరి 8 (జనంసాక్షి) :** కొండాపూర్‌లోని మాధవ హిల్స్ కాలనీవాసులకు గత కొన్నాళ్లుగా తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. గుడ్‌ట్కెమ్స్ వైన్‌షాప్ పక్కనే కొందరు రోడ్డును అక్రమంగా ఆక్రమించడంతో రాకపోకలకు అసౌకర్యంగా మారింది. స్థానికులను వారి నివాసాలకు వెళ్లకుండా అడ్డగించే చర్యలకు పాల్పడుతుండటంతో మాధవ హిల్స్‌కాలనీ ప్రజలకు రోజువారీ కార్యకలాపాలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కాలనీవాసులకు అదొక్కటే ప్రధాన మార్గం కావడం, అక్కడ పరదాలు కట్టేసి కొందరు వ్యక్తులు రోడ్డును ఆక్రమిస్తుండటం స్థానికుల దినచర్యలకు ఆటంకాలుగా మారాయి. వెంటనే ఈ ఆక్రమణలను తొలగించి ప్రజలకు రోడ్డును పునరుద్ధరించడానికి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి) వెంటనే చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. లేదంటే ప్రజలు రోడ్లపై తిరిగేందుకు కూడా కష్టమవుతుందని స్థానికులు మండిపడుతున్నారు. జీహెచ్ఎంసీ టౌన్-ప్లానింగ్ నిబంధనల ప్రకారం, ఏ కాలనీ లేదా గేటెడ్ లేఅవుట్ అనుమతి లేకుండా గేట్ లేదా బారికేడ్‌ను పెట్టకూడదు. కానీ మాధవహిల్స్‌లో మాత్రం అనధికారికంగా గేటు మాదిరిగా ఏర్పాటుచేయడం గమనార్హం. అందువల్ల జీహెచ్ఎంసీ అధికారులు ఆ ప్రాంతాన్ని పరిశీలించి, అక్రమ నిర్మాణాలను తొలగించాలని, ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలని మాధవ హిల్స్ కాలనీ వాసులు కోరుతున్నారు.




# గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి

**నడికూడ, జనవరి 8 (జనం సాక్షి):** గ్రామాల సమగ్రాభివృద్ధి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. బుధవారం రోజున పరకాల నియోజకవర్గం నడికూడ మండలంలో పర్యటించారు. ఇందులో భాగంగా రాయపర్తి గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో సుమారు పది లక్షల రూపాయల విలువ గల అంతర్గత సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ నాగరాజు, ఎంపీడీవో శ్రీనివాస్, పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, నడికూడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్రదేవేందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ మలహర్రావు, ఏఎంసి డైరెక్టర్ బోగం కమల, కాంగ్రెస్ నాయకులు పాడి ప్రతాపరెడ్డి, పర్నెం తిరుపతిరెడ్డి, పర్నెం మల్లారెడ్డి, గాదె శంకరయ్య, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మారం దేవేందర్ రెడ్డి, నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పీహెచ్‌సీల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



**వరంగల్ బ్యూరో, జనవరి 08 (జనం సాక్షి) :** అన్ని పీహెచ్సీలలోసాధారణ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ ఆసుపత్రులలో జరిగే ప్రసవాలను ఈ నెలలో కనీసం రెండు శాతం ఎక్కువయ్యేలా చూడాలని హనుమకొండ జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులతో ఈరోజు హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల ప్రగతిని పీహెచ్సీ ల వారిగా సమీక్షించారు. ఎవరైతే తమ లక్ష్యాన్ని పూర్తిగా అందుకోలేదో వారు మార్చి వరకు వరకు 100% లక్ష్యాన్ని సాధించాలన్నారు. ముఖ్యంగా ప్రతి పీహెచ్సీలో నెలకు ఒక సాధారణ ప్రసవం జరిగేలా చర్యలు తీసుకోవాలని, 24/7 ఆరోగ్య కేంద్రాలు పూర్తిస్థాయిలో పనిచేయాలని సాధారణ ప్రసవాలు రెగ్యులర్గా నిర్వహించాలన్నారు. ఈ నెలలో ప్రభుత్వ ఆసుపత్రిలలో జరుగుతున్న ప్రసవాలను రెండు శాతం అదనంగా జరిగేలా కృషి చేయాలన్నారు. సి సెక్షన్ ప్రసవాలను తగ్గించాలని అలాగే ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలను ప్రోత్సహించేలా క్షేత్రస్థాయి సిబ్బంది అవగాహన కలిగించాలన్నారు. అసంక్రమిత వ్యాధుల రిస్క్రినింగ్ మార్చి వరకు 100% పూర్తి చేయాలని అలాగే వారికి ఫాలోఅప్ సేవలు కూడా 100% అందించాలన్నారు. టిబి కేసులను గుర్తించేందుకు పరీక్షలు ఎక్కువగా నిర్వహించాలని ,సరియైన చికిత్స అందించాలని, చికిత్స తీసుకుంటున్న వారికి 100% ఫాలోఅప్ సేవలు అందించాలన్నారు. పీహెచ్‌సీలో ఉన్నటువంటి సమస్యలను వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. చిన్నచిన్న అవసరమైనటువంటి రిపేర్లు, ప్లంబింగ్ ఎలక్ట్రిసిటీ సంబంధించిన కొన్ని సమస్యలను దృష్టికి తీసుకురాగా అవన్నీ డిఎంహెచ్ఓకి సమర్పించాలని దానికి అనుగుణంగా తగు చర్యలు తీసుకుంటామన్నారు. డిఎంహెచ్వో డాక్టర్ అప్పయ్య వైద్యాధికారులతో మాట్లాడుతూ మొదటి ప్రసవం ఆయన వారందరూ ,రెండవ కాన్పు సంబంధించి స్థానిక పిఎసిలో వైద్యాధికారి సంప్రదించి ,పరీక్షించిన అనంతరమే ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రికి రిఫర్ చేయాలని సూచించారు. లింగ నిర్ధారణ పరీక్షలు, ఎంటిపి చట్టం నియమానికి వ్యతిరేకంగా అబార్షన్లు నిర్వహించే వారి గురించి ఫిర్యాదు చేయడానికి కలెక్టరేట్లో ఫిర్యాదులు పెట్టే ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. దీనికి సంబంధించిన కంప్లైంట్ బాక్స్, మెయిల్ ఐడిని జిల్లా కలెక్టర్ గారు ఆవిష్కరించారు. అలాగే ప్రత్యేకంగా ఒక మెయిల్ ఐడిని రూపొందించామన్నారు. 104,181,1098,100 టోల్ ఫ్రీ నెంబర్లకుఫిర్యాదు చేయవచ్చన్నారు.

# ఆర్మీ కెప్టెన్‌గా చెప్పుకొని.. లక్షల్లో వసూలు

**లక్నో,జనవరి 8 (జనంసాక్షి) :** ఒడిశాకు చెందిన 40 ఏళ్ల వ్యక్తి.. ఆర్మీ కెప్టెన్ అని చెప్పుకుంటూ.. మహిళల్ని మోసం చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. బాలాసోర్ జిల్లాకు చెందిన హైదర్ అలీ అనే వ్యక్తి.. రిలేషన్‌షిప్ పేరుతో మహిళలతో పరిచయం పెంచుకునేవాడు. ఆ తర్వాత వాళ్ల నుంచి లక్షల్లో డబ్బులు వసూల్ చేసేవాడు. పోలీసుల వివరాల ప్రకారం.. తన పేరు హర్తిక్ బిగ్లో అని, ఆర్మీ మెడికల్ కార్ప్స్ ఆఫీసర్‌ను అంటూ అతను పరిచయం చేసుకునే వాడు. ఆడవాళ్లతో పరిచయం పెంచుకున్నాక, ఏవేవో కారణాలు చెబుతూ వారి నుంచి డబ్బులు లాగేవాడు. డబ్బులు ముట్టిన తర్వాత ఇక అతను తన కమ్యూనికేషన్ ముగించేవాడు. ఆ తర్వాత మరో లొకేషన్‌కు వెళ్లి కొత్త టార్గెట్లను వెతికేవాడు అని తెలుస్తోంది. మహిళల్ని బెదిరించి వసూల్ చేసిన డబ్బుతో చాలా విలాసవంతమైన జీవితాన్ని గడిపేవాడు. లక్నోలో ఓ మహిళ పరిచయం అయిన తర్వాత సీన్ మారింది. అతనిపై పోలీసు ఫిర్యాదు ఇవ్వడంతో .. ఆ వ్యక్తి నాటకాలు బయటపడ్డాయి. హైదరాబాద్, కేరళ, కర్నాటక, బెంగా ల్ రాష్ట్రాల్లో హైదర్ అలీ సెక్యూర్టీ సంస్థల్లో పనిచేశాడు. ప్రతి సిటీలోనూ అతను మహిళల్ని వంచించినట్లు తెలుస్తోంది. ఆర్మీ దుస్తుల్లో ఉన్న ఫోటోలను అతను ఇన్‌స్టాగ్రామ్ ప్రొఫైల్స్‌లో పోస్టు చేసేవాడు. ఇండియన్ కమాండో హార్దిక్, ఆర్మన్‌బిగ్లో, ఆర్మీబెగ్లో, సోల్జర్స్ 3889 పేర్లతో అతను ప్రొఫైల్స్ క్రియేట్ చేశాడు. ఆర్మీ దుస్తులు, త్రీస్టార్ ఫ్లాప్స్, ఆర్మీ బీరెట్, ఫేక్ ఆధార్ కార్డు, ఆర్మీ క్యాంటీన్ కార్డు లాంటి వాటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అతనికి ఏమైనా క్రిమినల్ రికార్డు ఉందా లేదా అన్న కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. తనతో శారీరక సంబంధం పెట్టుకుని, డబ్బులు ఎత్తుకెళ్లినట్లు ఫిర్యాదు ఇచ్చిన వ్యక్తి పేర్కొన్నట్లు పోలీసు అధికారి నిపున్ అగర్వాల్ తెలిపారు. మతాన్ని చెప్పకుండానే అందరితో పరిచయం పెంచుకున్నట్లు తెలిసింది. అతని కాల్ రికార్డులను పరిశీలిస్తున్నారు. నలుగురు మహిళలతో లింకు ఉన్నట్లు నిందితుడు అలీ చెప్పినట్లు పోలీసులు వెల్లడించారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370